thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

## అర్హులైన భారతీయులకు యూఏఈ వీసా-ఆన్-అరైవల్

న్యూఢిల్లీ : భారతీయ ప్రయాణికుల కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వీసా–ఆన్–అరైవల్ విధానాన్ని అందుబా టులోకి తెచ్చింది. పర్యాటకులు, వ్యాపారవేత్తలు, ప్రవాసులను ఆకర్షించడంతో పాటు యూఏఈకి ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అర్హులైన భారత పౌరులకు 14 రోజుల వ్యవధితో కూడిన వీసా–ఆన్–అరైవల్ సదుపాయాన్ని యూఏఈ కల్పిస్తోం దని అక్కడి భారత రాయబార కార్యాలయం ప్రక టించింది. ప్రయాణికులు కనీసం 6నెలల పాటు చెల్లుబాటయ్యే పాస్‌పోర్టును కలిగి ఉండటంతో పాటు అమెరికా జారీ చేసిన గ్రీన్‌కార్డు/ వీసా, యూరోపియన్ యూనియన్, యూకే దేశాలు మంజూరు చేసిన చెల్లుబాటయ్యే శాశ్వత నివాస పత్రం/ వీసా ఉన్నవారు అర్హులని వివరించింది.

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 355 | కరీంనగర్ ఆదివారం, 2 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00





# ఇసుక సరఫరా..

## హైదరాబాద్‌కు మూడువైపులా స్టాక్ పాయింట్లు: సీఎం రేవంత్

హైదరాబాద్: ఇసుక, ఖనిజాల అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టే పనులకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) నుంచే ఇసుక సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఖనిజాభివృద్ధి శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు. "నిర్మాణరంగ సంస్థలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేయాలి.

సరైన ధరలకు సరఫరా చేస్తే అక్రమాలకు ఆస్కారం ఉండదు. హైదరాబాద్ నగరానికి మూడు వైపులా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. క్వారీలకు జరిమానాలపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. మైనర్ ఖనిజాల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలి" అని సీఎం ఆదేశించారు.

**ఐటీఐల ఆధునికీకరణపై ఆరా..** రాష్ట్రంలోని ఐటీఐలను 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు'(ఏటీసీ)గా ఆధునికీకరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఏటీసీ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యాక్ట్‌పై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

**కొచ్చి విమానాశ్రయం తరహాలో మామునూరు ఎయిర్‌పోర్టు ఉండాలి: సీఎం రేవంత్**... మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎయిర్‌పోర్టుపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, పెండింగ్ పనుల వివరాలు ఆరా తీశారు. కేరళలోని కొచ్చి విమానాశ్రయం తరహాలో మామునూరు విమానాశ్రయం ఉండాలని సూచించారు. నిత్యం యాక్టివిటీ ఉండేలా ఎయిర్‌పోర్టు డిజైన్ చేయాలన్నారు. విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. పనులకు సంబంధించి ప్రతీ నెలా రిపోర్టు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీహరి, ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, మేయర్ సుధారాణి, సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరాజు హాజరయ్యారు.

**కార్మిక శాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష...** ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన నిధులు ప్రభుత్వం వెంటనే అందించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కార్మిక శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా(ఏటీసీ) అప్‌గ్రేడ్ చేసే ప్రక్రియ పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఏటీసీ ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఐటీఐలన్నింటినీ ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఐటీఐలు లేనిచోట ఏటీసీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో లేదా పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఏటీసీలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఏటీసీలలో అవసరమైన సిబ్బంది ఇతర వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. సిబ్బంది నియామకంపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యాక్ట్‌పై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.




# బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోంది?

## కేటీఆర్, కవిత మీటింగ్స్ లో మోగుతున్న సీఎం నినాదాలు

హైదరాబాద్ : ఇప్పుడు బీఆర్ఎస్‌లో చర్చకు కారణం అవుతున్నాయి. ఇంకా చెప్పాలంటే... ఇదెక్కడి గోలరా... బాబూ... అంటూ పార్టీ పెద్దలే తలబాదుకుంటున్న పరిస్థితి. మామూలుగా అయితే... రాజకీయ నాయకులకు మీటింగ్స్‌లో ఇలాంటి నినాదాలు మాంఛి కిక్కు ఇస్తాయి. కానీ... బీఆర్ఎస్‌లో మాత్రం.... ఎవర్రా మీరు.... అసలెవర్రా మీరంతా.... అంటూ నినాదాలు చేస్తున్నవారిని కోపగించుకోవాల్సిన పరిస్థితి వస్తోందట. నాడు ఉద్యమ సమయంలోగాని, పదేళ్లు పవర్‌లో ఉన్నప్పుడుగానీ... బీఆర్ఎస్‌కు ఇలాంటి సమస్య ఎప్పుడూ రాలేదు.

పార్టీ సీఎం అభ్యర్థి ఎవరంటే... ఏంటా పిచ్చి ప్రశ్న. మా నాయకుడు కేసీఆర్ కాకుండా ఇంకెవరుంటారంటూ... ప్రశ్నించిన వాళ్ళనే అసలు మీకు మతుందా అని రివర్స్‌లో అడిగే పరిస్థితి. కానీ.. ప్రతిపక్షంలోకి వచ్చాక సీన్ మారుతోంది, కొత్త నినాదాలు వినిపిస్తున్నాయని అంటున్నారు. చివరికి ఆ స్లోగన్స్‌తో అంతా ఇబ్బందిపడే పరిస్థితి వస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. జిల్లాల్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్ళినప్పుడు ఇటు కేటీఆర్, అటు కవిత మీటింగ్స్‌లో సీఎం నినాదాలు మోగిపోతున్నాయి. అలాంటి సందర్భాల్లో నినదించేవారిని ఆపే ప్రయత్నం కూడా చేయడం లేదని అంటున్నారు. దీంతో అసలు కారు పార్టీలో ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది. ఆ ఎఫెక్ట్స్ చాలవా అన్నట్టు... తాజాగా కేసీఆర్ పార్టీ ఆఫీస్‌కు వచ్చినప్పుడు కూడా సీఎం సీఎం... అంటూ మోతెక్కించారు పార్టీ నాయకులు. కేసీఆర్, కేటీఆర్, కవిత... ఇలా ముగ్గురి మీటింగ్స్‌లో సీఎం నినాదాలు ఏంటి? ఇదంతా తెలిసి జరుగుతోందా? తెలియక జరుగుతోందా అంటూ క్వశ్చన్‌మార్క్ ఫేస్‌లు పెడుతున్నారు కొందరు. తెలంగాణ భవన్‌లో తాజాగా జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి కేసీఆర్ రాగానే... ఒక్కసారిగా సీఎం నినాదాలతో హోరెత్తించగా... చివరికి ఆయనే అసహనం వ్యక్తం చేసిన పరిస్థితి. ఒర్లకండిరా బాబూ.. దండం పెడతానంటూ ఆయన వారించాల్సి వచ్చిందని అంటున్నారు. ఆ సంగతి అలా పక్కనబెడితే... అసలు కేసీఆర్ యాక్టివ్ పాలిటిక్స్‌లో ఉండగానే... అదే కుటుంబం నుంచి మిగతా ఇద్దరి సభల్లో సీఎం నినాదాలేంటి? మేం ఎవరివైపు ఉండాలి? అంటూ కేడర్ కన్ఫ్యూజ్ అవుతున్నట్టు తెలుస్తోంది. సాధారణ ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ళు ఉంది. అంత సుదీర్ఘ సమయం ఉన్నప్పుడు గులాబీ కోయిలలు తొందపడి కూయడం, వాళ్ళని కేటీఆర్, కవిత వారించకపోవడం చూస్తుంటే... ఎక్కడో తేడా కొడుతోందని అంటున్నారు పొలిటికల్ పరిశీలకులు. ఈ విషయంలో క్లారిటీ లేకుంటే... పార్టీలోని సీనియర్ నాయకులు సైతం గందరగోళపడే ప్రమాదం ఉందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా అధికారంలోకి వస్తామని, మళ్ళీ కేసీఆరే సీఎం అవుతారని కవిత, కేటీఆర్ ఓవైపు చెబుతూనే... మరోవైపు తమ సమావేశాల్లో సీఎం స్లోగన్స్‌ని కట్టడి చేయకపోవడం ఏంటో కూడా అర్థం కావడంలేదట సామాన్య కార్యకర్తలకు. దీంతో పార్టీలో ముందు ముందు ఏం జరగబోతోందని గుసగుసలాడుకుంటున్న పరిస్థితి. ఈ సీఎం స్లోగన్స్ బీఆర్ఎస్ పాలిటిక్స్‌ని ఏ మలుపు తిప్పుతాయో చూడాలంటున్నారు పొలిటికల్ పండిట్స్.




హైదరాబాద్ : మార్చి6న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సెక్రటేరియేట్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో కీలక అంశా లపై చర్చించడంతో పాటు బిల్లులకు ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రంలో రెండో దఫా నిర్వహించిన కులగణన సర్వే, దానికి సంబంధించిన రిపోర్టుపై చర్చించే అవకాశం ఉంది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు రెండు బిల్లులకు ఆమోదం తెలుపనున్నట్టు తెలిసింది. వీటిలో ఒకటి స్థానిక సంస్థల్లో, మరొకటి విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లకు సంబంధించినది. అలాగే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉంది. మంత్రివర్గ సమావేశంలో ఇతర అంశాలపైనా చర్చించనున్నట్టు తెలుస్తున్నది. అప్పటికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనుండడంతో ఇందిరమ్మ ఇండ్లకు ఆర్థిక సాయం, రేషన్?కార్డుల పంపిణీ ఇతరత్రా వంటి వాటిపై చర్చించనున్నారు.

**రెండో వారంలో బడ్జెట్..** బీసీ రిజర్వేషన్ల బిల్లులను అసెంబ్లీలో ఆమోదించిన తర్వాత సీఎం రేవంత్?రెడ్డితో పాటు మొత్తం మంత్రివర్గం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలను కూడా కలుపుకుని ప్రధాని మోదీని కలవాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిపైనా కేబినెట్‌లో చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్‌సమావేశాలను మొదలుపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. పార్లమెంట్‌సమావేశాలు ఈ నెల 10న మొదలవుతున్నందున.. అంతకంటే ముందే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని యోచిస్తున్నది. లేదంటే పార్లమెంట్?సమావేశాల రోజే అసెంబ్లీ బడ్జెట్‌సమావేశాలను మొదలుపెట్టే అవకాశాన్ని పరిశీలిస్తున్నది. ఆ తర్వాతి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టి, అనంతరం మరుసటి రోజు బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలిపి సభను ఒకట్రెండు రోజులు వాయిదా వేసి ఢిల్లీ వెళ్లాలని అనుకుంటున్నారు.

# ట్రిశావహాల్లో అలజడి!

## అద్దంకికి ఈసారి పక్కా.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే?









హైదరాబాద్ : తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. ప్రస్తుత బలాబలాల ప్రకారం కాంగ్రెస్‌కు 4, బీఆర్ఎస్ పార్టీకి 1కి వచ్చే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. అయితే ఐదో స్థానానికి అభ్యర్థిని దించి బీఆర్ఎస్ పార్టీని దెబ్బకొట్టాలన్నది సీఎం రేవంత్ రెడ్డి వ్యూహంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ సభ్యులు క్రాస్ ఓటింగ్ కు పాల్పడితేనే కాంగ్రెస్ పార్టీ ఐదుకు ఐదు సీట్లు గెలిచే అవకాశం ఉంటేంది.

అదే జరిగితే బీఆర్ఎస్ కు బిగ్ షాక్ అనే చెప్పొచ్చు. మరో వైపు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఒక ఎమ్మెల్సీ ఇవ్వాలని సీపీఐ కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తెస్తోంది. మరో ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఈ అంశంపై ఓ నిర్ణయానికి రానుంది.

**20 మందికి పైగా పోటీ..** ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మందికి పైగా ఎమ్మెల్సీ ఛాన్స్ కోసం పోటీ పడుతున్నారు. ఇందులో అద్దంకి దయాకర్ పేరు ముందు వరుసలో ఉంది.

తనను చట్టసభకు పంపిస్తానని రేవంత్ రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని ఆయన తన సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారు. సీనియర్ నేతలు జగ్గారెడ్డి, జీవన్ రెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ తదితరులు తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అయితే.. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయిన వారికి ఇప్పుడు ఎమ్మెల్సీ ఛాన్స్ ఇవ్వకూడదని హైకమాండ్ నిబంధన పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఈ ముగ్గురికి అవకాశం కష్టమేనన్న ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు మహబూబాబాద్ ఎమ్మెల్యే టికెట్ వదులుకున్న మరో సీనియర్ నేత బెల్లయ్య నాయక్ సైతం తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

ఇంకా రేవంత్ రెడ్డి సన్నిహితుడిగా పేరున్న పటేల్ రమేష్ రెడ్డి సైతం తనకు ఛాన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టీ ఆదేశాల మేరకు తాను సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ నుంచి తప్పుకున్నానని గుర్తు చేస్తున్నారు. ఎంపీగా అవకాశం ఇస్తామని ఆ సమయంలో పార్టీ ఇచ్చిన హామీ అమలు కాలేదని.. ఇప్పుడు ఛాన్స్ ఇవ్వాల్సిందేనని ఆయన పట్టుబడుతున్నట్లు చర్చ సాగుతోంది.

మరో వైపు బీసీ కోటాలో అంజన్ కుమార్ యాదవ్ కూడా గట్టిగానే ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

చురకలు






హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడమే కాకుండా బీసీ కుల గణన ప్రతులు చించడంపై ఆ పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ మల్లన్నకు ఫిబ్రవరి 5 న షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 12 వ తేది లోపు వివరణ ఇవ్వాలని కోరినా.. మల్లన్న నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు మల్లన్నను సస్పెండ్ చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదన్నారు. మల్లన్నను ఎన్నో సార్లు హెచ్చరించినా మార్పు రాలేదన్నారు. బీసీ కుల గణన ప్రతులు చించడంపై ఏఐసీసీ సీరియస్ అయిందన్నారు. మల్లన్న చేసిన వాఖ్యలు చాల తప్పు అని ఆయన పేర్కొన్నారు.




హైదరాబాద్: మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటుందని.. వడగాలులు కూడా తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఏప్రిల్, మే నెల వచ్చేసరికి 44 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 1901 నుంచి 2025 వరకు సరాసరి సగటు తీసుకుంటే ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ప్రధానంగా దక్షిణ, మధ్య తెలంగాణతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వెల్లడించింది.

దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే రెండు డిగ్రీలు పెరిగే సూచనలున్నాయని తెలిపింది. 125 సంవత్సరాల సరాసరి సగటు తీసుకుంటే గాలిలో తేమ చాలా తగ్గిందని పేర్కొంది.

## తెలంగాణ పోలీసులకు గుడ్ న్యూస్.. హామీ నెరవేర్చిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ పోలీసులకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవాలలో, తెలంగాణ పోలీసు కుటుంబాల పిల్లల కోసం ప్రత్యేకంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం నాడు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. సీఎం తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. 5 ఎకరాల్లో పాఠశాల.. సాంకేతిక పరిజ్ఞానంతో విద్య.. చదువు పూర్తి చేసుకున్న సమయానికి అవకాశాలు.. ఇటువంటి పెద్ద ప్రణాళికతో విద్యాపథంలో రాణించేందుకు ముందడుగు వేస్తోంది తెలంగాణ ప్రభుత్వం. అలాగే ఉచిత విద్యను అందించేందుకు సీఎం రేవంత్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి విద్యార్థికి.. నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ నిర్ణయం యొక్క ముఖ్య ఉద్దేశం. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ స్కూల్స్ ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా స్కూల్స్ దోహద పడతాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ స్కూల్స్ నిర్మాణం కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో 20 %-% 25 ఎకరాల్లో సాగుతుండగా, 12వ తరగతి వరకు ఉచిత విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 25 నియోజకవర్గాల్లో ఇప్పటికే భూమి వివరాల సేకరణ పూర్తి కాగా, త్వరలోనే వీటి నిర్మాణాన్ని ప్రారంభించనున్నారు. ఇక్కడ క్రీడలు, వినోదంతో సహా ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌పై దృష్టి విద్యార్థులు శాటిలైట్ ఆధారిత విద్య అందించే ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాగా తెలంగాణ పోలీస్ కుటుంబాల పిల్లల కోసం ప్రత్యేకంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తానని గతంలో




సీఎం హామీ ఇచ్చారు ఆ హామీ శనివారం ఇండియా పోలీస్ స్కూల్ కు సంబంధించి https://yipschool.in వెబ్‌సైట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పోలీస్ స్కూల్ వెబ్‌సైట్‌తో పాటు సమగ్ర సమాచారంతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పిల్లలకు స్కూల్ యూనిఫామ్‌తో పాటు ఇతర అంశాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. సైనిక్ స్కూల్ తరహాలో పోలీస్ స్కూల్‌ను కూడా దేశానికి ఒక రోల్ మాడల్‌గా ఉండేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. విద్యా విధానంలో కొత్త ఒరవడిని అవలంభించాలని, క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అడ్మిషన్లలో పోలీసు అమరుల కుటుంబాల పిల్లలకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ , అదనపు డీజీపీ (ఆపరేషన్స్) స్టీఫెన్ రవీంద్ర తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల కోసం అంతర్జాతీయ స్థాయి స్కూల్ నిర్మాణం కోసం గత ఏడాది అక్టోబర్ 21 న సీఎం భూమి పూజ చేశారు.




హైదరాబాద్: రాష్ట్రంలోని మల్టీప్లెక్స్‌లకు ఊరట కల్పిస్తూ తాజాగా తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 16 సంవత్సరాలలోపు పిల్లలను కూడా అన్ని షోలకు అనుమతించాలని తెలిపింది. ఈమేరకు జనవరి 21న ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సవరించింది. దీనిపై తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది. సినిమా టికెట్ల ధరల పెంపు, ప్రత్యేక షోల అనుమతి వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి ధర్మాసనం ఇటీవల కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. వేళాపాలా లేని షోలకు పిల్లలు వెళ్లడం వల్ల వాళ్ల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం.. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు పదహారేళ్లలోపు పిల్లలను థియేటర్లలోకి అనుమతించొద్దని ఆదేశించింది. అంతేకాకుండా, ఈ విషయంపై అన్నివర్గాలతో చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఈక్రమంలోనే హైకోర్టు ఉత్తర్వులపై మల్టీప్లెక్స్ యాజమాన్యం మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది. పిల్లల ప్రవేశంపై ఆంక్షల వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపింది.

దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునేవరకు హైకోర్టు విధించిన అంక్షలను ఎత్తివేయాలని కోరింది. వారి వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించింది. ప్రభుత్వం నిర్ణయం తీసుకునేవరకూ 16ఏళ్ల లోపు పిల్లలు థియేటర్లలోకి ప్రవేశించవచ్చని తెలిపింది.




గోదావరి నదిపై మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను అధికారులు తెరిచారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులోకి 0.60 టీఎంసీల నీటిని విడుదల చేశారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ, మహారాష్ట్ర ఇంజినీర్ల సమక్షంలో అధికారులు నీటిని వదిలారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఆ ఎనిమిది మంది చనిపోయారు.. ప్రకటించిన మంత్రి జూపల్లి



అచ్చంపేట : ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 8 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లేనని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. శనివారం టన్నల్‌లో జరుగుతున్న రెస్క్యూ ఆపరేషన్‌పై అధికారులు, నిపుణులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి మీడియాతో మాట్లాడారు. టన్నెల్‌లో చిక్కుకుపోయిన వారి ఆచూకీ కోసం గత ఎనిమిది రోజులుగా 12 రిస్క్యూ టీములతో ముమ్మరంగా గాలింపు చర్యలను చేపట్టామని తెలిపారు. ఆధునీక టెక్నాలజీతో సెర్చింగ్ చేయగా 8 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లుగా గుర్తించామని ప్రకటించారు. ఆ ఎనిమిది మంది మరణించారని 99% చెప్పగలం.. ఒక్క శాతం మాత్రం చెప్పలేమని మంత్రి పేర్కొన్నారు. నాలుగు మృతదేహాలు బురదలో మూడు ఫీట్ల లోతులో ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. మిగిలిన నాలుగు మృతదేహాలు యంత్రం కింద ఉన్నట్లు తేలిందన్నారు. రేపటిలోగా నాలుగు మృతదేహాలను యంత్రాలతో కాకుండా మనుషులతో వెలికి తీస్తున్నామన్నారు. 24 గంటల్లో నాలుగు మృతదేహాలను బయటకు తీస్తామని, మిగిలిన నాలుగు మృతదేహాలను 450 నుండి 550 టన్నుల బరువు ఉన్న మిషన్ ను విడిభాగాలుగా కటింగ్ చేసి తర్వాత వెలికి తీసేందుకు రిస్క్యూ బృందాలు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి జూపల్లి తెలిపారు. ప్రమాదంలో కనిపించకుండగా పోయిన వారిని కనిపెట్టేందుకు ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా పనిచేశామని మంత్రి స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఎస్ఎల్బీసీ ప్రమాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని సీరియస్ అయ్యారు. రాజకీయాలు మాని నిజానిజాలు తెలుసుకొని బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: అబద్ధాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడంలో ఒక విధానం ఉంటుంది. తెలంగాణలో కేంద్రం చేపట్టిన రూ.10లక్షల కోట్ల విలువైన పనులను ఇప్పటికే వివరించాం. నేను ఇతర కేంద్ర మంత్రులను బెదిరించానని దిగజారుడు మాటలు మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థంగా అమలు చేయాలని సీఎంలకు ఎన్నో లేఖలు రాశాను. సీఎంలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తిని. దేశంలో నిర్మించే 7 టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చాను. రాష్ట్రానికి ఆర్ఆర్ఆర్‌ను కేంద్రం మంజూరు చేసింది.

ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. వాటిని పక్కన పెట్టి భాజపాపై ఆరోపణలు చేస్తున్నారు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## వీహెచ్ ఇంట్లో మున్నూరు కాపు నేతల సమావేశం..

కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ ఇంట్లో మున్నూరు కాపు నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్నూరు కాపు నేతలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదనే అసంతృప్తి వ్యక్తం చేశారు. వీహెచ్ ఇంట్లో భేటీకి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కీలక నేతలు హాజరయ్యారు. కులగణన చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతగా సభ పెడదామని విప్ ఆది శ్రీనివాస్ ప్రతిపాదించారు. కుల గణన సరిగ్గా చేయలేదు.. మన సంఖ్యను తగ్గించారు అనే అభిప్రాయాన్ని కొందరు నేతలు వ్యక్తం చేశారు. నీకు మంత్రి పదవి ఇస్తే కృతజ్ఞత సభ పెడదామని కొందరు నేతలు చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో కాపులకు దక్కిన ప్రాధాన్యత కాంగ్రెస్‌లో కరువైందని అన్నారు. మున్నూరు కాపులు మంత్రి వర్గంలో లేక పోవడం ఇదే మొదటి సారి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ మున్నూరుకాపు నేతలకు కీలక పదవులు ఇచ్చింది.. అంతే విధేయతతో పనిచేశామని నేతలు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ కూడా మున్నూరు కాపులు అవసరాన్ని గుర్తించాడు.. రెండు సార్లు మంత్రి వర్గంలో తీసుకున్నాడని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలుగా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాడని పేర్కొన్నారు. బీజేపీ కూడా మున్నూరు కాపు నేతలకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ నుండి దక్కినన్ని ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు.. కాంగ్రెస్ నుండి రాలేదు. నామినేటెడ్ పోస్టుల్లో అన్యాయం జరుగుతోందని నేతలు పేర్కొన్నారు. మున్నూరు కాపులను అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదనే అభిప్రాయం నేతలు వ్యక్తం చేశారు. డి.శ్రీనివాస్, కేకే, వీహెచ్, పొన్నాలకు దక్కిన స్థాయి నేడు కాంగ్రెస్‌లో లేదని అసంతృప్తిగా ఉన్నారు. ఓ సామాజిక వర్గం మన మీద కుట్రలే కాదు.. దాడి చేసినంత పని చేస్తోందన్నారు. మన ప్రాధాన్యత తగ్గిస్తే.. మనం కూడా తగ్గించడం అనివార్యమన్నారు నేతలు. మరోవైపు.. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెండ్ అంశం పై కూడా చర్చ జరిగింది. ఎమ్మెల్సీ మల్లన్న ఎత్తుకున్న నినాదం కరక్టే కానీ పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలి.. ఒక బీసీ నేతపైనే కాదు.. పార్టీ లైన్ దాటిన ఇతర నేతలపై కూడా ఇదే రకమైన చర్యలు ఉండాలని నేతలు అభిప్రాయ పడ్డారు. కృతజ్ఞత సభకు బదులు.. మున్నూరు కాపుల భారీ బహిరంగ సభ నిర్వహించాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు.




వరంగల్: వరంగల్ నగరంలో ఇటీవల వైద్యుడిపై హత్యాయత్నం కేసు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రియుడిపై మోజుతో భర్త(వైద్యుడు)ను మట్టుపెట్టే పన్నాగంలో భాగంగా భార్యే ఈ దారుణానికి పాల్పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్యుడు సుమంత్ రెడ్డి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ప్రాణాలు కోల్పోయారు.

**అసలేం జరిగిందంటే..** వరంగల్ హంటర్‌రోడ్‌లోని వాసవీకాలనీలో నివాసముంటున్న డాక్టర్ సుమంత్‌రెడ్డికి 2016లో ఫ్లోరా మరియాతో ప్రేమ వివాహమైంది. తన బంధువుల విద్యా సంస్థలను చూసుకునేందుకు 2018లో సుమంత్‌రెడ్డి భార్యతోసహా సంగారెడ్డికి మకాం మార్చారు. అక్కడ ఫ్లోరా ఉపాధ్యాయురాలిగా, సుమంత్‌రెడ్డి పీహెచ్‌సీలో కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్‌గా చేరారు. సంగారెడ్డిలో జిమ్‌కు వెళ్తున్న క్రమంలో ఫ్లోరాకు శిక్షకుడు శామ్యూల్‌తో పరిచయం ఏర్పడి, వివాహేతర సంబంధానికి దారితీసింది. విషయం వైద్యుడికి తెలియడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి... మళ్లీ వరంగల్‌కు మకాం మార్చారు. ఆమెకు 2019లో జనగామ జిల్లా పెంబర్తి సోషల్ వెల్ఫేర్ కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగం వచ్చింది. తర్వాత ఆ కళాశాలను రంగశాయిపేటకు మార్చారు. అయినా, ఫ్లోరా ప్రవర్తనలో మార్పు రాలేదు. భర్త లేనిసమయంలో శామ్యూల్‌ని ఇంటికి పిలిచేది. ఇదే విషయంపై భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవలు జరిగాయి. దాంతో సుమంత్‌రెడ్డిని అడ్డుతొలగించుకోవాలని ఫ్లోరా, శామ్యూల్ నిర్ణయించుకున్నారు. ఇందుకు ఫ్లోరా రూ.లక్ష శామ్యూల్‌కు ఆన్‌లైన్‌లో పంపింది. ఇందులో రూ.50 వేలను శామ్యూల్... సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన స్నేహితుడైన రాజ్‌కుమార్‌కు ఇచ్చాడు. వైద్యుడిని చంపితే ఇల్లు కట్టిస్తానని రాజ్‌కుమార్‌తో ఒప్పందం చేసుకున్నారు. పన్నాగంలో భాగంగా ఈనెల 20న రాత్రి వారిద్దరూ హెల్మెట్ ధరించి బైక్‌పై వరంగల్‌కు చేరుకున్నారు. కాజీపేటలో ప్రైవేటు ఆసుపత్రిని నడుపుతున్న సుమంత్‌రెడ్డి రాత్రి విధులు ముగించుకొని కారులో ఇంటికి వస్తుండగా బట్టుపల్లిరోడ్‌లో కారు వెనుక భాగంలో సుత్తితో కొట్టారు. శబ్దం విన్న సుమంత్‌రెడ్డి కారును ఆపి బయటికి వచ్చి చూస్తుండగా అదే సుత్తితో పలుమార్లు అతని తలపై మోదారు. చనిపోయాడనుకుని పారిపోయారు. తీవ్ర రక్తస్రావమైన వైద్యుడిని స్థానికులు 108లో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం అతడి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో.. తిరిగి వరంగల్‌కు తీసుకొచ్చారు. ఈ ఘటనపై బాధితుడి తండ్రి సుధాకర్‌రెడ్డి ఫిర్యాదుతో... దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి, నిందితులను గుర్తించారు. ఇంట్లోని బంగారం అమ్మేందుకు వెళ్తున్న శామ్యూల్, రాజ్‌కుమార్, ఫ్లోరా మరియాలను గురువారం అరెస్టు చేశారు. దాడి వెనుక వైద్యుడి భార్యతోపాటు ఆమె ప్రియుడు ఉన్నట్లు తేల్చారు.

# ఆ వృద్ధ దంపతుల తొలి ఫోటో... ఎమోషనల్ వీడియో వైరల్!



చాలామందికి చాలా చాలా చిన్న విషయాలుగా, అసలు పరిగణలోకి తీసుకోవాల్సిన స్థాయి విషయంగా కనిపించనివి.. మరి కొంతమందికి లైఫ్ టైమ్ డ్రీమ్స్ గా ఉంటాయని అంటారు. ప్రపంచంలో ఆ స్థాయి అసమానతలు ఉన్నాయని చెబుతారు. ఈ సమయంలో ఓ వృద్ధ దంపతుల తొలి ఫోటోలకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అవును... ఒక ఫోటోగ్రాఫర్ వృద్ధ దంపతుల తొలి ఫోటోలను డాక్యుమెంట్ చేస్తూ వైరల్ వీడియోను షేర్ చేశారు. దీంతో.. వారితో అతని హృదయపూర్వక కలయిన ఇంటర్నెట్ ను భావోద్వేగానికి గురి చేసింది. ఇప్పటివరకూ మూడు మిలియన్స్ పైగా వ్యూస్ సంపాదించింది. కొన్నిసార్లు మనం తేలికగా తీసుకునే విషయాలు ఇతరుల జీవితాల్లో కలలే అనే కామెంట్స్ కనిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే... పొలాలతో నిండిన గ్రామీణ రోడ్డు వెంట ఓ జంట ట్రాలీ సైకిల్ రిక్షా పై వెళ్తోంది. ఈ విషయాన్ని ఆకాష్ ఉపాధ్యాయ్ గమనించాడు. వెంటనే వారి దగ్గరకు వెళ్లి.. వారి ఫోటోలు తీయడానికి ముందుకొచ్చాడు. ఈ సమయంలో ఎంతో సంతోషంతో, చిరునవ్వులు చిందిస్తూ ఆ జంట వెంటనే అంగీకరించింది. అనంతరం.. ఆకాష్ ఉపాధ్యాయ్ వారిని పొలాల్లోని ఒక సుందరమైన ప్రదేశానికి నడిపించాడు. ఈ సమయంలో వారితో కొన్ని ఫోజులు పెట్టించారు! ఈ సమయంలో ఆ దంపతులు చిరునవ్వులు చిందిస్తూ ఫోటోలకు ఫోజులిచ్చారు. ఈ క్రమంలో.. ఫోటోలు తీసిన ఉపాధ్యాయ్... వాటిని ప్రింట్ చేసి వారికి అందించారు. దీంతో.. తాము ఫోటోల్లో అలా ఉంటామా అని చూసుకుంటూ ఆ జంట మురిసిపోయింది. ఈ సందర్భంగా... తమ ఫోటోలు ఇంతకు ముందు ఎప్పుడూ తీయలేదని వారు వెల్లడించారు. ఏదో ఒక రోజు తాము లేనప్పుడు.. తమ పిల్లలు ఈ ఫోటోలు చూసి, వీళ్లు మా తల్లితండ్రులు అని అంటారు అంటూ ఆ జంట ఆనందభాష్పాలు రాల్చింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ... మిలియన్ డాలర్ల విలువైన చిరునవ్వులు వారి సొంతం అని ఒకరంటే... ఆకాష్ ఉపాధ్యాయ్ ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు.

# వాహనదారులకు బిగ్ అలర్ట్... భారీగా ఫైన్స్!



ఎవరు ఎన్ని చెప్పినా, ఎన్నిసార్లు చెప్పినా, ఎలా చెప్పినా, ఎంత అవగాహన కల్పిస్తున్నా కొంతమంది వాహనదారులు నిత్యం ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉంటారని అంటారు. పైగా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడటాన్ని పలువురు గొప్ప విషయంగా చెప్పుకుని వారి అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని బయటపెట్టుకుంటారని చెబుతుంటారు. ప్రధనంగా హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం, రాంగ్ రూట్ లో వెళ్లడం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్ లకు పాల్పడుతుంటారు. దీనివల్ల వారే కాకుండా ఇతరులను ఇబ్బందికి గురిచేస్తూ ప్రమాదాలకు కారణమవుతుంటారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం నేటి నుంచి కొత్త మోటార్ వెహికల్ చట్టాన్ని అమలు చేసేందుకు రెడీ అయ్యింది! అవును... ట్రాఫిక్ రూల్స్ పై అధికారులు ఎంత అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొంత్మంది వాహనదారులు ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్న సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ డిపార్ట్ మెంట్ అధికారులు కఠినమైన నిబంధనలు తీసుకొస్తున్నారు. ఇందులో భాగంగా.. కొత్త మోటార్ వెహికల్ చట్టాన్ని అమలుచేయనున్నారు. ఈ నేపథ్యంలోనే వాహదారులకు బిగ్ అలర్ట్ అందించారు. ఇందులో భాగంగా... ఇకపై ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే భారీగా ఫైన్ విధించనున్నారు. ఈ కొత్త యాక్ట్ ప్రకారం ఫైన్స్ భారీగా ఉండనున్నాయని అంటున్నారు. ఈ క్రమంలో... హెల్మెట్ లేకుండా బైక్ నడిపినా, సీటు బెల్ట్ లేకుండా కారు నడిపినా రూ.1,000 ఫైన్ విధించనున్నారు. ఇదే సమయంలో... ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంప్ వంటి వాటికి పాల్పడితే రూ.1,000 ఫైన్ విధించనున్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5,000 జరిమానా ఉంటుంది. ఇక ప్రధానంగా.. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినట్లు తేలితే రూ.10,000 ఫైన్ తో విధించడంతోపాటు లైసెన్స్ కూడా రద్దు చేస్తామని అధికారులు తెలిపారు.

# ఆఫ్ఘాన్ కు ఆవగింజంత అదృష్టం లేదా?




రంగం ఏదైనప్పటికీ గుమ్మడి కాయంత టాలెంట్ ఉంటే సరిపోదు.. ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలని అంటుంటారు పెద్దలు! ప్రస్తుతం ఈ విషయం ఛాంపియన్స్ ట్రోఫీలో ఫుల్ ఫామ్ లో కనిపించిన ఆఫ్ఘాన్ టీమ్ కు కరెక్ట్ గా వర్తిస్తుందా అనే చర్చ తెరపైకి వచ్చింది. వరుణుడి రూపంలో వారిని దురదృష్టం వెంటాడింది.. ఫలితంగా ఆసిస్ సెమీస్ కు చేరింది. అవును... ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లాండ్ కు షాకిచ్చి, మాంచి ఊపులో కనిపించిన ఆఫ్ఘనిస్థాన్.. ఆస్ట్రేలియాను దెబ్బ కొట్టాలని చూసింది! ఈ సమయంలో.. క్రికెట్ లో ఏదైనా సాధ్యమే కాబట్టి.. మరో అద్భుతం జరుగుతుందా అనే ఆసక్తి క్రికెట్ ప్రపంచంలో నెలకొంది. అయితే... వర్షం వల్ల ఆసిస్ తో మ్యాచ్ రద్దు కావడంతో ఆఫ్ఘాన్ దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించినట్లే! ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ – ఏ లో భారత్, న్యూజిలాండ్ లు ఇప్పటికే సెమీస్ కు చేరిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో... గ్రూప్ – బీ లోనూ తొలి సెమీస్ బెర్త్ కన్ఫాం అయ్యింది. ఈ విషయంలో టీమ్స్ పెర్ఫార్మెన్స్ కంటే వరుణుడి పెర్ఫార్మెన్స్ కీలకంగా మారడం గమనార్హం. ఇప్పటికే ఫిబ్రవరి 25న ఆసిస్ – సౌతాఫ్రికా మధ్య మ్యాచ్ టాస్ పడకుండా రద్దైన సంగతి తెలిసిందే. దీంతో... పాక్ క్రికెట్ బోర్డ్ పై పలువురు ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు. కొద్ది వర్షానికే నీరు ఔట్ ఫీల్డ్ లో చేరడం, గ్రౌండ్ ను వెంటనే ఆటకు అనువుగా మార్చే స్థితి లేకపోవడంతో మ్యాచ్ లు రద్దవుతున్నాయి. తాజాగా ఆసిస్ %-% ఆఫ్ఘాన్ మధ్య మ్యాచ్ లో కేవలం 30 నిమిషాలే వర్షం పడటంతో ఔట్ ఫీల్డ్ అంతా చిత్తడిగా మారింది. దీంతో.. మ్యాచ్ ను రద్దు చేశారు అంపైర్లు. దీనిపై.. ఆఫ్ఘాన్ క్రికెట్ ఫ్యాన్స్ తో పాటు, ఇతర దేశాల క్రికెట్ అభిమానులు మండి పడుతున్నారు. పాక్ క్రికెట్ బోర్డును దుయ్యబడుతున్నారు. సమీప భవిష్యత్తులో పాక్ కు ఎలాంటి ఐసీసీ ఆతిథ్య హక్కులు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క.. ఆతిథ్య పాకిస్థాన్ టీమ్ ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే! కాగా... శుక్రవారం జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘాన్.. 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. ఆఫ్ఘాన్ బ్యాటర్స్ లో సెదిఖుల్లా (85), అజ్మతుల్లా (67) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఇది కచ్చితంగా బ్యాడ్ టోటల్ అయితే కాదనేది నిపుణుల మాటగా ఉంది! అనంతరం ఆసిస్ 12.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 109 పరుగులు చేసింది. వర్షం వల్ల మ్యాచ్ రద్దయ్యింది. దీంతో... ఆసిస్ 4 పాయింట్లు, ఆఫ్ఘాన్ 3 పాయింట్లతో లీగ్ దశను ముగించాయి. ఇప్పటికే లీగ్ దశనుంచి నిష్క్రమించిన ఇంగ్లాండ్ తో శనివారం సౌతాఫ్రికా తలపడనుంది.

ఇప్పటికే 3 పాయింట్లతో ఉన్న సఫారీ జట్టు ఈ మ్యాచ్ గెలిచినా, రద్దైనా ముందజ వేస్తుంది. కారణం.. ఆఫ్ఘాన్ నెట్ రన్ రేట్ (–0.990)కంటే.. సౌతాఫ్రికా నెట్ రన్ రేట్ (ం2.140) మెరుగ్గా ఉంది. ఇంగ్లాండ్ తో మ్యాచ్ లో సౌతాఫ్రికా ఛేంజింగ్ లో 207 పరుగుల తేడాతో ఓటమి పాలైతేనే ఆఫ్ఘాన్ సెమీస్ కు అర్హత సాధిస్తుంది. ఇది దాదాపు అసాధ్యం అనే చెప్పాలి! దీంతో... ఆఫ్ఘాన్ కు ఆవగింజంత అదృష్టం కూడా లేదు అని కొంతమంది అంటుంటే.. పాక్ బోర్డుపై ఆ దేశ క్రికెట్ ఫ్యాన్స్ ఫైరవుతున్నారు.


# యుద్ధం ఆగదు.. ట్రంప్ తోనే లొల్లి పెట్టుకున్న జెలెన్ స్కీ



అది వైట్ హౌస్. ప్రపంచానికే పెద్దన్న అడ్డా. అక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. అందుకే.. ఎక్కడ ఎంత తోపు అయినా.. సదరు వైట్ హౌస్ వద్దకు వచ్చేసరికి ఒళ్లు దగ్గర పెట్టుకుంటారు దేశాధినేతలు. తొందరపాటుకు అవకాశం ఇవ్వరు. ఒకసారి తేడా వస్తే.. దాని దిద్దుబాటుకు చాలానే టైం పడుతుంది. అలాంటి వైట్ హౌస్ లో ఇటీవల కాలంలో ఎప్పుడూ లేనంత రేర్ సీన్ ఒకటి చోటు చేసుకుంది. ఇరువురు దేశాధినేతల మధ్య జరిగిన చర్చ హాట్ హాట్ గా సాగటమే కాదు.. తన అధిక్యతను ప్రదర్శించే విషయంలో అగ్రరాజ్యం ఎలా ఉంటుందన్న విషయాన్ని ప్రపంచానికి కళ్లకు కట్టినట్లుగా తెలియజేశారని చెప్పాలి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మధ్య జరిగిన చర్చ.. మాటల యుద్ధంగా మారింది. వైట్ హౌస్ వేదికగా ఇరువురు అధినేతల చర్చ సీరియస్ గా సాగింది. ఇదో టీవీ డిబేట్ మాదిరి మారటమే కాదు.. దీనికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. రష్యాతో యుద్ధంలో శాంతి ఒప్పందం కుదుర్చుకోవటం.. ఉక్రెయిన్ లో అరుదైన ఖనిజాల తవ్వకానికి సంబంధించిన ఒప్పందంపై సంతకం చేయటమే లక్ష్యంగా ఏర్పాటైన భేటీ.. చివరకు అదేమీ జరగకుండా జెలెన్ స్కీ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ పై ట్రంప్ సంచలన విమర్శలు చేశారు. రష్యా చేస్తునన యుద్ధానికి తెరదించటానికి శాంతి ఒప్పందం కుదుర్చటం.. దానికి బదులుగా ఉక్రెయిన్ లోని అరుదైన ఖనిజాల తవ్వకానికి అనుమతించటానికి అమెరికా చేసిన ప్రతిపాదనపై చర్చలు జరిపారు. ఈ క్రమంలో భవిష్యత్తులో తమపై రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే రక్షణ కల్పించాలని జెలెన్ స్కీ ట్రంప్ మీదా.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మీద ఒత్తిడి చేశారు. దీంతో ఇద్దరు అధినేతల మధ్య మొదలైన చర్చలు చివరకు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే వరకు వెళ్లాయి. మీడియా ఎదుటే వాదులాట వరకు వెళ్లటం సంచలనంగా మారింది. ట్రంప్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ ప్రజల జీవితాలతో మీరు చెలగాటం ఆడుతున్నారంటూ జెలెన్ స్కీ మీద ట్రంప్ అండ్ కో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 'మీ ఆలోచనల కారణంగా మూడో ప్రపంచ యుద్ధం వచ్చేలా ఉంది. మీరు చేస్తున్న పనులతో దేశానికి చాలా చెడ్డపేరు వస్తోంది. ఉక్రెయిన్ అతి పెద్ద సమస్యల వలయంలో చిక్కుకుంది. దీని నుంచి బయటకు రావటం అసాధ్యం. చాలా విషయాలను ఇది క్లిష్టతరం చేస్తుంది" అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ మాట్లాడుతున్న సమయంలోనే కొన్ని మాటలకు జెలెన్ స్కీ స్పందించారు. వెంటనే సమాధానం ఇచ్చారు. జెలెన్ స్కీ వాదనను చూస్తే.. 'ఉక్రెయిన్ ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకోండి. మా దేశ భూభాగంలో మేం ఉంటున్నాం. మేం అక్కడ ఉండేందుకు మరొకరి అనుమతి తీసుకోవాలా? మేం ద్రఢ సంకల్పంతో ఉన్నాం. ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదు. ఇన్ని రోజులు మాకు మద్దతు ఇచ్చినందుకు థ్యాంక్స్' అన్నారు. అక్కడే ఉన్న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ.. జెలెన్ స్కీని గట్టిగా మాట్లాడొద్దన్నారు. రెండు దేశాల మధ్య యుద్ధానికి ముగింపు పలకాలంటే దౌత్యం అవసరమని చెప్పగా స్పందించిన జెలెన్ స్కీ ఎలాంటి దౌత్యం? అంటూ ఎదురు ప్రశ్న వేశారు. దీంతో వాన్స్ అసహనానికి గురయ్యారు. అధ్యక్షుడి కార్యాలయంలో ఇలా ప్రవర్తించటం సరికాదన్నారు. వాన్స్ వ్యాఖ్యల వేళలోనే మరోసారి ట్రంప్ స్పందించారు. జెలెన్ స్కీను ఉద్దేశించి సీరియస్ గా మాట్లాడుతూ.. 'రష్యాతో యుద్ధంలో అమెరికా మీకు ఎంతో సాయం చేసింది. మీకు మద్దతుగా నిలిచాం. ఆయుధాలు సమకూర్చాం. 350 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని చేశాం. మా సైనిక పరికరాలే లేకపోతే.. రష్యా – ఉక్రెయిన్ యుద్ధం రెండు వారాల్లో ముగిసిపోయేది. ఎంతోమంది ప్రజలు చనిపోతున్నారు. మీ దగ్గర సైనిక బలగం తగ్గిపోయింది. అయినప్పటికి మీకు శాంతి ఒప్పందం వద్దంటున్నారు. యుద్ధమే చేస్తామంటున్నారు. తక్షణమే శాంతి ఒప్పందానికి అంగీకరించండి. అప్పుడే మీ దేశంపై బుల్లెట్ల మోత ఆగుతుంది. మరణాలు ఆగుతాయి' అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనికి జెలెన్ స్కీ స్పందించారు. రెండు రోజుల క్రితం పుతిన్ కూడా ఇవే మాటలు అన్నారని.. శాంతి ఒప్పందం గురించి అమెరికా గత ప్రభుత్వ నేతలను అడిగితే.. వారేం చెబుతారో వినాలంటూ అంతే ధీటుగా స్పందించారు. ఖనిజాల ఒప్పందంపై ఏకాభిప్రాయం కుదరకపోవటంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడి మధ్య చర్చ అర్థంతరంగా ఆగిపోయింది. ఈ భేటీ అనంతరం జెలెన్స్కీ మీడియాతో మాట్లాడుతూ, ట్రంప్కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని, తాను ఏ తప్పూ చేయలేదని స్పష్టం చేశారు. శాంతి ఒప్పందం ఉక్రెయిన్ భద్రతకు అనుకూలంగా ఉండాలని, తాము మూడో ప్రపంచ యుద్ధం కోరుకోవడం లేదని వెల్లడించారు. ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య సంబంధాల గురించి మాట్లాడుతూ, ట్రంప్ తటస్థంగా ఉండాలని, కానీ ఉక్రెయిన్ వైపు నిలబడాలని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. చివరకు ఒప్పందం కుదరకుండా వాగ్వాదంతోనే ఈ సమావేశం ముగిసింది. ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో అమెరికా, ఉక్రెయిన్ మధ్య భవిష్యత్తులో సంబంధాలు ఎలా కొనసాగుతాయనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

# భారతీయులకు ముంచుకొస్తోన్న కొత్త సమస్య!

తాజాగా ఓ ఆసక్తికరమైన నివేదిక తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... గ్లోబల్ స్లీప్ సర్వే తన ఐదో వార్షిక నివేదికను వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో చేసిన ఈ సర్వే గురించి వెల్లడిస్తూ.. భారతీయులకు కొత్త సమస్య ముంచుకొస్తోందని తెలిపింది. అదే నిద్ర సంక్షోభం. ఇప్పటికే భారతీయులు వారంలో మూడు రోజులు సరిగా నిద్రపోవడం లేదని సర్వే తెలిపింది! అవును... భారతీయులు సరిగా నిద్రపోవడం లేదంట. ఈ నేపథ్యంలో వారికి నిద్ర సంక్షోభం ముంచుకొస్తోందని గ్లోబల్ స్లీప్ సర్వే వెల్లడించింది.



ఈ సమయంలో ప్రతీ వారంలోనూ కనీసం మూడు రోజులు భారతీయులు నిద్రను కోల్పోతున్నట్లు తెలిపింది. చాలా మంది ఇప్పటికే ఈ సమస్యతో భాదపడుతున్నప్పటికీ ఎలాంటి వైద్య సహాయం పొందడం లేదని వెల్లడించింది! ఈ సందర్భంగా... భారతీయుల్లో 49 శాతం మంది వారానికి కనీసం మూడు రోజులు నిద్రపోవడంలో ఇబ్బందులు పడుతున్నారని.. 47 శాతం మంది భారతీయులు నిద్ర లేమి కారణంగా వచ్చే అలసట కారణంగా తమ తమ కేరీర్ లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ఫలితంగా తమ కెరీర్ ఎదుగుదలలో దీని ప్రభావాన్ని చవిచూస్తున్నారని చెబుతున్నారు! ఇదే సమయంలో.. పురుషులతో పోలిస్తే స్త్రీలు తక్కువ నాణ్యమైన నిద్రను అనుభవిస్తున్నరని.. పురుషులతో పోలిస్తే మహిళలు వారంలో తక్కువ రాత్రులు మంచి నిద్ర పొందుతున్నారని.. స్త్రీల రుతుచక్రంపై నిద్ర తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నట్లు సర్వేలో తేలిందని తెలిపింది. పురుషులతో పోలిస్తే స్త్రీలు ఐదు శాతం ఎక్కువగా సిక్ లీవ్ లు తీసుకునే అవకాశం ఉందని పేర్కొంది.

ఈ సర్వే కోసం అమెరికా, చైనా, భారత్ లలో 5,000 మంది.. జర్మనీలో 2004, ఫ్రాన్స్ లో 2001, యూకే 2000, థాయిలాండ్ లో 1519, ఆస్ట్రేలియాలో 1501.. జపాన్, కొరియాల్లో ఒక్కో దేశంలోనూ 1500 మందితో పాటు హాంకాంగ్ లో 1001, న్యూజిలాండ్ 1000, సింగపూర్ లో 1000 మంది కలిపి మొత్తం 30,026 మందిపై ఈ సర్వే నిర్వహించినట్లు తెలిపారు!

# విజయ్ ను పవన్ ని చేసే దిశగా పీకే ప్రయత్నం!

తమిళనాట రాజకీయాలు ఆసక్తిగా మారుతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా తమిళ స్టార్ హీరో విజయ్.. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ స్థాపించి, పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడంతో కొత్త సమీకరణాలు తెరపైకి వస్తున్నాయని అంటున్నారు. ఈ సమయంలో టీవీకే అధ్యక్షుడుకి ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఓ సూచన చేసినట్లు తెలుస్తోంది. అవును... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రాని పాలిస్తున్న డీఎంకే తనకు శత్రువులని విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో.. తన నాయకత్వాన్ని స్వీకరించే పార్టీలతో కూటమికి సిద్ధమని కూడా ప్రకటించారు. ఈ క్రమంలో... ఇటీవల విజయ్ ని ప్రశాంత్ కిశోర్ కలిసిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో కొన్ని సూచనలు చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా... విజయ్ ని కలిసిన సమయంలో... శాశ్వత ఓటు బ్యాంకు కలిగి ఉన్న అన్నాడీఎంకేతో కూటమి ఏర్పాటు చేస్తేనే డీఎంకేను నిలువరించడం సాధ్యమవుతుందని పీకే చెప్పినట్లు



కథనాలొస్తున్నాయి. ఈ విషయంపై అన్నాడీఎంకేతోనూ పీకే మాట్లాడినట్లు చెబుతున్నారు. ఈ విషయంలో విజయ్ రాజీపడటం మంచిదని చెప్పారని అంటున్నారు. ఇదే సమయంలో... అన్నాడీఎంకేకు ప్రస్తుతం కనీసం 25 శాతం ఓట్లు ఉంటాయని.. టీవీకేకు అత్యధికంగా 20 శాతం వచ్చే అవకాశం ఉందని.. ఇదే సమయంలో ఈ కూటమిలో ఇతర పార్టీలనూ చేర్చుకుంటే మొత్తం ఓట్ల శాతం 50కి చేరే అవకాశం ఉందని విజయ్ కు ప్రశాంత్ కిశోర్ చెప్పారనే చర్చ ఇప్పుడు తమిళనాట మొదలైందని తెలుస్తోంది. పైగా... సీఎం కావాలని భావిస్తున్న విజయ్ కి ఏపీ రాజకీయాలను ఉదహరించారట ప్రశాంత్ కిశోర్. ఇందులో భాగంగా... 2019లో పవన్ కల్యాణ్ ఇబ్బంది పడినా.. 2024లో చంద్రబాబుతో జత కట్టి విజయం సాధించారని చెప్పినట్లు తెలుస్తోంది. అదేవిధంగా... పళనిసామిని సీఎం, విజయ్ డిప్యూటీ సీఎం అని ఒప్పందం చేసుకోవచ్చని సూచించారని అంటున్నారు! దీంతో ఈ విషయం తమిళనాట రాజకీయాల్లో ఆసక్తిగా మారింది. ఈ సందర్భంగా.. ఎన్నికలు దగ్గరపడే సమయంలో ఉమ్మడి శత్రువును ఓడించేందుకు విజయ్ కొన్ని రాజీలు కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయనే కామెంట్లు వినిపిస్తున్నాయి. కాగా... టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున నేతృత్వంలో 2026 ఎన్నికల వ్యూహాలను రచించేందుకు ప్రశాంత్ కిశోర్ టీవీకేతో జతకట్టినట్లు చెబుతోన్న సంగతి తెలిసిందే.

చురకలు


## సంపాదకీయం

# కేసీఆర్ వ్యూహాన్ని స్టాలిన్ అమలు చేస్తున్నారా ?

తమిళనాడు అధికార డీఎంకే పార్టీకి వచ్చే ఎన్నికలు చావో రేవో అన్నట్లుగా మారుతున్నాయి. ఎందుకంటే ఏడున్నర పదుల వయసుకు చేరువలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఉన్నారు. ఈసారి ఆయన డీఎంకేని గెలిపించి తన రాజకీయ వారసుడు కుమారుడు ఉదయనిధి స్టాలిన్ కి సీఎం గా పట్టాభిషేకం చేయవచ్చు అన్నది ఆలోచన. ఒకవేళ అది జరగకపోతే మాత్రం మరో 2031 వరకూ ఆగాలి. అప్పటికి ఎనభయ్యేళ్ళకు స్టాలిన్ వస్తారు. ఆనాటికి రాజకీయాలు ఎలా ఉంటాయో ఎవరికి ఎరుక. దాంతో స్టాలిన్ కి 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు చాలా ముఖ్యంగా మారాయి. ఇదిలా ఉంటే గత అయిదేళ్ళ స్టాలిన్ పాలన ఏమంత గొప్పగా లేదని విపక్షాలు అంటున్నాయి. దాంతో పాటు యాంటీ ఇంకెంబెన్సీ కూడా సహజంగా ఉంటుంది. మరో వైపు చూస్తే సూపర్ స్టార్ డం ఉన్న హీరో విజయ్ కొత్త పార్టీ పెట్టి డీఎంకే మీదకు దూసుకుని వస్తున్నారు. ఆయన అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటారని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే విజయ్ గ్లామర్ అన్నాడీఎంకే క్యాడర్ కలసి అధికార డీఎంకే గుండెల్లో రైళ్ళను పరిగెట్టించవచ్చు. తెలంగాణా ఆత్మగౌరవ నినాదంతో రెండు సార్లు అధికారం అందుకున్న కేసీఆర్ ని ఈ విషయంలో స్టాలిన్ ఫాలో అవుతున్నారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఈ క్రమంలో స్టాలిన్ తమిళుల ఆత్మ గౌరవం అంటూ కొత్త నినాదాన్ని ఎత్తుకున్నారని అంటున్నారు. ఆయన హిందీ భాషను తమిళుల మీదకు రుద్దడాన్ని తప్పు పడుతున్నారు. కేంద్రం జాతీయ విద్యా విధానాన్ని ప్రశ్నిస్తున్నారు అది అమలు చేయలేదని అయిదు వేల కోట్ల రూపాయలు కేంద్రం ఇవ్వకుండా ఆపిందని విమర్శిస్తున్నారు. తమిళులకు ఈ జాతీయ విద్యా విధానం అవసరం లేదని హిందీ కూడా వద్దు అని ఆయన నినదిస్తున్నారు. మరో వైపు చూస్తే కేంద్రం చేసిన మూడు భాషల పాలసీ మీద అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజన విషయంలో ఆయన కేంద్రంతో ఢీ కొట్టాలని చూస్తున్నారుఇ. తాను కేంద్రం మీద సమరం చేస్తున్నానని తనకు మద్దతుగా నిలవాలని ఆయన తమిళనాడు ప్రజలను కోరుతున్నారు. కేంద్రం డీ లిమిటేషన్ అమలు చేస్తే అది తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీస్తుందని అంటున్నారు. సామాజిక న్యాయం అని కూడా గొంతెత్తుతున్నారు. సంక్షేమ పథాకాలకు తీవ్ర నష్టం అని ప్రజలను హెచ్చరిస్తున్నారు. దీని మీద కేంద్రంతో ఎంతైనా పోరాటానికి రెడీ అంటున్నారు. నిజానికి తమిళలకు ఆత్మ గౌరవ నినాదం అతి పెద్ద భావోద్వేగం కలిగించే ఇష్యూగా ఉంటుంది. దానిని సరిగ్గా ఎన్నికలకు ఏడాది సమయం ఉన్న వేళ వ్యూహాత్మకంగానే స్టాలిన్ బయటకు తీసారు అని అంటున్నారు. మరి అది కనుక పారితే మరోసారి తమిళ పీఠం స్టాలిన్ దే అని అంటున్నారు అదే సమయంలో విజయ్ రూపంలో కొత్తగా పుట్టుకుని వచ్చిన పార్టీ కేంద్రంతో ఏ మేరకు పోరాడుతుంది అన్న చర్చ కూడా జనం లో ఉంటుంది. స్టాలిన్ అనుభవం ఆయన దూకుడు ప్లస్ పాయింట్ గా అయితే మాత్రం వచ్చే ఎన్నికలు రసవత్తరంగా మారుతాయని అంటున్నారు.

# తెలుగు నాటక సాహిత్యంలో చెరగని సంతకం వడ్డాది సుబ్బరాయుడు - మార్చి 2... వడ్డాది సుబ్బరాయుడు వర్ధంతి

వడ్డాది సుబ్బరాయుడు (జూలై 30, 1854 %–% మార్చి 2, 1938) తెలుగు నాటక సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందిన గొప్ప నాటక రచయిత. ఆయన "వసురాయకవి"గా ప్రసిద్ధి చెందారు. తెలుగులో నాటక రంగానికి ప్రాథమిక రూపుదిద్దించిన వ్యక్తులలో ఒకరుగా, ఆయన నాటక రచన సంస్కృత నాటక సంప్రదాయాన్ని అనుసరించినప్పటికీ, తెలుగు భాషలో సహజంగా ప్రవహించేలా తన రచనలను తీర్చిదిద్దారు. వడ్డాది సుబ్బరాయుడు 1854 జూలై 30న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని పాసర్లపూడి గ్రామంలో జన్మించారు. ఆయనకు అనధికారిక విద్య మాత్రమే లభించినప్పటికీ, స్వయంకృషితో గొప్ప పండితుడిగా ఎదిగారు. బాల్యంలోనే నాటకాలు, సాహిత్యంపై మక్కువ కలిగి, స్వయంగా అధ్యయనం చేసి పాండిత్యం సంపాదించారు. సుబ్బరాయుడు తన విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన తరువాత, రాజమండ్రిలోని ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేశారు. అనంతరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడిగా నియమితులయ్యారు. ఈ పదవుల్లో ఉండే సమయంలో తెలుగు సాహిత్యాన్ని మరింతగా అభ్యసించి, నాటక రచనలో తనదైన ముద్ర వేశారు. వడ్డాది సుబ్బరాయుడు చాటు పద్యాలు చెప్పడంలో అపారమైన నైపుణ్యం కలిగినవారు. ఆయన కవితా వ్యాసంగం 1875లో ప్రారంభమై, మరణించే వరకు కొనసాగింది. ఆయన రచనల్లో ప్రధానంగా...వసురాయ చాటు ముక్తావళి, వసురాయ చాటు ప్రబంధం, నామనందన శతకం (1877), భక్త చింతామణి శతకం (1883), ఆర్త రక్తమణి శతకం (1933)తో పాటు, సుబ్బరాయుడు మొత్తం 7 నాటకాలు రచించారు. అన్నీ సంస్కృత నాటకాల తెలుగు అనువాదాలు. వేణి సంహారం (1883, ప్రచురణ: 1886), విక్రమోర్వశీయం (1884, ప్రచురణ: 1889), ప్రబోధ చంద్రోదయం (1891, ప్రచురణ: 1893), చండ కౌశికము (1900), అభిజ్ఞాన శాకుంతలము (1906), మల్లికామారుత ప్రకరణము (1903, ప్రచురణ: 1929), ఆంధ్ర కుందమాల (1931, ప్రచురణ: 1932). ఆయన నాటకాలు భాషా సౌందర్యంతో పాటు, సంస్కృత నాటక శైలిలో నిర్మితమై, తెలుగులో చదవడానికి, ప్రదర్శించడానికి అనువుగా ఉండేవి. వాటిని పాఠ్య గ్రంథాలుగా గుర్తించారు, తద్వారా అనేక మంది విద్యార్థులు, నాటకకారులు ఈ నాటకాల ద్వారా ప్రేరణ పొందారు. ఆయన నాటకాలు నాటకీయత, హాస్యం, భావావేశం, పాత్రల లోతైన చిత్రణను కలిగి ఉంటాయి. ఆయన సంస్కృత నాటకాలను తెలుగులోకి అనువదించి, తెలుగు నాటక రంగానికి గొప్ప మదుపరులుగా నిలిచారు. ఆయన రచనలు తెలుగు నాటక రంగానికి ప్రేరణగా మారాయి. నాటక రంగంలో సంస్కృత నాటకాల అనువాదాలను మాత్రమే కాకుండా, స్వతంత్రంగా తెలుగు నాటక రచనకు మార్గ దర్శకత్వాన్ని అందించారు. ఆయన ప్రతిభను గుర్తించి, రాజమండ్రి



పురప్రముఖులు గండపెండేరం తొడిగి "సూక్తి సుధానిధి" అనే బిరుదునిచ్చి సత్కరించారు. ఆయన నాటకాలు పాఠ్యగ్రంథాలుగా చేరి, విద్యార్థులకు ప్రాముఖ్యత కలిగాయి. సుబ్బరాయుడు 1938 మార్చి 2న కన్నుమూశారు. అయినప్పటికీ, ఆయన రచనలు తెలుగు నాటకరంగంలో ఇప్పటికీ ప్రాముఖ్యత కలిగినవే. ఆయన అనువాదాలు, రచనలు నాటక కళాకారులు, విద్యార్థులు, సాహిత్యాభిమానుల కోసం మిగిలి పోయాయి. వడ్డాది సుబ్బరాయుడు తెలుగు నాటకరంగానికి గొప్ప సేవ చేశారు. ఆయన రచనలు సాంస్కృతిక, సాహిత్య, నాటక ప్రస్థానాలకు మార్గదర్శకంగా నిలిచాయి. ఆయన రాసిన నాటకాలు నేడు కూడా ప్రదర్శించబడుతూనే ఉన్నాయి. సంస్కృత నాటకాలను తెలుగులో అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా ఆయన చేసిన కృషి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# భారత కోకిల సరోజినీ దేవి - మార్చి 2 సరోజినీ దేవి వర్ధంతి


దేశం బానిసత్వ, నియంతృత్వ సంకెళ్ళ నుంచీ విముక్తి పొంది స్వతంత్ర్య స్వేచ్ఛా, స్వాత్రంత్ర్యాలతో జీవించాలన్న మహత్తర ఆశయం ఉన్నవారు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారు. అటువంటి వాటిలో పురుషులే కాక, ఏ రంగంలోనూ, తీసిపోరని నిరూపించిన వీరమహిళలు మన దేశంలో చాలా మంది పుట్టారు. అటువంటి వారిలో శ్రీమతి సరోజినీ నాయుడు కూడా ఒకరు. భారత కోకిలగా ప్రసిద్ధి చెందిన కవయిత్రి . సరోజినీ దేవి 1925డిసెంబరులో కానుపూరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు తొలి మహిళా అధ్యక్షురాలు, స్వతంత్ర భారతదేశపు తొలి మహిళా గవర్నరు కూడా. బెంగాలీయుల ఆడపడుచు, తెలుగు వారి కోడలు.. సరోజినీ పన్నెండో ఏట మద్రాస్ యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమురాలిగా నిలిచి పలువురి ప్రశంసలందుకుంది. 13సంవత్సరంలోనే ది లేడి ఆఫ్ ద లేక్ పేరున 1300 పంక్తుల కవితను ఆరు రోజుల్లో రాసింది. సరోజినీ దేవి చటోపాధ్యాయ హైదరాబాదులో శ్రీమతి సరోజినీ నాయుడు అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, వరద సుందరీ దంపతులకు 1879 ఫిబ్రవరి 13న వారి ప్రథమ సంతానంగా ఒక బెంగాలీ బ్రాహ్మణ కుటుంబములో జన్మించింది. తండ్రి అఘోరనాథ్ చటోపాధ్యాయ తూర్పు బెంగాల్ కు చెందిన గొప్పవిద్యావేత్త, డా.ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందిన మొదటి భారతీయుడు. నిజాం కాలేజీ స్థాపకుడు, శాస్త్రవేత్త, తత్వవేత్త. తల్లి భువనసుందరి దేవి ఒక కవయిత్రి. చిన్నతనం నుంచీ ఆమెకు ఇంగ్లీషు భాషమీద చాలా మక్కువ ఉండేది. ఇంగ్లీషు మాట్లాడాలని ఆమె ఎంతగానో ప్రయత్నిస్తూండేది. ఆ పట్టుదలా, ధ్యేయాలతోనే ఇంగ్లీషు భాషను ఎంతో శ్రద్ధగా అభ్యసించింది. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్ లో చదువుకుంది. పదకొండో సంవత్సరం వచ్చేసరికి ఆమె అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడి అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది. ఆ వయసులోనే ఇంగ్లీషులో రచనలు ఆరంభించింది. ఆమె పన్నెండవ ఏట మదరాసు విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషన్ పూర్తి చేయగలిగిందంటే ఆమె చురుకైన తెలివితేటలూ, విద్య యందు ఆమెకు గల భక్తి భావం మనం అర్థం చేసుకోవచ్చు. సరోజినీ పదమూడవ యేట చాలా పెద్ద రచన రచించింది. దానిపేరు సరోవరరాణి (%ఝుఎఎ శీట ఝుఎవ%). అది పదమూడు వందల పంక్తులతో నిండిన అతి చక్కని రచన. తాను చెప్పదలచుకున్న విషయము ఇతరుల హృదయాలకు హత్తుకుని ఆలోచింపజేసే విధంగా కమ్మని శైలిలో చిన్న తనం నాడే రచనలు ప్రారంభించిన ఆమెలోని ప్రత్యేకతలు గ్రహించిన నిజాం నవాబు ఆమె యందు గల అభిమానంతో ఆమెను విదేశాలకు పంపాలని నిర్ణయించుకుని, ఆమె వివిధ శాస్త్రాలలో పరిశోధన చేసేందుకు ప్రోత్సాహమిస్తూ ఆమెకు ప్రతి సంవత్సరం నాలుగువేల రెండు వందల రూపాయలు విద్యార్థి వేతనంగా ఇచ్చేందుకు కూడా అంగీక రించాడు. సరోజిని కవితలని చదివి, మెట్రిక్యులేషన్లో మొదటి స్థానాన్ని తెచ్చుకున్న ఆమె ప్రతిభని గుర్తించిన హైద్రాబాద్ నిజామ్ ప్రభువు విదేశాల్లో చదువుకి ఉపకార వేతనం ఇచ్చారు. కానీ అనారోగ్య కారణంగా రెండు సంవత్సరాలు విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. ఆ రెండు సంవత్సరాలు పుస్తక పఠనంలోనే గడిపి అపారమైన జ్ఞానాన్ని సముపార్జించారు.ఆ కాలంలోనే పదహారేళ్ళ వయసులో సరోజినీ పై చదువులకు లండన్ ప్రయాణమై వెళ్ళారు. లండన్లోనే ప్రముఖ కవులైన ఎడ్మండ్ గాస్, ఆర్థర్ సైమన్ల పరిచయం కలిగింది. ప్రథమ కవితా సంకలనం "గోల్డెన్ త్రెష్ హోల్డ్"లో మూడు ప్రక్రియలూ ఉన్నాయి. ఆ సంకలనం రూపొందడానికి ఆర్థర్ సైమన్ ముఖ్య కారకులు. ఆర్థర్ సైమన్ ప్రోత్సాహంతో మొదటి కవితా సంకలనం వెలువడింది. 1915 వ సంవత్సరం బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ మహాసభ లకూ, 1916 లో జరిగిన లక్నో కాంగ్రెస్ సభలలో ఆమె పాల్గొనటం జరిగింది. ఆనాటి కాంగ్రెస్ భావాలు చాలా ఆదర్శంగా ఉండేవి. సరోజినీనాయుడు భారత దేశములో గల ముఖ్యమైన, నగర, పట్టణాలు తిరుగుతూ స్వాతంత్ర్యోద్యమ ఉపన్యాసాలిచ్చి, ప్రజలతో భాష విప్లవము వచ్చేందుకు కారకురాలయినది. సరోజినీ నాయుడు1930లో ఉప్పు సత్యాగ్రహంలో మహాత్మా గాంధీతో పాటు పాల్గొన్నది. ఆమె మద్రాసులో చదువుకున్నది. చదువు పూర్తయిన తర్వాత 19 సంవత్సరాల వయసులో ఆయనను కులాంతర వివాహము చేసుకున్నది. కులాంతర వివాహములకు సమాజము చాలా వ్యతిరేకముగా ఉన్న ఆ రోజుల్లో సరోజిని గోవిందరాజులు నాయుడును చట్టము ప్రకారము 1898 డిసెంబర్ 2న మద్రాసులో పెళ్ళి చేసుకున్నది. ఈ వివాహాన్ని కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించారు. నాయుడు దంపతులకు నలుగురు పిల్లలు కలిగారు: జయసూర్య, పద్మజ, రణధీర, లీలామణి. ఆమె మొదటి1905లో కవిత్వం గోల్డెన్ త్రెషోల్డ్ ఇంగ్లీషులో కవిత్వం రాసింది.



నైటింగేల్ ఆఫ్ ఇండియాగా ప్రపంచపు ప్రఖ్యాత గడించింది. తర్వాత ది బర్డ్ ఆఫ్ టైం, ది బ్రోకెన్ వింగ్, పాలంక్వైన్ బేరర్స్ ఆమె కవితల్లో కొన్ని. జాన పద గేయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన "పాలంకీన్ బియరర్స్" ఉంది. కవికోకిల కవితలలో గేయాలు, గీతాలు, పద్యాలు ఉన్నాయి. పురోగతినీ, స్వచ్ఛమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్య జీవితాలను వాంఛించిన పురుష కవి రవీంద్రనాథ్ ఠాగూర్ మాదిరిగా స్త్రీయై ఉండి కూడా జాతి విమోచనానికి శాయశక్తులా అహోరాత్రులు కృషి చేసిన త్యాగ పూరిత కవయిత్రి శ్రీమతి సరోజినీనాయుడనటంలో యే మాత్రము సందేహం లేదు. 1908లో మూసీనదికి వరదలు సంభవించిన సమయంలో చేపట్టిన సేవాకార్యక్రమానికి బ్రిటీష్ ప్రభుత్వం "కైజార్ ఎ హిందూ" స్వర్ణ పతకాన్ని బహూకరించింది. భారతీయ ప్రతినిధిగా 1931 వ సంవత్సరంలో లండన్ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్ కు వెళ్ళింది. క్విట్ ఇండియా ఉద్యమంలో 1942 లో బ్రిటిష్ ప్రభుత్వాన్నెదిరించి ఎన్నో రకాలుగా స్వాతంత్ర్య పోరాటం సాగించిందామె. అందుకు ఫలితంగా అరెస్టు చేయబడి, దాదాపు 1945 వరకు దుర్భర కారాగారవాస జీవితం నవ్వుతూ అనుభవించింది. తండ్రి మరణానంతరం రచించిన విషాద కవితలు ఈమెకు కైసర్–ఇ–హింద్' బంగారు పతాకాన్ని సాధించి పెట్టింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో అతిపెద్ద అప్పటి రాష్ట్రం ఉత్తరప్రదేశ్ కు గవర్నరుగా నియమించ బడింది. హైదరా బాదులో తాను నివసించిన ఇంటికి తన మొదట కవితా సంకలనం పేరునే స్వర్ణ ప్రాంగణంగా" ఎన్నుకొన్నది. ఆమె 1949 మార్చి 2న లక్నోలో మరణించినది. ఈమె జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం 1964 ఫిబ్రవరి 13న ఆమె చిత్రంతో ఒక తపాలబిళ్ళను విడుదల చేసింది. ఆమెపై అభిమానంతో హైదరాబాదులో సికింద్రాబాద్ లో ఒక వీధికి సరోజినీ దేవి రోడ్డు' అని నామకరణం చేసారు. ఈమె పేరున హైదరాబాదులో సరోజినీ కంటి ఆసుపత్రి'ని కూడా స్థాపించారు. ఆమె విలువైన వస్తువులు ఇప్పటికీ సాలార్ జంగ్ మ్యూజియంలోను, జాతీయ పురావస్తు ప్రదర్శనశాల లోనూ భద్రంగా ఉన్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# రాష్ట్ర తొలి మహిళా మంత్రి మాసూమా బేగం - మార్చి 2...మాసూమా బేగం వర్ధంతి

కాలం ఏదైనా సమాజంలో, మిగతా మతాల కన్నా ముస్లిం సమాజంలో ఇస్లాం మతంలో స్త్రీల పరిస్థితి పూర్తి భిన్నమైంది. మతాలన్నీ స్త్రీని, పురుషుని తర్వాతనే రెండవ స్థానంలో పరిగణిస్తున్నప్పటికీ, ఇస్లాం మతం స్త్రీని పరదా చాటు వ్యక్తిగా చూసింది. పరాయి పురుషు ల కంటపడటమే నేరంగా కట్టడి విధించింది. పరదా అంటే కొన్ని వర్గాలలో మహిళలు వారి దేహాన్ని కనపడకుండా కప్పుకొనే సాంప్ర దాయ ఆచారం. కొన్ని ప్రాంతాలలో స్వచ్ఛందంగా, మరి కొన్ని ప్రాంతాలలో ఆంక్షల నేపద్యంలో మహిళలు స్వేచ్ఛగా మసలే హక్కును కోల్పోయారు. బురఖా అనేది ఇస్లాం మత ఆచారాలకు చిహ్నంగా మతపరమైన ఆంక్షలను విధిస్తుంది. అలా పరదా చాటు ముస్లిం స్త్రీలు సమాజంలో మిగతా వర్గాల స్త్రీల కన్నా ఎక్కువగా మత ఆచారాలు, పురుషాధిపత్యం విధించిన ఆచారాలు, ఆంక్షల వల్ల అణచి వేతకు, నిర్భందానికీ గురి కావలసి వచ్చింది. మహిళలను మతపరమైన కార్యక్రమాలకు అనుమతించినప్పటికీ, శతాబ్దాలుగా ఎక్కువగా నిర్భంధాన్ని, ఆంక్షలనూ ఎదుర్కొన్నారు. ముస్లిం మహిళల విద్య విషయంలో...మదరసాల్లో విద్యా భ్యాసం కేవలం మగవారికే అందుబాటులో ఉన్నా, పట్టణాలు, నగరాల్లో ప్రాముఖ్యత కలిగిన కుటుంబాల స్త్రీలకు ఇళ్ళు, ఆంతరంగిక ప్రదేశాల్లో విద్య నేర్పేవారు, మహిళలు మత గ్రంథాలను, వ్యవహారికంగా పనికి వచ్చే నైపుణ్యాలను పెద్దల నుంచి, ఒకరి నుంచి ఒకరూ నేర్చుకునే వారు. అలా పరదా ధరించే సంప్రదాయం మాటున... సమాజంలో స్వేచ్ఛగా తిరిగే అవకాశాలు మృగ్యమైన కాలంలో, ఇంటి బయటకు రాని సాంఘిక కట్టుబాట్ల ఆంక్షల నేపద్యంలో ఉన్నత చదువులు చదివే సాహసం చేయడమే కాకుండా ప్రజా సంబంధాలు అధికంగా ఉండే రాజకీయాల్లోనూ ముందుకు సాగడం సామాన్యమైన విషయమేమీ కాదు. అలా విద్యా వేత్త కావడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్టంలో తొలి మహిళా మంత్రిగా చరిత్ర పుటల్లోకి ఎక్కారు మాసూమా



ఇందిరాగాంధీతో మాసూమా బేగం

బేగం. దేశంలో మంత్రి పదవిని అధిష్టించిన తొలి ముస్లిం మహిళ కూడా ఆమెనే కావడం విశేషం. మాసూమా బేగం (అక్టోబరు 7, 1901 – మార్చి 2, 1990) సంఘ సేవకురాలు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్టంలో తొలి మహిళా మంత్రి. దేశంలో మంత్రి పదవిని అధిష్టిం చిన తొలి ముస్లిం మహిళ కూడా ఆమెనే. హైదరాబాదీ అయిన మాసూమా బేగం చిన్నప్పట్నుంచే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. మసూమా బేగం 1901, అక్టోబరు 7 న హైదరాబాదులో విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. ఆమెకు చిన్నతనం నుండి సంఘ సేవలో ఆసక్తి మెండుగా ఉండేది. మసూమా విద్యాభ్యాసం మహబూ బీయా బాలికల పాఠశాలలో జరిగింది. ఆమె 20 సంవత్సరాల వయసులో 1921లో తల్లి తయ్యబా బేగం మరణించడంతో, తల్లిచే స్థాపించబడిన "అంజుమన్ –ఏ – ఖవాతీన్" అనే జాతీయ మహిళా సంస్థకు అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.1922లో ఆమె ఆక్స్‌ఫర్డులో విద్యను అభ్యసించి స్వదేశానికి తిరిగి వచ్చిన తమ కజిన్ హుసేన్ అలీఖాన్‌ను పెళ్ళి చేసు కున్నారు. అమె భర్త డాక్టర్ హుసేన్ ఆలీ ఖాన్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆంగ్ల శాఖా ధిపతిగా పనిచేశారు. 1927లో హైదరా బాదులో ఏర్పడిన అఖిల భారత మహిళా సంస్థ యొక్క ఆంధ్ర శాఖ కార్యదర్శిగా తరువాత అధ్యక్షురాలిగా పనిచేశారు. తల్లి ద్వారా సరోజినీ నాయుడుతో పరిచయం కలిగిన పరిచయం చిరకాలం నిలిచి పోగా, ఆమె సాహచర్యంతో, 1928లో బొంబాయిలో తొలిసారిగా నిర్వహిం చిన అఖిల భారత మహిళా సదస్సులో ఆమె పాల్గొనడం జరిగింది. హైదరాబాద్ రాష్ట్రంలో 1952లో జరిగిన ఎన్నికల్లో శాలిబండ నియోజకవర్గం నుంచి పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెట్టారు. బూర్గుల రామకృష్ణారావు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పని చేశారు. ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాలు విలీనం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1957లో జరిగిన తొలి ఎన్నికల్లో పత్తర్‌గట్టి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిగా విధులు నిర్వర్తించారు. 1960 జనవరిలో రాష్ట్ర మలి ముఖ్య మంత్రి దామోదరం సంజీవ య్య ప్రభుత్వంలో మంత్రిగా చేరారు. 1962లో తిరిగి పత్తర్‌ఘట్టి నియోజకవర్గం నుండి పోటీచేసి స్వతంత్ర అభ్యర్థి సలావుద్దీన్ ఒవైసీ చేతిలో ఓటమి చవి చూశారు. ప్రపంచంలో ద్వేషం, అసూయ నిర్మూలించేందుకు ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన సంఘంలో ఆమె సభ్యురాలుగా ఉన్నారు. మసూమా బేగం 1990, మార్చి 2 న హైదరాబాదులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రజల మనిషి శ్రీపాద రావు - మార్చి 2...శ్రీపాద రావు జయంతి



దుద్దిళ్ళ శ్రీపాదరావు (మార్చి 2, 1935 – ఏప్రిల్ 13, 1999) సీనియర్ కాంగ్రెస్ శాసనసభ్యులు, శాసనసభ స్పీకరుగా పని చేశారు. 1935 సంవత్సరములో మార్చి 2 న కాటారం మండల ధన్వాడ గ్రామానికి చెందిన మౌళి పటేల్ రాధా కిష్టయ్య, కమలా బాయి దంపతులకు జన్మించారు. అమ్మమ్మ వారు నివాసముండే నాగపూర్ లో పుట్టిన అయన ప్రాథమిక విద్య ధన్వాడ గ్రామంలో చేసి, ఎస్ ఎస్ సి వరకు మంథనిలోని బావ సువర్ణ చంటయ్య ఇంట్లో ఉండి పూర్తిచేశారు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్ లో చేసిన తరువాత ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతి ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం కొన్ని రోజులు చేశారు. ఆ తరువాత నాగపూర్ లో న్యాయవాదిగా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో ఎల్. ఎల్. బి. పూర్తి చేసి ప్రాక్టీసు పెట్టారు. తండ్రి మరణాంతరం స్వంత ఊరికి వచ్చిన శ్రీపాద వ్యవసాయమే వృత్తిగా చేసుకొని, గ్రామంలోనే ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామం నుండి సర్పంచ్ గా పోటీ చేయాలని ప్రజలు ఒత్తిడి చేశారు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాద రాజకీయాల్లోకి అడుగిడాలని స్నేహితులు, హితులు ప్రోత్సాహించారు. ఆ దిశగా అడుగులు వేస్తూ పోటీ చేసి మొదటిసారి సర్పంచ్ గా ఎన్నుకో బడ్డారు. వరుసగా మరో మారు ఆయనకే ప్రజలు మద్దతు పలకడంతో రెండవ సారి ఎన్నికయ్యారు. మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ఎల్ ఎం బి ఛైర్మన్ పదవికి మంథని నుండి గెలిచారు. ఆయన రాజకీయ ఎదుగుదలకు ఎల్ ఎం బి బ్యాంకు ఛైర్మన్ ఎన్నిక ఎంతో సహకరించింది. దీంతో పూర్తిగా నియోజకవర్గానికే ఆయన సుపరిచితమైనారు. పదవివస్తే ముఖం చాటు చేసుకునే నాయకులకు భిన్నంగా అయన ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్ట, నష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగారు. 1984 ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుండి ఏమ్మేల్లెగా పోటి చేసే అవకాశం లభించింది. అప్పుడే పురుడు పోసుకున్న తెలుగు దేశం పార్టీ ప్రభావం, ఎన్టిఆర్ ప్రభంజనం ముందు శ్రీపాదరావు విజయం సాధించ గలుగుతారా? అనే అంశం పై స్వ, విపక్షాలలో చర్చ జరిగింది. తెలుగుదేశం, సంజయ్ విచార మంచ్ మధ్య ఎన్నికల ఒప్పందం కారణంగా మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటిగా సంజయ్ విచార మంచ్ నుండి చంద్రుపట్ల రాజి రెడ్డి పోటీ పడ్డారు. వీరిద్దరి మధ్య గట్టి పోటి నెలకొనగా చివరకు శ్రీపాదరావు విజయం సాధించారు. కరీంనగర్ జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ తరపున మంథని ప్రాంత ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు పి. సి.సి. సభ్యునిగా స్థానం కల్పించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు శాసన సభ్యులుగా ఎన్నికైన ఆయనకు శాసనసభ స్పీకర్ గా అన్ని పార్టీల మద్దతుతో పదవి అలంకరించారు ఆ పదివికి వన్నె తెచ్చారని ఎంతో మంది ప్రముఖుల, రాజకీయ విశ్లేషకుల ప్రశంశలు పొందారు. ఒకవైపు స్పీకర్ పదవి బాధ్యతతో నిర్వహిస్తునే మరోవైపు తన స్వంత నియోజకవర్గ ప్రజలను మాత్రం మరిచిపోకుండా, మరింత దగ్గరయ్యారు. విమర్శలకు వెరవకుండా, పొగడ్తలను లెక్క చేయకుండా, అభివృద్ధిపై దృష్టి సారిస్తూ ముందుకు కదిలారు. ఒక సామాన్య కుటుంబం నుండి ఎదిగిన రాజకీయ నాయకుడు కావడంతో ప్రజల కష్ట, సుఖాలు తెలిసిన మహా మేధావి కనుక ప్రభుత్వ విధి – విధానాలపై అసెంబ్లీలో చురుకైన పాత్ర పోషించి, ఆ పదవికే వన్నె తెచ్చారని ఎంతో రాజకీయ విశ్లేషకులు కితాబిచ్చారు. 1994 ఎన్నికల ముందు నక్సల్స్, పోలీసుల మధ్య జరిగిన ప్రత్యక్ష పోరు తీవ్రంగా ప్రభావం చూపింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో శ్రీపాదరావు పరాజయం పాలయ్యారు. అయిన ఓటమి పాలయిన ప్రజలకు మాత్రం దూరం కాలేదు. వారి మధ్య లోనే ఉంటూ వారికి తన శక్తి మేరకు సేవ చేస్తూనే ఉంటూ వచ్చారు. తన ఓటమికి విమర్శ కూడా చేయకుండా హుందాగా వ్యవహరించి, తన ప్రజాభిమాన్ని మరింత చూరగొన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి బాగాగులను ఎల్లవేళలా యోచించే ఆయనను మృత్యువు నక్సల్స్ రూపంలో కబళించింది. 1999 ఏప్రిల్ 13న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రమంతటా విషాద ఛాయలు అలుము కున్నాయి. మంథని ప్రాంతమంత శోక సాగరంలో మునిగి పోయింది. మహాదేవపూర్ మండలం అన్నారం కు తన అనుచర వర్గంతో వెళ్లి వస్తున్న క్రమంలో మార్గమధ్య లోని అడవుల్లో శ్రీపాదరావు వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలి తీసుకెళ్ళి తుపాకి తూటాలతో విగత జీవున్ని చేశారనే వార్త తెలవగానే ప్రజలలో నక్సల్స్ పై ఆక్రోశం ఒక్కసారిగా ఉప్పెనల బయటికి వచ్చింది. ప్రజా నాడి అయిన శ్రీపాదరావును హత మార్చిన విషయం తెల్సుకున్న ప్రజలు నక్సల్స్ ను ఎవరిపైన మీ యుద్ధం ప్రజల పైననా? ప్రజా హృదయం పైననా?" అంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఎన్నడు అపకారాన్ని తలపెట్టని నాయకున్ని నిష్కారణంగా హత మార్చిన నక్సల్స్ పై విమర్శలు వెల్లు వెత్తాయి. రాజకీయంగా అనిశ్చిత పరిస్థితి నెలకొంది. ప్రజల కోసం తుపాకులు పతి పోరు బాట పట్టినట్లు చెప్పుకొనే నక్సల్స్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం ప్రతి ఒక్కరు ప్రత్యక్షంగా విమర్శించారు. అప్పటి రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు సైతం హుటా హుటిన మార్చురీలో ఉన్న మృత దేహాన్ని చూసేందుకు తరలి వచ్చారు. నక్సల్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, వేల మందికి పైగా కన్నీటి పర్యంతమై శ్రీపాదరావు అంత్య క్రియల్లో పాల్గొన్నారు. అనంతరం పీపుల్స్ వార్ అగ్రనాయకత్వం, కేంద్ర కమిటీ సబ్యుడు సంతోష్, శ్రీపాదరావును హతమార్చడం నక్సల్స్ యొక్క చారిత్రాత్మక తప్పిదం అని పేర్కొన్నాడు . ఒక ప్రజా నాయకున్ని అన్యాయంగా చంపామంటూ తప్పు ను ఒప్పుకునారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సాగు ఘనం.. సేవలు మృగ్యం

జగిత్యాల : పండ్లు, పూలు, కూరగాయలు తదితర ఉద్యానపంటల సాగువిస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్నా.. ఉమ్మడి జిల్లా రైతులకు ఉద్యాన శాస్త్రవేత్తల సేవలు అందటంలేదు. ప్రధాన పంట వరికి ప్రత్యామ్నాయంగా పండ్లతోటలు, ఇతర ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలు పండించాలని ప్రభుత్వం పేర్కొంటున్న తరుణంలో దీర్ఘకాలికంగా రైతులకు ఉపకరించేలా ఉద్యాన శాస్త్రవేత్తల సేవలను అందుబాటులోకి తేవాల్సి ఉంది. మామిడి, పసుపు, కూరగాయల సాగులో ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోనే ముందువరుసలో ఉండగా ఇటీవల డ్రాగన్, జామ, అరటి, సీతాఫల్, బొప్పాయి తదితర పండ్లు, పూలు, కూరగాయల సాగును రైతులు అధికంగా చేపడుతున్నారు. సారవంతమైన నేలలు, అనుకూల వాతావరణం, సాగునీటి లభ్యత తదితరాలు ఉద్యాన పంటల సాగుకు ఊతంగా ఉన్నా స్థానికంగా ఉద్యాన పరిశోధనలు లేకపోవటం తీవ్ర ప్రతిబంధకంగా మారింది. దేశవిదేశాల



కు మన మామిడి ఎగుమతి అవుతున్నా నాణ్యతను మరింతగా మెరుగుపరచటం, పసుపులో అధిక కర్కుమిన్ రకాల రూపకల్పన, ఇతర పైర్లలో మేలైన వంగడాల రూపకల్పన, మెండైన దిగుబడి సాధన, ఉప ఉత్పత్తుల తయారీకి రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకొని ఉద్యాన శాస్త్రవేత్తల సేవలను రైతులకు అందుబాటులోకి తేవాల్సి ఉంది.

**వాలంతరి క్షేత్రం అనుకూలం**

జగిత్యాల పొలాసలో వరి, నువ్వులు, కరీంనగర్‌లో మక్క, కూనారంలో వరి పరిశోధనస్థానాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన వర్సిటీలు వేరువేరు కావటంతో మన జిల్లాలోని పరిశోధనస్థానాల్లో ఉద్యాన శాస్త్రవేత్తలను నియమించక రైతులకు సేవలు అందటంలేదు. ప్రభుత్వ హామీమేరకు జగిత్యాల మండలం చల్‌గల్‌లోని వాలంతరి ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధనస్థానాన్ని ఏర్పాటుచేస్తే మామిడి, పసుపు, ఉల్లి, అల్లం, కూరగాయలు, మిరప, సీతాఫల్, జామ, బత్తాయి, బొప్పాయి, కర్బూజా, సపోటా, అరటి, గులాబీ, చేమంతి, జెర్బెరా తదితర పండ్లు, పూలు, అన్నిరకాల కూరగాయల్లో స్థానికంగా అనువైన వంగడాలను శాస్త్రవేత్తలు ఉత్పత్తిచేసే అవకాశముంది. పంటల సాగులో తలెత్తే అనేక సమస్యలకు శాస్త్రవేత్తలు క్షేత్ర పరిశీలన జరిపి పరిష్కారాలను చూపే వీలుంటుంది. జిల్లా రైతులకు అనువైన ఆధునిక సాకేంతికత అందుబాటులోకి వచ్చి అమితంగా లాభిస్తుంది. దీనికిగాను జగిత్యాల పట్టణానికి సమీపంలో ఉన్న 72 ఎకరాల సువిశాల క్షేత్రంలోని చల్‌గల్ వాలంతరిక్షేత్రం ఉద్యాన పరిశోధనస్థానం ఏర్పాటుకు అత్యంత అనువుగా ఉన్నట్లు గుర్తించారు. చల్‌గల్ క్షేత్రంలో పండ్లతోటలు, సాగునీటి వసతి, కార్యాలయం, శిక్షణ భవనాలు, వసతిగృహం, గోదాము, ల్యాబ్, ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉండటంతో ములుగులోని రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉద్యాన పరిశోధనస్థానాన్ని కేవీకేను నెలకొల్పాలని కర్షకులు కోరుతున్నారు.

# సర్వేతో పరిష్కారం!

ధర్మపురి : జిల్లాలోని అయిదు పురపాలక సంఘాల్లో ఈ వేసవిలో తాగు నీటి సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. క్షేత్రస్థాయిలో వార్డుల వారీగా సర్వే చేయాలని పుర అధికారులను ఆదేశించింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో వార్డుల వారీగా సిబ్బందితో సర్వేలు చేపట్టారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలలో అయిదేసి బృందాల చొప్పున, నూతన పురపాలికలైన ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో మూడేసి బృందాల చొప్పున సర్వే చేపట్టారు. పురపాలక సంఘాల కమిషనర్ల ఆధ్వర్యంలో సర్వే చేపట్టగా.. ఒక్కో బృందంలో ఏఈ స్థాయి అధికారి, ముగ్గురు వార్డు అధికారులు ఉన్నారు. ఈ నెలాఖరులోగా సర్వేలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలను పంపించాల్సి ఉంటుంది.

**అప్పటికప్పుడే నిధులు**

ఏఏ వార్డుల్లో నీటి వసతులు ఉన్నాయి.. ఎక్కడెక్కడ నీటి సమ్యలున్నాయి.. మిషన్ భగీరథ లీకేజీలు ఉన్నాయా.. ఇంటింటికీ నీరు అందుతోందా.. వంద శాతం నీరందించాలంటే ఏమేమి పనులు చేయాలి.. నీరందని ఇళ్లు ఎన్ని ఉన్నాయి.. తాగు నీటి పైపులైను పనులు పూర్తయ్యాయా.. బోర్లు పని చేస్తున్నాయా.. పని చేయని బోర్ల మరమ్మతులు అవసరం చేయాలంటే ఏమి చేయాలి.. నూతన బోర్‌వెల్స్ ఎక్కడెక్కడ అవసరం అవుతాయి.. నూతన పైపులైను పనులకు ఎన్ని నిధులు అవసరం అవుతాయి.. తదితర విషయాలపై సర్వే చేస్తున్నారు. చిన్న లీకేజీలు ఇతర సమస్యలుంటే అప్పటికప్పుడే జనరల్ నిధుల నుంచి నిధులు మంజూరు చేయించి పరిష్కరించాల్సి ఉంటుంది. వేసవిలోపు ప్రతి వార్డులోను తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



తీసుకునేందుకు ముందస్తు సర్వేలు చేపట్టారు.

ధర్మపురి పురపాలికలో 2300 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. మిషన్ భగీరథ కింద 10 ట్యాంకుల నిర్మాణాలు పూర్తయ్యాయి. అమృత్ పథకం కింద ధర్మపురి పురపాలికకు రూ.23 కోట్ల నిధులు కేటాయించారు. రెండు చోట్ల నీటి ట్యాంకుల నిర్మాణ పనులు, అదనపు పైపులైన్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ధర్మపురి పురపాలికలో అయిదు ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలను గుర్తించినట్లు పురపాలిక కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాగు నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని.. ఫిబ్రవరి నెలాఖరులోగా సర్వే చేసి నివేదిస్తే ఈ మేరకు తాగు నీటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూతనంగా 4 నీటి ట్యాంకర్లను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.వ్యాప్తంగా నిర్వహించే ఈ సర్వే ఫలితంగా పూర్తిగా నీటి సమస్యల నివారణకు కృషి జరుగుందని చెప్పారు.

# ప్రాణవాయువు అందేదెలా?



కోరుట్ల : అత్యవసర సమయాల్లో రోగులకు ప్రాణవాయువును అందించేందుకు ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌లు ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారాయి. కరోనా సమయంలో ఆక్సిజన్ కొరత ఏర్పడి ఎదురైనా ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు ఆక్సిజన్ పరికరాలను సరఫరా చేసింది. కోరుట్ల ఏరియా ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు భవనం లేకపోగా, మెట్‌పల్లి ఆసుపత్రిలో పరికరాలు బిగించినా విద్యుత్తు సౌకర్యం లేక వృథాగా మారాయి.

**ఆరుబయటే పరికరాలు**

కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సుమారు మూడేళ్ల కిందట దాదాపు రూ.50 లక్షలకుపైగా విలువ చేసే ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రభుత్వం అందజేసింది. 500 ఎల్‌పీఎం ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ఐసీయూలో రోగులకు ఆక్సిజన్‌ను సరఫరా చేయాల్సి ఉంటుంది. పాత ఆసుపత్రి భవనంలో స్థలం, గదులు లేకపోగా, నూతన భవనం నిర్మాణంలో ఉండటంతో ఆసుపత్రి ముందున్న ఖాళీస్థలంలో పరికరాలను ఉంచారు. నూతన భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తోంది. నూతన భవనంలో ఆక్సిజన్ సరఫరా కోసం ఐసీయూ గదుల్లో ప్రత్యేకంగా పైపులైన్‌లను ఏర్పాటు చేశారు. మూడు నెలలుగా నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి రోగులకు వైద్యసేవలు సైతం అందిస్తున్నారు. ఆక్సిజన్ ప్లాంట్ మాత్రం ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక గది, రేకుల షెడ్డును నిర్మించకుండా ఆరుబయట ఎండలో నిర్లక్ష్యంగా పడేశారు. రూ.లక్షలు విలువ చేసే ఆక్సిజన్ ప్లాంట్ పరికరాలు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదు. ఆసుపత్రిలో రోగులకు అవసరం మేరకు ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సంట్రేటర్‌లను వినియోగిస్తున్నారు.

**విద్యుత్తు నియంత్రిక మంజూరులో జాప్యం**

మెట్‌పల్లి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసినా ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. ఆసుపత్రి వెనుక భాగంలో రేకుల షెడ్డు నిర్మించి యంత్రాలను బిగించారు. 500 ఎల్‌పీఎం(లీటర్ ఫర్ మినిట్) ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఐసీయూతో పాటు అవసరమైన గదులకు అనుసంధానం చేశారు. తాత్కాలిక జనరేటర్ సహాయంతో ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి 100 కేవీ విద్యుత్తు నియంత్రిక అవసరం ఉది. నియంత్రిక ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినా ఇంకా మంజూరు కాలేదు. దీంతో ఆక్సిజన్ ప్లాంట్ వినియోగంలోకి రాలేదు. ప్రస్తుతం ఆసుపత్రిలో అవసరాలకు ఆక్సిజన సిలిండర్లను వినియోగిస్తున్నారు. ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుండగా క్షతగాత్రులు, శస్త్రచికిత్సలు, ఇతర అత్యవసర సమయాల్లో ఆక్సిజన్ అవసరం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్తు నియంత్రికను త్వరితగతిన బిగించి ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

# కొత్త గనులు రాక.. అన్వేషణ లేక!



గోదావరిఖని : సింగరేణి బొగ్గు అన్వేషణలో కీలకపాత్ర పోషించే అన్వేషణ(ఎక్స్‌ప్లొరేషన్) విభాగం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కొత్త గనుల ఏర్పాటుకు ముందు అన్వేషణ విభాగం బొగ్గు నిక్షేపాలను గుర్తించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఎంత లోతుల్లో నిల్వలున్నాయి.. భూగర్భ పరిస్థితులు వంటి వాటిని అన్వేషణ విభాగం నిర్ధారించిన తదుపరి బొగ్గు తవ్వకాలు చేపడతారు. ఇటీవలి కాలంలో కొత్త గనుల ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో అన్వేషణ విభాగానికి పనులు లేకుండా పోయాయి. సింగరేణి గనులు విస్తరించి ఉన్న ఆరు జిల్లాలను మూడు రీజియన్‌లుగా విస్తరించి సేవలందిస్తున్నారు. కొత్తగూడెం, రామగుండం, బెల్లంపల్లి కేంద్రాలుగా రీజియన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం బెల్లంపల్లి కార్యాలయాన్ని ఎత్తివేశారు. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను రామగుండం విభాగానికి సర్దుబాటు చేశారు. ప్రస్తుతం కొత్త గనుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాల్సిందే. దీంతో రామగుండం ప్రాంతంలో కూడా ఆశించిన స్థాయిలో అన్వేషణ పనులు సాగడం లేదు.


**అటవీ శాఖ అనుమతులు రావాలి**

సింగరేణికి ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాలోని తాడిచెర్లలో ఒక బొగ్గు బ్లాకును కేటాయించారు. అయితే దీనికి అన్వేషణ పనులు చేపట్టాలంటే అటవీ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అనుమతులు రాకపోవడంతో పనులు లేకుండా పోయాయి. ఇప్పటికే తాడిచెర్లలోని మరో బొగ్గుబ్లాకును ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు.

**భవిష్యత్తుపై నీలినీడలు**

వందేళ్ల చరిత్ర కలిగిన సింగరేణిలో అన్వేషణ విభాగానిది కీలకపాత్ర. గనుల ఏర్పాటుకు ముందు బొగ్గు నిక్షేపాల గుర్తింపు బాధ్యత ఈ విభాగానిదే. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో పాల్గొంటేనే కొత్త గనులు దక్కే అవకాశం ఉంది. కొత్త బొగ్గు గనులు కేటాయిస్తేనే అక్కడ అన్వేషణ పనులు చేపట్టేందుకు వీలుంది. ఇది వరకే అటవీ ప్రాంతంలోని చంద్రుగొండ, ములుగు, మహదేవపూర్ ప్రాంతాల్లో అన్వేషణ పనులు చేపట్టారు. అయితే ప్రస్తుతం వాటిని దక్కించుకోవాలంటే కొత్త నిబంధన ప్రకారం వేలంలో పాల్గొనాల్సిందే. గతంలోనైతే అన్వేషణ చేపట్టిన చోట బొగ్గు నిక్షేపాలు ఉంటే అక్కడే సింగరేణి గనులు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అన్వేషణ విభాగం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# నైపుణ్యం.. ఆలోచనలకు అవకాశం




సిరిసిల్ల : 'ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ రోజు ఒక కోర్సు చేస్తే.. కొద్దిరోజులకే అది పాతబడిపోతోంది. దీంతో యువతరం దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. కళాశాలల నుంచి పట్టాలతో బయటకు వెళ్లాక తక్కువ ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి'. పాఠ్యాంశాలపై విషయ పరిజ్ఞానం నైపుణ్యం ఉన్నప్పటికీ వారి ఆలోచనలకు కార్యరూపం దాల్చేందుకు అవకాశాలు లేవు. విద్యార్థులు కళాశాలలోనే సొంత ఆలోచనలతో కొత్త ఉత్పత్తులు సృష్టించేందుకు అవకాశాలు రానున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథని, కొండగట్టు జేఎన్‌టీయూ. కరీంనగర్ వాగేశ్వరి, హుజూరాబాద్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు ఏఐసీటీఈ ఐడియా (ఐడియా డెవలప్‌మెంట్ ఎవల్యూషన్ అండ్ అప్లికేషన్ ల్యాబ్)లను మంజూరు చేసింది.

**కొత్త ఆవిష్కరణలపై దృష్టి**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు జేఎన్‌టీయూ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు పది ఉన్నాయి. వీటిలో కొండగట్టు జేఎన్‌టీయూకు 2023లో అటానమస్ హోదా లభించింది. 2024లో ఏఐసీటీఈ నిపుణుల బృందం రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో ఐడియా ల్యాబ్స్ ఏర్పాటుకు అనుకూలతలను పరిశీలించింది. గతేడాది డిసెంబరులో మంథని, కొండగట్టు జేఎన్‌టీయూలు, కరీంనగర్‌లోని వాగేశ్వరి, హుజురాబాద్‌లోని కిట్స్ కళాశాలల్లో ల్యాబ్‌ల ఏర్పాటుకు అనుమతులిచ్చారు.కొండగట్టు, మంథనిలో ఒక్కో కళాశాలలో రూ.కోటి నిధులు విడుదల చేయనున్నారు. ప్రైవేటు కళాశాలల్లో వివిధ రంగాల్లోని ప్రైవేటు నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. ఆరు నెలల్లో వీటి నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థుల ప్రయోగాలకు అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం. ఇంజినీరింగ్ విద్యార్థుల ఆలోచనలను నమూనాగా మార్చడానికి ఐడియా వేదిక కానుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, కంప్యూటర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతోపాటు ఆయా కళాశాలల్లోని ప్రత్యేక కోర్సులకు సంబంధించి అత్యాధునిక సౌకర్యాలు ఒకే చోట అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు తమ పాఠ్యాంశాల్లోని అంశాలకు సృజనాత్మకతను జోడించి కొత్త ఆవిష్కరణలను సృష్టించేందుకు విస్తృతమైన అవకాశాలు ఈ ల్యాబ్ కల్పిస్తుంది. **ఆలోచనలు పంచుకోవచ్చు**

ఐడియా ల్యాబ్‌లో విద్యార్థులతోపాటు వ్యాపార రంగంలోని వారు తమ ఆలోచనలు పంచుకోవచ్చు. నూతన ఆవిష్కరణలు తీసుకురావాలనే విద్యార్థులకు ఇది ఒక మంచి వేదిక. దీనివల్ల కొత్త కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లో ప్రవేశపెట్టవచ్చు. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రయోగాల తర్వాత ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

సూరం సాత్విక్, ఈసీఈ, ద్వితీయ సంవత్సరం, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల

**సాంకేతికతపై పట్టు**

ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ మారుతున్న సాంకేతికతపై పట్టు సాధించుకోవడానికి ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడనుంది. ఒక నమూనా తయారు చేయాలంటే దానికి అన్ని విభాగాలు పనిచేయాలి. అది విజయవంతమైతే దాని ప్రతిఫలం అందరూ పొందుతారు. నూతన ఆవిష్కరణలు చేపట్టాలనుకునే వారికి ఇది మంచి అవకాశందుర్గం లక్ష్మీప్రసన్న, సీఎస్‌ఈ, తృతీయసంవత్సరం, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల

# అయిలూరి.. ఆధునిక హాలహాదారి

తల్లాడ : చిన్నతనం నుంచి అతనికి వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆధునిక పద్ధతుల్లో పలు రకాల పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన రైతు అయిలూరి వెంకటకోటి సత్యనారాయణరెడ్డి. అయిలూరి సత్యనారాయణరెడ్డి ఇంటి వెనక భాగంలో ఎకరం పొలం ఉంది. ఇందులో సోలార్ సాయంతో బోరు సమకూర్చుకున్నారు. పంటలకు దీనినుంచే నీరందిస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో డ్రాగన్‌ఫ్రూట్, కాకర, బోడకాకర, దొండకాయ, వంకాయ, టమాట, గోంగూర తదితర కూరగాయలు వేస్తున్నారు. పొలం చుట్టూ జామ, మామిడి, ఆవకాడ, కొబ్బరి, నిమ్మ, సీతాఫలం, స్వీట్‌చింత వంటి పండ్ల మొక్కలు నాటారు. వీటి మధ్యలో



కోళ్ల పెంపకం చేపడుతున్నారు. డ్రాగన్ మధ్య సాళ్లలో పెసర, మినుము, బంతిపూలు, ఆకుకూరలను వేశారు. సేంద్రియ పద్ధతిలో డ్రిప్ ద్వారా పంటలు పండిస్తున్నారు.

**వరి పొలంలో..**

అయిలూరికి మరో రెండు ఎకరాల భూమి కూడా ఉంది. అదనంగా అయిదెకరాలు కౌలుకు తీసుకొని అందులో నూతన వరి రకాలు పండిస్తున్నారు. ఈ ఏడాది ఏడు రకాల వరి సాగు చేశారు. ధాన్-62, ధాన్-53, కేఎన్‌ఎం-7715, కేఎన్‌ఎం-12368, ఆర్‌పీ బయో-226, 15048 రకం, సవానా రకం పండించారు.

అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏడేళ్లుగా క్షేత్ర ప్రదర్శనకు ఈయన పొలానికి వస్తున్నారు. సాగు ప్రారంభం నుంచి చేతికొచ్చే వరకు అన్నింటిపై శిక్షణ ఇస్తున్నారు.

2023లో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఉత్తమ రైతు, 2024లో సూర్యాపేట గడిపల్లిలో ఉత్తమ రైతు పురస్కారం అందుకున్నారు. ఎనిమిదేళ్ల క్రితం మధిరలో అగ్రికల్చర్ రీసెర్చి సెంటర్(ఏఆర్‌ఎస్) నుంచి పురస్కారం దక్కించుకున్నారు.'మా గ్రామం వ్యవసాయ ఆధారితం. పదేళ్ల నుంచి డ్రమ్‌సీడర్ ద్వారా వరి పంటను సాగు చేస్తున్నా. ఎకరానికి 35నుంచి 40బస్తాల దిగుబడి వస్తుంది. పురుగు మందులు పిచికారీ చేయకుండా ఆర్గానిక్ పద్ధతిలో డ్రిప్, పిచికారీ చేస్తున్నా.' అయిలూరి సత్యనారాయణరెడ్డి, రైతు.

# మన్యం వైద్యానికి మహర్దశ..!

భద్రాచలం : గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలు మెరుగుపడనున్నాయి. ఏటూరునాగారం, నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరుతో పాటు భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో టి-హబ్‌లను మార్చి ఆఖరు నాటికి ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో తెలంగాణ డయాగ్నస్టిక్స్ హబ్(టి-హబ్) ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. రెండేళ్ల క్రితం రూ.కోటితో రక్త పరీక్ష కేంద్రాన్ని విస్తరించి టి-హబ్ సేవలందించాలని సర్వే చేసినా సాధ్యపడలేదు. రూ.కోటితో భవనం నిర్మించాలా..? లేదా పరికరాలు కొనాలా..? అనే సందిగ్ధం నెలకొంది. ఇటీవల ఐటీడీఏ తరఫున వైద్యశాఖ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపటంతో మళ్లీ దీనిపై ఉన్నతస్థాయిలో సమీక్ష జరిపారు. ఏరియా ఆసుపత్రిలోని పాత క్యాంటీన్ ప్రాంతంలో టి-హబ్ పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ ఇప్పటికే ఉన్న షెడ్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు మరమ్మతులు, ఇతర ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు.

**అంతర్రాష్ట్ర స్థాయిలో సేవలు..**

ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలతో పాటు తెలంగాణలోని మన్యం వాసులకు భద్రాచలం ప్రభుత్వ దవాఖానా అపర సంజీవనిగా మారింది. 200 పడకలు గల సర్కారు ఆసుపత్రిలో నిత్యం నాలుగైదు వందల మంది ఓపీ సేవలందుకుంటున్నారు.

ఇక్కడ నెలకు 3వేలకు తగ్గకుండా సాధారణ రోగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. లివర్, కిడ్నీ, థైరాయిడ్, కొలెస్ట్రాల్, సీరం కాల్షియం, సీరం యూరిక్ యాసిడ్, విటమిన్, డెంగీ ఎలీసా వంటి పరీక్షలకు టి-హబ్‌ను ఆశ్రయిస్తుండగా ఇలా రోజుకు 40 నుంచి 50 పరీక్షలను కొత్తగూడెంలోని టి-హబ్‌కు పంపిస్తున్నారు.

రోగ నిర్ధారణ వివరాల సమాచారాన్ని వారి ఫోన్లకే నేరుగా పంపుతారు. నిరక్షరాస్యులు, ఆరోగ్యంపై సంపూర్ణ అవగాహన లేని అమాయకులు,



నిరుపేద గిరిజనులకు ఈ సమాచారం పూర్తిస్థాయిలో తెలియక వెంటనే పరీక్షల ఫలితాలు వస్తాయనే ఉద్దేశంతో ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. భద్రాచలం మన్యం కేంద్రంలో డయాగ్నస్టిక్ హబ్ వస్తే 134 రకాల పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. సత్వరమే రోగ నిర్ధారణ వివరాలు తెలుసుకుని అదేరోజు సర్కారు ఆసుపత్రిలో పైసా ఖర్చు లేకుండా చికిత్స పొందవచ్చు.

అత్యాధునిక సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రేలు అందుబాటులోకి వస్తాయి. నిపుణులు, సిబ్బంది పదుల సంఖ్యలో నియమితులవుతారు. కచ్చితత్వంతో కూడిన నాణ్యమైన ఉచిత రోగ నిర్ధారణతో పేదలకు ఆర్థిక భారం తప్పుతుంది.

**సెంట్రల్ డ్రగ్ స్టోర్..** సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భద్రాచలం ఐటీడీఏలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఉపకేంద్రం ఉండేది. జిల్లాలు విడిపోయాక ఇది కొత్తగూడెం సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌లో భాగమైంది. మళ్లీ ఇప్పుడు దీన్ని భద్రాచలంలో ఏర్పాటు చేసేలా చర్చలు సాగుతున్నాయి. డ్రగ్ స్టోర్ భద్రాచలంలో ఏర్పడితే భద్రాచలం, పినపాక నియోజకవర్గాల ప్రజలకు మేలు జరుగుతుంది.

## మీ సొమ్ముకు మా బాధ్యత

హైదరాబాద్: సాటి మనిషి ఆర్థిక సాయం కోరితే కాదనకుండా ఇచ్చి చేతులు కాల్చుకోవడం, ఇచ్చిన అప్పులు వసూలు కాక ఏళ్ల తరబడి మానసిక వేదన అనుభవిస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్న బాధితులు ఎందరో. అప్పు తీర్చకుండా విసిగిస్తున్న వారి నుంచి డబ్బు, పరిహారం కోసం కోర్టు మెట్లు ఎక్కుతున్నవారు ఎంతోమంది. ఈ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తోందీ సిటీ సివిల్ కోర్టు న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ). రూ.లక్షలు అప్పుగా ఇచ్చి వసూలు కాక ఏళ్లుగా ఎదురుచూస్తున్న బాధితురాలికి డీఎల్ఎస్ఏ ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదిర్చి ఉపశమనం కల్పించింది. బాధితురాలికి చెల్లించాల్సిన రూ.16,73,000, వడ్డీ కలిపి చెల్లించేందుకు రాజీ కుదిర్చింది.

**యాజమాన్య హక్కులు వర్తించేలా ఒప్పందం..**

ఎల్లారెడ్డిగూడకు చెందిన ఒక వ్యక్తి ఆర్థిక అవసరాల కోసం ఖైరతాబాద్‌కు చెందిన మహిళ నుంచి ఆరేళ్ల క్రితం విడతలవారీగా అప్పు



తీసుకున్నాడు. తెలిసిన, నమ్మకం ఉన్న వ్యక్తి కావడంతో అడిగినప్పుడల్లా మొత్తం రూ.16,73,000 ఇచ్చారు. ఈ క్రమంలో ఆమెకు అవసరమైనప్పుడు డబ్బు అడిగినప్పుడల్లా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేసి చిల్లిగవ్వ ఇవ్వలేదు. దీంతో బాధితురాలికి నిద్రలేని రాత్రులు, మానసిక ఒత్తిడితో ఆరోగ్యంపైనా ప్రభావం పడింది. చేసేదేమీ లేక సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ప్రిలిటిగేషన్‌గా పరిగణించి న్యాయసేవాధికార సంస్థకు రిఫర్ చేసింది. అనేక కౌన్సెలింగ్‌ల తర్వాత ప్రతివాది ఎల్లారెడ్డిగూడలో ఉన్న తన 1బీహెచ్‌కే ఫ్లాట్‌ను(504 చ.అ) విక్రయించి డబ్బులు చెల్లించేందుకు అంగీకరించడంతో కథ సుఖాంతమైంది. అంతేకాకుండా బాధితురాలికి డబ్బు అందని పక్షంలో ఎలాంటి చర్యలు ఉంటాయో అవార్డులో తెలిపింది. ఒప్పందం ప్రకారం ఏడాదిలోపు డబ్బు చెల్లించకపోతే యాజమాన్య హక్కులు బాధితురాలికి బదలాయించాలని వెల్లడించింది. విక్రయంలో విఫలమైతే ఒప్పందం ప్రకారం వాటికవే యాజమాన్య హక్కులు వర్తిస్తాయని పేర్కొంది.

## జిల్లాకేంద్రం.. పడకేసిన పారిశుద్ధ్యం

సిరిసిల్ల : జిల్లా కేంద్రమైన సిరిసిల్లలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో ఏదైనా సమస్య ఉన్నా ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని... అధికారులు స్పందించకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలోని ప్రధాన మురుగు కాలువలకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయి, పిచ్చి మొక్కలు పెరిగాయి. మురుగు పారక దుర్వాసన వెదజల్లుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా మురుగంతా రోడ్డుపైకి వచ్చి పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. దోమలతో ఇక్కట్లు తప్పడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. సిరిసిల్లలోని పద్మానగర్ ఓపెన్ జిమ్ ప్రాంతం అసాంఘి కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయంలో కొందరు ఇక్కడికి వచ్చి మద్యం తాగుతున్నారని చెబుతున్నారు. మద్యం సీసాలు, చెత్త చెదారం వేస్తున్నారని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని అంటున్నారు. వీధుల్లో భారీ వృక్షాలు ఉండటంతో వీధి దీపాలు ఉన్నా, చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండి వెలుతురు రావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**దోమల బెడద తగ్గించాలి**

సిరిసిల్లలోని బీవైనగర్‌లో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. దోమల బెడద అధికంగా ఉంది. దోమకాటు వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి.సాయికుమార్, బీవైనగర్

## కళ తప్పిన ప్రకృతి వనాలు..

సిరిసిల్ల : గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచి ప్రజలకు ఆహ్లాదాన్ని చేరువచేయాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా వనాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. రెండేళ్లు ఈజీఎస్ ద్వారా నిర్వహణ చేపట్టగా ప్రస్తుతం వనాలను పట్టించుకోకపోవడంతో బోసిపోయి కనిపిస్తున్నాయి. జిల్లాలో 12 మండలాల పరిధిలో పల్లె ప్రగతిలో భాగంగా పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు అప్పట్లో నిధులు మంజూరు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో వనానికి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులను సమకూర్చారు. గ్రామాల్లో అనుకూలతను బట్టి 20 గుంటల నుంచి ఎకరా విస్తీర్ణంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా నడకదారులు, చిన్నారులు ఆడుకునే ఉపకరణాలు ఏర్పాటు చేశారు. 255 గ్రామ పంచాయతీల్లో మియావాకీ పద్ధతిలో ఆయా వనాల్లో ఔషధ, ఫలాలను అందించే మొక్కలను విరివిగా నాటించారు. మొక్కలు నాటినప్పటి నుంచి రెండేళ్లపాటు ఆయా వనాల నిర్వహణను ఈజీఎస్ ద్వారా పర్యవేక్షించారు. మూడేళ్ల క్రితమే నిర్వహణ గడువు ముగియడంతో గ్రామపంచాయతీల పరిధిలోకి వచ్చింది.

**పంచాయతీలకు తప్పని భారం**

ప్రకృతి వనాల్లో మొక్కలు ఏపుగా పెరిగాయి. నిధుల కొరత కారణంగా పల్లె ప్రకృతి వనాల బాధ్యత పంచాయతీలకు భారంగా మారుతోంది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో నిర్వహణకు ఖర్చులు పెట్టేందుకు ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు వెనకాడుతున్నారు. కనీసం నీటిని అందించకపోవడంతో వృక్షాలు వాడిపోయి కనిపిస్తున్నాయి. ఆకులు రాలి అధ్వానంగా కనిపిస్తున్నాయి. నడకదారులు, చిన్నారులు ఆడుకునే పరికరాలు ధ్వంసమవుతున్నాయి. ఆహ్లాదాన్ని పంచే గ్రామీణ ఉద్యాన వనాలు కళావిహీనంగా తయారవుతున్నాయి. పలుచోట్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వనాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నాలుగు నెలలుగా నిరీక్షణ



హైదరాబాద్ : మెట్రోరైలు రెండోదశ మొదటి భాగం(పార్ట్–ఏ) సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు(డీపీఆర్‌లు) కేంద్రానికి చేరి దాదాపు నాలుగు నెలలు కావస్తోంది. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో సంయుక్త ప్రాజెక్ట్‌గా రెండోదశ చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని ఇప్పటికే పలు దఫాలు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. తాజాగా బుధవారం ప్రధాని మోదీని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చెందిన ఐదు ముఖ్యమైన ప్రాజెక్టులతో పాటూ మరోమారు మెట్రో అనుమతిపై విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిమండలి ముందుకు రాకుండా రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సీఎం వ్యాఖ్యానించడంతో మెట్రో విస్తరణ అంశం చర్చనీయాంశంగా మారింది.

**ఐదు కారిడార్ల ప్రతిపాదన:** మెట్రో మొదటి భాగంలో ఐదు కారిడార్లను ప్రతిపాదించారు. 76.4 కి.మీ.గాను రూ.24,269 కోట్లు అవుతుందని అంచనా. నవంబరు 2న పరిపాలన పరమైన అనుమతులు జారీ చేశారు. ఒక్కో కారిడార్ డీపీఆర్‌లతో పాటూ హెచ్ఎండీఏ పరిధి వరకు సిద్ధం చేసిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ ట్రాఫిక్ అధ్యయన నివేదిక, ప్రత్యామ్నాయ రవాణా ప్రణాళికలు, పరిపాలన అనుమతులను జత చేసి నవంబరు 4న కేంద్రానికి పంపారు.

**సావరిన్ గ్యారంటీ ఇస్తేనే..**

కేంద్రం, రాష్ట్రంతో పాటూ పీపీపీలో 52శాతం నిధులు సమకూరనుండగా... మిగతా 48శాతం రుణం తీసుకోవాలనేది ప్రణాళిక. ఇందుకు కేంద్రం సావరిన్ గ్యారంటీ ఇస్తే 2 శాతం కంటే తక్కువ వడ్డీరేట్లకు రుణం పొందే అవకాశం ఉంటుంది. జైకా, ఏడీబీ వంటి సంస్థలు రుణాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

**అనుమతులతో పాటూ నిధులు ఇవ్వాలని..**

రెండోదశ ప్రాజెక్ట్ డీపీఆర్‌లను కేంద్రం పరిశీలించి అనుమతి ఇవ్వడంతో పాటూ నిధులు ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్రం కోరుతోంది. ఇందుకోసమే సంయుక్త ప్రాజెక్ట్‌గా దీన్ని రూపొందించింది. ముందస్తుగా కేంద్రానికి సమాచారమిచ్చి వారి నుంచి ప్రాథమిక అంగీకారం తీసుకున్నారు. తర్వాతే సంయుక్త ప్రాజెక్ట్‌గా రూపొందించారు. 4శాతం పీపీపీ ద్వారా సమకూర్చుకునేలా డిజైన్ చేసినట్లు వివరించింది. ఇది పూర్తయితే 8లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందుబాటులోకి రానున్నాయని కేంద్రానికి చెప్పారు.

గతంలో వివిధ మెట్రోలకు కేంద్రం ఇచ్చిన ఆమోదం

చెన్నై మెట్రో రెండో దశ అక్టోబరు 2024లో ఆమోదం (రూ.63,246 కోట్ల ప్రాజెక్ట్)

బెంగళూరు మెట్రో రెండో దశ ఏప్రిల్ 2021లో ఆమోదం (రూ.14,788 కోట్లు)

బెంగళూరు మెట్రో మూడోదశ ఆగస్టు 2024లో ఆమోదం (రూ.15,611 కోట్లు)

వాటాలు (శాతాల్లో)

కేంద్రం 18 (రూ.4230 కోట్లు)

రాష్ట్రం 30 (రూ.7313 కోట్లు)

రుణం 48 (రూ.11,693 కోట్లు)

పీపీపీ 4

# భవిత.. పరీక్షలంటే కలత



హైదరాబాద్ : 12–16 ఏళ్లలోపు బాలబాలికలు ఇంటి నుంచి అదృశ్యం కావటానికి ఆకర్షణ, తల్లిదండ్రుల మందలింపు, కుటుంబ గొడవలు, ఎగ్జామ్ ఫోబియా కారణాలని పోలీసులు విశ్లేషిస్తున్నారు. 2020–2024 మధ్య రాష్ట్ర వ్యాప్తంగా అదృశ్యమైన వారిలో 684 మంది చిన్నారులే ఉన్నారు. సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు ఈ ఏడాది ఇప్పటి వరకూ ఇల్లొదిలి రైల్వేస్టేషన్‌కు చేరిన 23 మంది మైనర్లను గుర్తించారు. ఏటేటా పెరుగుతున్న పోటీ.. మార్కులు, ర్యాంకుల గోల. లక్ష్యాన్ని చేరగలరా! లేదా! అనే ఆందోళన. ఇటు తల్లిదండ్రులు..అటు విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సున్నిత మనస్కులు, ఒత్తిడిని భరించలేని పిల్లలు క్షణికావావేశంలో తప్పటడుగు వేస్తున్నారు. మరికొందరు ఇల్లొదిలి వెళ్లిపోతున్నారు.

స్లిప్‌టెస్ట్‌లో మార్కులు తగ్గాయనే భయం. ఇంట్లో తెలిస్తే చీవాట్లు తప్పవనే గుబులు. తరగతి గదిలో అవమానాలు. ఎటూతేల్చుకోలేని ఓ ఇంటర్ విద్యార్థి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు.

ఇద్దరు పదోతరగతి విద్యార్థినులు రీల్స్‌పై మోజులో పుస్తకం పట్టడం వదిలేశారు. తీరా పరీక్షల్లో తప్పుతూ వస్తుండటంతో రైలెక్కి తిరుపతి చేరారు.

**రీల్స్.. డబ్బు సంపాదనపై మోజు**

'ఎంత చదివినా ఏమొస్తుంది మాస్టారు. యూట్యూబ్‌లో స్టార్‌గా గుర్తింపు పొందితే. విపరీతమైన క్రేజ్. కావాల్సినంత డబ్బు దొరుకుతుంది'.. పాఠశాలకు గైర్హాజరైన పదోతరగతి విద్యార్థి నుంచి ఉపాధ్యాయుడికి ఎదురైన సమాధానం. రూ.35వేల ఖరీదైన ఫోన్‌ను కొనిస్తేనే పరీక్ష రాస్తానంటూ ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థిని తల్లిదండ్రులకు షరతు విధించింది.

**చదువంటే భయం**

తల్లిదండ్రులు కోప్పడ్డారని, పరీక్షలంటే భయం, హైదరాబాద్ చూడాలనే కోరికతో వచ్చామని పట్టుబడిన పిల్లలు చెబుతున్నారని ఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు. తాజాగా నగరంలో నలుగురు విద్యార్థులు పరీక్షల్లో కాపీ కొడుతూ పట్టుబడ్డారు. ఉపాధ్యాయులు మందలించటంతో రైల్లో బంధువుల ఇంటికి చేరారు. కన్నవారి ఆశలకు అనుగుణంగా చదవలేని పిల్లలు బలవన్మరణాలకు పాల్పడటం, ఇంటి నుంచి పారిపోతుంటారని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు.

**ఇవీ అసలు కారణాలు**

మానసిక ఒత్తిడి, ప్రతికూల ఆలోచనలు

రోజువారీ నిర్వహించే పరీక్షల మార్కులతో తప్పుతామనే భయం

అభద్రతా భావం– ప్రతిభపై అపనమ్మకం

తల్లిదండ్రులు, విద్యాసంస్థలు నిర్దేశించిన లక్ష్యాలు

తోటి విద్యార్థులతో పోల్చుకోవటం,

గత పరీక్షల్లో మార్కులతో పోలిక

ఏకాగ్రత లోపించటం

విద్యాసంస్థ ప్రాంగణంలో ఎక్కువ సమయం చదవాల్సి రావటం

తల్లిదండ్రుల పర్యవేక్షణలోపం

భయం తొలగించేలా కౌన్సెలింగ్

– పి.సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు, రాంనగర్

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు భరోసానిస్తే చాలు. పదోతరగతి విద్యార్థుల్లో ఆ భయాలను ముందుగానే దూరం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధ్యాయులకు మానసిక నిపుణులతో మూడు రోజులు శిక్షణ ఇప్పించారు. వారు రోజూ పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

**పిల్లల్లో ఆత్మవిశ్వాసమే అస్త్రం..**

– వీర్‌కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

రోజువారీ పరీక్షల్లో వచ్చే మార్కులను ప్రామాణికంగా చేసుకొని కొందరు విద్యార్థులు ఆందోళనకు గురవుతుంటారు. తరచూ గైర్హాజరయ్యే పిల్లల్లో ఒత్తిడి ఉంటుంది. ఒత్తిడికి గురవుతున్న పిల్లల్ని గుర్తించి ప్రత్యేక తరగతులతో సమస్యను అధిగమించేలా ప్రోత్సహిస్తున్నాం.

# ప్రభుత్వ భూముల్లో అసైన్డ్‌దారుల హల్‌చల్




హైదరాబాద్ : ప్రభుత్వం తమకు కేటాయించిన భూములను రవాణాశాఖకు ఇవ్వడంపై దుండిగల్‌కు చెందిన అసైన్డ్‌దారులు ఆందోళన చేపట్టారు. రూ.2 వేల కోట్ల విలువైన 50 ఎకరాల భూములపై హక్కులున్నాయంటూ హల్‌చల్ చేస్తున్నారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు మేడ్చల్ జిల్లా ప్రాంతీయ రవాణా కార్యాలయ అధికారులు పనులను కొద్దిరోజుల నుంచి అడ్డుకుంటున్నారు. బాహ్యవలయ రహదారి ఎగ్జిట్–5కు సమీపంలో ఈ భూములు ఉండడం.. నర్సాపూర్ రహదారికి 2 కిలోమీటర్ల దూరం కావడంతో ప్రాంతీయ రవాణా కార్యాలయం ఏర్పాటు చేస్తే మేడ్చల్ జిల్లా మొత్తానికి అందుబాటులో ఉంటుందని భావించిన ప్రభుత్వం నాలుగు నెలల క్రితం యాభై ఎకరాలు ఇచ్చింది. కొన్ని రోజుల క్రితం రవాణాశాఖ అధికారులు అక్కడికి వెళ్లి మట్టి చదును చేయడం, చెత్తను తొలగించి శుభ్రం చేస్తుంటే అసైన్డ్‌దారులు అడ్డుకున్నారు. రవాణాశాఖ అధికారులు అక్రమంగా భూముల్లోకి చొరబడిన వారిపై చర్యలు తీసుకుంటామంటూ అక్కడ బోర్డు ఏర్పాటు చేసి తాత్కాలికంగా పనులను నిలిపివేశారు.

**సాగు కోసం ఇచ్చారంటూ వాదన..** దుండిగల్ మండలంలోని సర్వే నంబర్ 454లో 365.17 ఎకరాల సర్కార్‌భూములున్నాయి. వాటిలో యాభై ఎకరాలకుపైగా భూములను దుండిగల్ పరిసర ప్రాంతాల్లోని రైతులకు దశాబ్దాల క్రితం ప్రభుత్వం కేటాయించింది. రైతులు వర్షాలు కురిసినప్పుడే పంటలు వేసేవారు. ఇరవైఏళ్ల క్రితం సర్వే నంబర్ 253లో 67ఎకరాలను అవుటర్ కోసం హెచ్ఎండీఏ తీసుకోవడంతో వారు సాగు చేయడమానేశారు. కొన్ని నెలల క్రితం రెవెన్యూ అధికారులు ఈ భూములను నిషేధిత జాబితాలోకి మార్చారు. దీంతో రైతులు నిరసన వ్యక్తంచేస్తున్నారు.

## అసంపూర్తిగానే ఆహ్లాదం

కరీంనగర్ : బుట్టిరాజరాంకాలనీలో కరోనా సమయంలో నిలిచిపోయిన పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారు సిద్ధంగా ఉండగా ఆ దస్త్రం దొరకడం లేదని దాటేస్తున్నారు. దీంతో చేపట్టిన పనులూ అధ్వానంగా మారాయి. జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉట్టి పడేలా, ప్రజలకు ఉపయోగపడేలా పార్కులను తీర్చిదిద్దేలా చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. దీంతో ఆహ్లాదం కనిపించకుండా పోతోంది. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి, అమృత్, ముఖ్యమంత్రి హామీ నిధులను కేటాయించారు. కొన్ని చోట్ల పనులను పూర్తి చేయగా, మరికొన్ని చోట్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది.

**పూర్తయ్యేదెన్నడో?**

నగరవ్యాప్తంగా సుమారు 18 పార్కులకు రూ.7 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో కొన్ని ప్రాంతాల్లో పనులు ఇప్పటికీ పూర్తి



కావడం లేదు. పద్మనగర్‌లో సగం మేర పూర్తి చేయగా మిగతా పనుల బిల్లులు ఇవ్వకపోవడంతో ఆగిపోయాయి. హౌసింగ్ బోర్డుకాలనీలో వాచ్‌మెన్ క్వార్టర్ నిర్మించకుండా వదిలేశారు. బాత్‌రూం డోర్లు చెడిపోయాయి. బుట్టి రాజరాంకాలనీలో పనులు మధ్యలో ఆపేశారు. మరో పార్కులో బోర్‌వెల్ చెడిపోగా, ఆట పరికరాలకు మరమ్మతులు చేయడం లేదు. జ్యోతినగర్ శివ థియేటర్ వెనుకాల ఉన్న పార్కులో మొక్కలే లేవు.

**నిర్వహణ కొరవడి..**

న్యూశ్రీనగర్‌కాలనీ, బుట్టిరాజరాంకాలనీ, శివనగర్, అలకాపురి, సప్తగిరికాలనీ, ఏవోఎస్ కాలనీ, జడ్పీ క్వార్టర్స్, జ్యోతినగర్, చైతన్యపురి, బ్యాంకుకాలనీ, వావిలాలపల్లి, మంకమ్మతోట తదితర ప్రాంతాల్లో పార్కులు ఉన్నాయి. నిర్వహణ కొరవడి క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వానంగా తయారవుతోంది. పలుచోట్ల పిల్లల ఆట పరికరాలు విరిగిపోయాయి. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. చెత్తాచెదారం, పనికి రాని గడ్డి పెరగడంతో కొన్ని చోట్ల మూసేశారు. నిర్వహణ అనేదీ పూర్తిగా మర్చిపోయారు. పార్కుల స్థితిగతిపై సమీక్షిస్తామని.. నిధులతో సంబంధం లేని పనులు ఉంటే వెంటనే పూర్తి చేసేలా ఆదేశాలిస్తామని నగరపాలిక ఎస్ఈ రాజ్‌కుమార్ తెలిపారు.

## అనుసంధానం రోడ్డుకు మోక్షమెప్పుడో..!

ముస్తాబాద్ : సిద్దిపేట–రాజన్న సిరిసిల్ల జిల్లాలను అనుసంధానం చేసే రోడ్డు అధ్వానంగా తయారై వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రోడ్డును పట్టించుకునే వారే కరవయ్యారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వరకు రెండువరసల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదలను పంపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్న క్రమంలో ప్రభుత్వం మారడంతో పరిస్థితి ఎప్పటిలాగే మారింది. రాజక్కపేట నుంచి దుబ్బాక వరకు ఇరువరసల రోడ్డు పనులు పూర్తయ్యాయి. ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి మోహినికుంట గ్రామశివారు వరకు మాత్రం పనులు చేపట్ట లేదు.



ఈ మార్గం అధ్వానంగా ఉండటంతో ఇరుజిల్లాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. **ఏళ్లు గడుస్తున్నా...**

ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు మోహినికుంట శివారు వరకు గుంతలమయంగా మారి ఏళ్లు గడుస్తోంది. దీంతో రెండు జిల్లాల వాహనదారులు, ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. ముస్తాబాద్–దుబ్బాక రోడ్డు మంజూరు విషయంలో అప్పటి ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి నివేదించారు. ముస్తాబాద్ నుంచి మోహినికుంట మీదుగా దుబ్బాక వరకు 2023 సంవత్సరంలో ఇరువరసల రోడ్డు నిర్మాణం మంజూరైంది. 14 కిలోమీటర్లకుగాను సుమారు రూ.26 కోట్లు, దుబ్బాక నుంచి రాజక్కపేట శివారు 8.4 కిలోమీటర్లకుగాను రూ.12 కోట్ల నిధుల మంజూరు జరిగింది. కాగా దుబ్బాక నుంచి రాజక్కపేట శివారు వరకు పనులు పూర్తికాగా ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు పనులు చేపట్టలేదు. నిధులు వెనక్కి వెళ్లడంతోనే పనులు జరగలేదని స్థానిక ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

**తప్పని అవస్థలు**

రెండు జిల్లాలను కలిపే రోడ్డు మార్గం కావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంతో పోలిస్తే ఈ మార్గంలో రాకపోకలు పెరిగాయి. వివిధ అవసరాల నిమిత్తం ప్రజల రాకపోకలు పెరిగాయి. రోడ్డు చాలాచోట్ల గుంతలమయం కావడంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఈ మార్గంలో వెళ్లాలంటే ఆందోళనకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి మోహినికుంట శివారు వరకు రెండు వరసల రోడ్డు మంజూరుకు కృషి చేయాలని కోరుతున్నారు.

**పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలి**

ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. భారాస ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో ముస్తాబాద్ నుంచి మోహినికుంట శివారు వరకు 5.6 కిలో మీటర్ల రెండువరసల రోడ్డుకు రూ.14 కోట్ల నిధులు మంజూరు చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మంజూరైన నిధులు వెనక్కివెళ్లాయి. పార్టీలకతీతకంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు దృష్టిసారించాలి. నల్ల నర్సయ్య, మాజీ సర్పంచి, ముస్తాబాద్

చురకలు



# చిన్నేరు.. ఎన్నాళ్లీ కన్నీరు

భువనగిరి : చిన్నేరు వాగుపై లోలెవల్ కాజ్‌వే వంతెనతో భువనగిరి, బీబీనగర్ మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. భువనగిరి మండలం అనాజిపురం నుంచి బీబీనగర్ మండలం జంపల్లి వరకు గల ఈ మార్గంలో రావిపహాడ్ వద్ద 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డుపై పెద్ద గుంతలతో రాళ్లు మొనదేలి ప్రమాదకరంగా మారింది. ప్యారాపెట్‌వాల్స్(రక్షణ దిమ్మెలు)లేక రాత్రి సమయాల్లో వాహనదారులకు ప్రమాదాలు జరిగిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ మార్గంలో సుమారు 15 గ్రామపంచాయతీలకు చెందిన వేలాది మంది ప్రజలు ద్విచక్రవాహనాలు, కార్లు, నడక ద్వారా నిత్యం రాకపోకలు జరుపుతారు. పలు తండాలకు చెందిన రైతులు అనాజిపురం శివారులోని వ్యవసాయ భూములకు, విద్యార్థులు చదువుల నిమిత్తం వచ్చి వెళుతుంటారు. వానాకాలంలో జంపల్లి, రెడ్డినాయక్‌తండా, గొకిరితండా, రావిపహాడ్‌తండాతో పాటు వివిధ గ్రామాల ప్రజలు మగ్దుంపల్లి, బీబీనగర్ మీదుగా చుట్టూ సుమారు 15 నుంచి 20 కి.మీ దూరం తిరిగి రావాల్సి ఉంటుంది. అనాజిపురం వచ్చే పాఠశాల విద్యార్థులు, వివిధ అవసరాలు, వ్యాపారాలు చేసుకునే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. గత ఏడాది ఆగస్టు నెలలో ప్రజల కష్టాలను వెలుగులోకి తీసుకురాగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్పందించి సంబంధిత జిల్లా అధికారులను



ఆదేశించగా పూర్తిస్థాయిలో సర్వే జరిపి రూ.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

**ప్రమాదాలకు నెలవు..**

వాగుపై వరద ఉధృతికి రావిపహాడ్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన కావలి నర్సయ్య, భార్య నర్సమ్మ ఒకరి చేయి మరొకరు పట్టుకొని నీటిలో నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటి ఉధృతికి కాల్వలో పడి మృతి చెందారు. ఇతర గ్రామాలకు చెందిన మరో ముగ్గురు ద్విచక్రవాహనాలపై వెళుతూ నీట మునిగి ప్రాణాలు వదిలారు..

**రైతుల భూములకు వెళ్లాలంటే అవస్థలు..:** 50ఎకరాల వ్యవసాయ భూములు, గేదెల షడ్లు ఉన్నాయి. ఉదయం వెళ్లే సమయంలో తక్కువ నీళ్లే ఉంటాయి. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ఉధృతి పెరిగి ప్రమాదకరంగా మారుతుంటుంది. ఆ సమయంలో చాలా అవస్థలు పడుతూ సుమారు 20 కిమీ చుట్టూ తిరుగుతూ ఇంటికి చేరుకోవాల్సి వస్తుంది.

**ప్రతిపాదనలు పంపించాం**

బాల ప్రసాద్, రోడ్డు భవనాల శాఖ ఈఈ

రావిపహాడ్ వద్ద చిన్నేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో సర్వే జరిపి, రూ.16కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. ముఖ్యమంత్రి దృష్టిలో ఉంది.

పాల వ్యాపారం చేస్తుంటాను

పాశం నర్సిరెడ్డి, మాధారం, బీబీనగర్ మండలం

వ్యవసాయం చేస్తుంటాను. నాకు గేదెలున్నాయి. పాలు తీసుకొని వెళ్లి అనాజిపురం, భువనగిరి తదితర ప్రాంతాలలో విక్రయిస్తుంటాను. చిన్నేరు వాగుపై నీటి పెరిగినప్పుడు మగ్దుంపల్లి మీదుగా చుట్టూ తిరుగుతూ వెళ్లాల్సి ఉంటుంది.

మా పొలాలున్నాయి

బానోతు బిచ్చానాయక్, రావిపహాడ్ తండా

మా తండాలకు చెందిన భూములు చాలా వరకు అనాజిపురం రెవెన్యూలో ఉన్నాయి. వాగు దాటి వెళ్లాలి. వాగుపై వరద ఉధృతి పెరిగినప్పుడు రోడ్డు మూసి వేస్తారు. ఆ సమయంలో పొలాలకు వెళ్లాలంటే చుట్టూ (సుమారు 15కిమీ)తిరిగి వెళ్లాలి.

# ప్రకృతి వనం.. పట్టని వైనం

కోదాడ : పట్టణాల్లో కాలుష్యాన్ని తగ్గించి, పచ్చదనం పెంచే లక్ష్యంగా ప్రభుత్వం పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణ మాత్రం అధ్వానంగా ఉంది. మొక్కలు, చెట్లు పెరగాల్సిన ప్రాంతంలో గడ్డి మొక్కలు పెరిగి కనిపిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. రూ.లక్షలు వెచ్చించి ఒక్కో పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేస్తే, పదుల సంఖ్యలో కూడా మొక్కలు పెరగని దుస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



**బీడు భూమిని తలపిస్తూ..**

పచ్చదనంతో కళకళలాడాల్సిన ప్రకృతి వనాలు బీడు భూములను తలపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా, వీటిలో 300లకు పైగా పట్టణ ప్రకృతి వనాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రకృతి వనానికి బోర్డు, గేటు, స్థలం చుట్టూ రాతి స్తంభాలతో ఫెన్సింగ్, విద్యుత్, బోరు, మొక్కలు ఇలా అన్ని ఏర్పాట్లకు రూ.10 కోట్లకు పైగా ఖర్చయింది. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. కొన్ని వనాల్లో కనీసం బోరు కూడా లేదు. ట్యాంకర్లతో ఎప్పుడో ఒకసారి నీళ్లు పోస్తుండటంతో అవి వాడిపోతున్నాయి. స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ స్తంభాలు, విలువైన తీగ, గేట్లను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోతున్నారు.

**నిర్వహణపై దృష్టి సారిస్తాం: రమాదేవి, పుర కమిషనర్, కోదాడ**

పట్టణంలోని పట్టణ ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయినట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. పచ్చదనమే లక్ష్యంగా మొక్కలు పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

# భాషా నైపుణ్యం.. వ్యక్తిత్వ వికాసం



పెద్దపల్లి : ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆంగ్లంలో ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నారు. గతేడాది తొలిసారిగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అమలు చేయగా, ఈసారి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేశారు. మొత్తం వంద మార్కులకు గాను ప్రయోగాలకు 20 కేటాయించగా, మిగతా 80 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. నాలుగు దశల్లో నిర్వహించే ప్రయోగ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణత సాధించనున్నారు. పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులను అనుత్తీర్ణులుగా ప్రకటిస్తున్నారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

**నాలుగు విడతల్లో నిర్వహణ**

ప్రయోగ పరికరాలతో కాకుండా తరగతి గదిలోనే విద్యార్థుల భాషా సామర్థ్యాలను పరీక్షిస్తారు.

మొదటి దశలో ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థుల మధ్య ఆంగ్ల సంభాషణను అధ్యాపకులు పరీక్షిస్తారు.

రెండో దశలో 'జస్ట్ ఎ మినిట్' పేరిట ఒక అంశంపై నిమిషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది.

మూడో దశ 'రోల్‌ప్లే'లో తల్లిదండ్రులు, లేక మరేదైనా అంశంపై విద్యార్థుల మధ్య బృంద చర్చ ఉంటుంది.

నాలుగో దశ 'లిజనింగ్ కంప్రహెన్సివ్'లో వినే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు.

చివరగా విద్యార్థుల రాసిన రికార్డులను తనిఖీ చేసి మార్కులు కేటాయిస్తున్నారు.

31 నుంచి ప్రయోగ పరీక్ష

ఉమ్మడి జిల్లాలో మొత్తం 197 కళాశాలల్లో 41,861 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆంగ్ల ప్రయోగ పరీక్షను ఈ నెల 31న ప్రథమ సంవత్సరం వారికి, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తారు. పరీక్షలో మొదటి మూడు దశలను కళాశాల యజమాన్యం వెసులుబాటు ఆధారంగా నిర్వహించారు. చివరి విడతలో మాత్రం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన తేదీలో ఏర్పాటు చేయాలి. విద్యార్థుల భవితకు కొలమానంగా ఉన్న ఈ పరీక్ష నిర్వహణపై ఉన్నతాధికారులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో నామమాత్రంగా కాకుండా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా పరీక్ష నిర్వహించనున్నారు.

**నేడు పర్యావరణ విద్య**

ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గతంలో విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించేవారు. ఇందులో ప్రాజెక్టు రూపొందించి నివేదిక సమర్పిస్తే 40 మార్కులు, పరీక్షకు మరో 60 మార్కులు కేటాయించేవారు. గతేడాది విలువల విద్య రద్దు చేసి పర్యావరణ విద్యపై మాత్రమే పరీక్ష నిర్వహిస్తున్నారు. గురువారం ఈ పరీక్ష నిర్వహించనున్నారు.

**తప్పనిసరిగా హాజరు కావాలి**

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నాం. ఇందులో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. 20 మార్కులు కేటాయించడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి విద్యార్థి తప్పకుండా హాజరు కావాలి. కల్పన, ఇంటర్మీడియట్ పెద్దపల్లి జిల్లా నోడల్ అధికారి

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యార్థులు

కరీంనగర్ 12,641

జగిత్యాల 11,887

పెద్దపల్లి 10,566

రాజన్న సిరిసిల్ల 6,767

# ఠాణా గడప తొక్కని గిరిజన పల్లె



ధర్మపురి: సమష్టి జీవనానికి ప్రతీకగా నిలుస్తోంది ధర్మపురి మండలంలోని ఆకుసాయిపల్లె గ్రామం. వందశాతం గిరిజనులు ఉన్న ఈ గ్రామం నుంచి ఎవరూ ఠాణా మెట్లెక్కలేదు. వివాదాలు, ఘర్షణలు ఏమీ తెలియని పల్లె. ఇక్కడి ప్రజలంతా శాంతి, సహనాలతో, సోదర భావంతో మెలుగుతున్నారు. దశాబ్దాలుగా ఒకరికి ఒకరు అండగా ఉంటూ ఎలాంటి వివాదాలు లేకుండా జీవనం గడుపుతున్నారు. ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కనే ఉంది ఈ పల్లె. **అభివృద్ధిలో...**

ప్రభుత్వ పథకాల అమలులో సైతం ఇక్కడి ప్రజలు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకంలో అందరు కలిసికట్టుగా భాగస్వాములవుతున్నారు. ఈ పల్లెలో ఏడు స్వశక్తి సంఘాలుండగా, రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. వాటిని సమృద్ధిగా వినియోగించుకుంటూ సంఘాల పటిష్ఠతకు కృషి చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులున్నారు. పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పేందుకు వారి తల్లిదండ్రులు కృషి చేస్తున్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలకు పంపుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగిస్తున్నారు. ఈ గ్రామం అయిదేళ్ల క్రితం నూతనంగా పంచాయతీగా ఏర్పడింది. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఇక్కడ వంద శాతం చేపట్టారు. సమీపంలోని చెరువే స్థానికులకు ప్రధాన నీటి వనరు. ఈ చెరువు కిందే పత్తి, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు ఏమాత్రం సదుపాయాలు లేని ఈ పల్లెలో నేడు మెరుగైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగు నీరు, విద్యుత్తు సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

**వర్షాధారంగానే పంటలు**

ఆకుసాయిపల్లె గ్రామంలో వర్షాధారంగానే పంటలను పండిస్తున్నారు. నేరెళ్ల గుట్టపై నుంచి వచ్చే నీరు సమీపంలోని బ్రాహ్మణకుంట వద్దకు చేరుతుంది. చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టి ఈ నీటి ఆధారంగానే సాగు చేస్తున్నారు. మిర్చి, మొక్కజొన్న, పత్తి పంటలను పండిస్తున్నారు.

**రికార్డులోనే లేదు**

ధర్మపురి మండలంలో 29 గ్రామాలుండగా ఆకుసాయిపల్లె నేటికీ పోలీసు రికార్డులోకి ఎక్కలేదు. మిగతా అన్ని గ్రామాల్లో వివిధ రకాల కేసులు నమోదయ్యాయి. ఈ పల్లెల్లో ప్రజలు సోదర భావంతో మెలుగుతున్నారు. ఈ గ్రామం సమష్టి జీవనానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. ఉదయ్ కుమార్, ఎస్సై, ధర్మపురి

**ఏళ్లతరబడి ఐకమత్యంగా**

గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరం స్పందించి అండగా నిలుస్తాం. ఎవరి ఇంట్లో వేడుక జరిగినా అందరం కలిసికట్టుగా జరుపుకుంటాం. గ్రామ అభివృద్ధికి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటాం. ఏళ్లుగా ఎటువంటి వివాదాలకు తావివ్వలేదు. ఇది మాకు గర్వకారణం. నూతన పంచాయతీ కావడంతో కొద్దిపాటి నిధులు మాత్రమే వచ్చాయి. వాటిని పొదుపుగా వాడుకుంటూ అందరి సహకారంతో అభివృద్ధికి పనులు చేపట్టాము. రమేష్, మాజీ సర్పంచి, ఆకుసాయిపల్లె

# ఆక్రమణలకు కోట

భువనగిరి : భువనగిరి కోట భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. నియంత్రించాల్సిన సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో కోట మూడు వైపులా నిర్మాణాల పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం కోట పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది. ఈ శాఖ అధికారుల స్థానికంగా ఉండకపోవడంతో కోట ఆస్తులపై పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 212లోని సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో కోట ఆవరించి ఉంది. దీనికి చెంతనే ఉన్న అమ్మకుంట పరిసరాల్లో మూడెకరాలు, ప్రధాన రహదారి ముఖ్యకూడలి సమీపంలో అర ఎకరం ప్రభుత్వ భూమి ఉంది. కోట భూములకు సర్వే నిర్వహించి గత కొన్నేళ్ల క్రితం మార్కింగ్ చేశారు. కోట పరిధి నుంచి వంద మీటర్ల పరిధిలోని నిషేధిత జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. గతంలో ఈ జోన్‌లో పూర్తయిన నిర్మాణాలకు పురావస్తుశాఖ అధికారులు సంబంధించిన వారికి నోటీసులు, మున్సిపల్ అధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి నేటికీ చర్యలు చేపట్టకపోవడంతో ఆక్రమణలు, అనుమతులు లేని నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కోట కొత్తబస్టాండ్‌తో పాటు హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి, పట్టణ ప్రధాన రహదారి వరకు ఆవరించి ఉంది. మరో వైపు అమ్మకుంట, పలు వెంచర్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో భూమి ఖరీదుగా మారింది. దీంతో కోటకు ఆనుకుని సొంత భూములు ఉన్న వారు కోట వరకు నిర్మాణాలు చేపట్టారు. ఇటీవలి కోట పరిధిలోని కోట గడ్డను తవ్వి మట్టిని తరలించినప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పురావస్తుశాఖ ఏడీ నాగలక్ష్మిని వివరణ కోరగా ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చామని, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశామని వివరణ ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితిపై తమ ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామని ఆమె తెలిపారు.

# గోదా'వరి'తో సాగు

సిద్దిపేట : యాసంగిలో చాలా మంది రైతులు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగావరి పంట వేశారు. ఈసారి సుమారు 3 లక్షల ఎకరాలకుపైగా సాగయ్యే అవకాశాలున్నట్లు అధికారుల అంచనా. ఇది మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతో కర్షకులు వరి వైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే వేసిన నాట్ల కొన్ని చోట్ల ఎండిపోతుండటంతో ప్రాజెక్టుల నుంచి సాగునీరు వదలాలని రైతులు డిమాండు చేస్తున్నారు. జిల్లాలో పలు చోట్ల ఇటీవల ఆందోళనలు సైతం చేపట్టారు. ఫిబ్రవరి రెండో వారం వరకు నాట్లు పూర్తి కానున్నాయి. సాగుకు గోదావరి జలాలు ఆదరువు కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల ప్రత్యక్ష ఆయకట్టుంది. చెరువులు, వాగులు, కుంటల్లోకి



నీరు చేరితేనే పంటలు గట్టెక్కనున్నాయి.

**నీటి పారుదల శాఖ మంత్రికి వినతి**

బోర్లు తట్టి పోస్తుండటం, చెరువు, కుంటలు, వాగుల్లో నీరు లేకపోవటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే గోదావరి జలాలు విడుదల చేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు. కర్షకుల పక్షాన ఇటీవలే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన అధికారులు మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ కాలువ ద్వారా కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేశారు. చెక్‌డ్యామ్‌లు నిండిన తర్వాత వారం అనంతరం నిలిపేస్తామని అధికారులు చెబుతున్నారు. గోదావరి జలాలు విడుదల చేయక వెలవెలబోతున్న హల్దీవాగు చెక్‌డ్యామ్

**రంగనాయక్ సాగర్ ఎడమ కాలువ ద్వారా..**

జనవరి 18న మంత్రి కొండా సురేఖ రంగనాయక సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కొనసాగుతోంది. కుడి కాలువకు విడుదల చేయాల్సి ఉంది. కొండపోచమ్మ సాగర్ నుంచి రామాయంపేట, జగదేవపూర్ కాలువ ద్వారా రోజుకు సుమారు 65 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హల్దీవాగు, గజ్వేల్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది. గతేడాది ఫిబ్రవరిలో అవసరమైన మేర గోదావరి నీటిని వదిలామని, ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని నీటి పారుదల శాఖ గజ్వేల్ ఈఈ మోతియా తెలిపారు.

ప్రస్తుత నీటి నిల్వ(టీఎంసీలలో)

అనంతగిరి 3.01

రంగనాయక సాగర్ 2.34

మల్లన్నసాగర్ 17.5

కొండపోచమ్మసాగర్ 9.1

# తుది పని.. జాప్యం ఎందుకని?

సంగారెడ్డి : పేదల వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. సర్కారు దవాఖానాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. నూతన భవనాల నిర్మాణాలకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేసింది. కొన్ని చోట్ల ఆయా నిర్మాణాలు తుది దశకు చేరుకున్నప్పటికీ.. కొద్దిపాటి పనులనూ పూర్తి చేయడం లేదు. గుత్తేదారులు అర్జీ పెట్టుకోవడం.. అధికారులు పనుల పూర్తికి గడువు పొడిగించడం సాధారణంగా మారింది.

**పటాన్‌చెరులో రూ.70 కోట్లతో..**

పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సూపర్ స్పెషాలిటీ దవాఖానా భవన నిర్మాణానికి గతేడాది రూ.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పరికరాల బిగింపునకు అదనంగా రూ.25 కోట్లు కేటాయించారు. పీసీబీ, ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన భవనాల పనులు చివరి దశకు చేరుకున్నాయి. రంగులు తదితర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.5 కోట్ల బిల్లుల బకాయిలు ఉండటంతో పనులు నిలిచిపోయాయి. ఏప్రిల్ వరకు ఆసుపత్రి భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

**రంగులు వేసి.. తలుపులు బిగించాలి**

సంగారెడ్డికి మూడేళ్ల క్రితం ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరయింది. ఇందులో భాగంగా జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఏడాదిన్నర క్రితం రూ.23.75 కోట్లలో 'క్రిటికల్ కేర్ యూనిట్' భవనం పనులు ప్రారంభించారు. 95 శాతం పనులు పూర్తిచేశారు. కలరింగ్, విద్యుత్తు కనెక్షన్లు, తలుపుల బిగింపు తదితర తుది పనులు మాత్రమే మిగిలి ఉండగా.. గుత్తేదారు జాప్యం చేస్తున్నారు.



**జహీరాబాద్‌లో మాతాశిశు ఆరోగ్య కేంద్రం..**

జహీరాబాద్‌లోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) భవన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది రూ.7.5 కోట్ల నిధులు విడుదల చేసింది. రెండంతస్తుల పనులు పూర్తయ్యాయి. రంగులు, ఇతర తుది పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.3 కోట్ల వరకు గుత్తేదారుకు బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటిని పనులన్నీ పూర్తి చేస్తామని అధికారులు వివరిస్తున్నారు.

**నర్సింగ్ విద్యార్థులకు 'అద్దె' కష్టాలు**

సంగారెడ్డి పట్టణం రామచంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, విద్యార్థులకు వసతి గృహాల కోసం 2022లో రూ.34 కోట్లు మంజూరయ్యాయి. జీప్లస్–2 భవనం కోసం స్లాబ్ వేశారు. బిల్లుల సమస్యతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. అద్దె భవనంలో నర్సింగ్ విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వేగవంతం చేశాం..: రవీందర్‌రెడ్డి, ఈఈ, టీఎస్ఎంఎస్ఐడీసీ

జిల్లాలో ఆసుపత్రుల భవనాలు, నర్సింగ్ కళాశాల, వసతి గృహాల భవనాల పనులు గతంతో పోల్చితే వేగవంతమయ్యాయి. బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మార్చి, ఏప్రిల్ నాటికి భవనాలను వినియోగంలోకి తేవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ దిశగా ముందుకు సాగుతున్నాం.

చురకలు



# ప్రయాణమంటే ప్రహసనమే!

ఉండి : ఉండిలో 165వ నంబరు జాతీయ రహదారిలో రైల్వే ఫ్లైఓవర్(ఆర్వోబీ) నిర్మాణ ప్రాంతంలో వాహనాల రద్దీ ఇది. ఇక్కడ తరచూ ఇదే పరిస్థితి. ఈ మార్గంలో రైల్వే గేటు పడితే ఎంత సేపటికి తెరుస్తారో తెలియని పరిస్థితి. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితేనే ట్రాఫిక్ కష్టాలకు విముక్తి లభిస్తుంది.

కృష్ణా జిల్లా పామర్రు– కాకినాడ జిల్లా కత్తిపూడి మధ్య 165 నంబరు జాతీయ రహదారి నాలుగు జిల్లాల మధ్య విస్తరించి ఉంది. ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే వాహనదారుల్లో అత్యధిక శాతం ఉండి మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం 22-23 వేలకు మించి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దాదాపు రెండున్నర దశాబ్దాల కిందట పీపీ (పాలకొల్లు – పామర్రు) మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించినా ఆ స్థాయిలో విస్తరణ పనులు చేపట్టలేదు. దీంతో ఆకివీడు, ఉండి, భీమవరం, విస్సాకోడేరు, పెన్నాడ, శృంగవృక్షం, వీరవాసరం, లంకలకోడేరు తదితర ప్రాంతాల్లో రోడ్డు



వెడల్పు తక్కువగా ఉండటంతో రద్దీ వేళ ప్రయాణం ప్రహసనంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు.

**దుంపగడప నుంచి దిగమర్రు వరకూ..!**

పశ్చిమగోదావరి జిల్లాలో దుంపగడప– దిగమర్రు మధ్య జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1,200 కోట్ల నిధులు కేటాయించింది. దుంపగడప, ఆకివీడు, అజ్జమూరు, చెరుకువాడ, పెదపుల్లేరు, జక్కరం, కోపల్లె, పెదఅమిరం, వేండ్ర, చినఅమిరం, రాయలం, భీమవరం, గునుపూడి, తాడేరు, గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం, వీరవాసరం, శివదేవునిచిక్కాల, బల్లిపాడు, దగ్గులూరు, లంకలకోడేరు, గోరింతాడ, ఆగర్రు, దిగమర్రు జంక్షన్ వరకూ పనులు చేపట్టనున్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు లైన్ల మార్పిడికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతూ లేఖ రాసినట్లు ఎన్‌హెచ్ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. భూసేకరణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.


**ఇదీ పరిస్థితి**

ఉండి, శృంగవృక్షంల్లో రైల్వే గేట్లు పడితే వాహన చోదకుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. గుడివాడ – భీమవరం మధ్య నిత్యం 20కి పైగా గూడ్సు రైళ్ల రాకపోకలు పెరగడమే దీనికి ప్రధాన కారణంగా కన్పిస్తోంది. ఉండిలో ఆర్వోబీ పనులు 60 శాతం పూర్తయిన తర్వాత రెండేళ్ల పాటు నిలిచిపోయాయి. కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఉపసభాపతి రఘు రామకృష్ణరాజు ప్రయత్నాలతో ఇటీవల మరోసారి పనులు ప్రారంభించారు.

# మిగిలింది వేదనే

పోలవరం : కొండవాగులు విరుచుకుపడి ఏటా కొవ్వాడ కాలువ కుడి, ఎడమ గట్లకు గండ్లు పడి పచ్చని చేలకు భారీ నష్టం జరిగేది. అప్పట్లో దుఃఖదాయినిగా పేరుగాంచిన కొవ్వాడ కాలువపై అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మించినా, అధికారుల వైఖరితో నేటికీ రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. 2007 అక్టోబర్‌లో పట్టిసీమ వద్ద చేపట్టిన అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మాణంలో భాగంగా కాలువ వెడల్పు పనుల నిమిత్తం 2009లో ప్రగడపల్లి, వెంకటాపురం, పట్టిసీమ, పోలవరం ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది రైతుల నుంచి 150 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సేకరించారు. వీరికి 2010లో రూ.5కోట్ల మేర నష్ట పరిహారం అందజేశారు. మిగిలిన భూమికి సబ్‌డివిజన్ చేయకపోవడంతో రుణాల కోసం బ్యాంకులు, సహకార సంఘాలకు వెళ్లిన రైతులకు చుక్కెదురవుతోంది. తమ సొంత భూములను కొవ్వాడ కాలువ కోసం సేకరించిన భూములుగా పేర్కొంటూ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు నిరాకరిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. మిగిలిన భూమికి సబ్‌డివిజన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని కోరుతున్నారు.

తనకున్న రెండెకరాల్లో కాలువ గట్టు కోసం 60సెంట్లు తీసుకున్నారని, మిగిలిన 1.40 ఎకరాలను కూడా కాలువ భూమిలోనే లెక్కేస్తున్నారని పట్టిసీమకు చెందిన రైతు ఎస్.నాగేశ్వరరావు ఆవేదన చెందుతున్నారు. తన భూమికి హక్కు కల్పించాలని రెవెన్యూ సదస్సుల్లో మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న నాథుడు లేడని కన్నీటి పర్యంతమ



య్యారు. కాలువ గట్టు కోసం తన 1.22 ఎకరాల్లో 62 సెంట్లు భూమిని ప్రభుత్వానికిస్తే మిగిలిన 60 సెంట్లను కూడా సబ్‌డివిజన్ చేయకుండా దస్త్రాల్లో ప్రభుత్వ భూమిగానే పేర్కొంటున్నారని పట్టిసీమకు చెందిన మరో రైతు ఎస్.సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి చెప్పుకోవాలో, ఏం చేయాలో దిక్కుతోచడం లేదని వాపోయారు.

**న్యాయం చేస్తాం**

రైతుల నుంచి సేకరించగా మిగిలిన భూమికి సబ్‌డివిజన్ చేశారని తహసీల్దారు సాయిరాజు అన్నారు. దానికి సంబంధించిన దస్త్రం రికార్డురూంలో లేకపోవడంతో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయానికి, కలెక్టర్ కార్యాలయంలోని సంబంధిత భూసేకరణ విభాగానికి నివేదించామన్నారు. కలెక్టర్ దృష్టికి విషయం తీసుకువెళ్లి రైతులకు తప్పక న్యాయం చేస్తామన్నారు.

# అక్రమంగా తవ్వుకో.. తరలించుకో!



తిరుపతి: రామచంద్రాపురం మండలంలో గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డే లేకుండాపోయింది. రోజూ పదుల కొద్దీ టిప్పర్లలో వందల ట్రిప్పుల మట్టిని తవ్వి తరలిస్తున్నారు. అధికారుల కళ్లెదుటే దందా జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇందులో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకుల హస్తం ఉండటం.. అధికారులకు వాటాలు అందుతున్నందునే చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. సి.రామాపురంలో గతేడాది వైకాపా పాలనలో కొండను కొల్లగొట్టి గ్రావెల్‌ను అమ్ముకున్నారు. అనంతరం భూమిని చదును చేసి ప్లాట్లు వేసి విక్రయాలు కూడా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంతకాలం అక్రమార్కులు మిన్నకుండి పోయారు. రెండు నెలల క్రితం తిరిగి యంత్రాలను రంగంలోకి దింపగా విమర్శలు రావడంతో వెనక్కు తగ్గారు. ఇప్పుడు మరోసారి తవ్వకాలు మొదలుపెట్టారు. మట్టిని అక్రమంగా రవాణా చేయడంతోపాటు ఆ ప్రాంతం చదును అయిన తర్వాత భూమిని అమ్మేందుకు అక్రమార్కులు సన్నద్ధమయ్యారు. ప్రస్తుతం అందులో బోరు కూడా వేయడం గమనార్హం.

**వాటాలు అందుతున్నాయా?**

రామచంద్రాపురం మండలంలో కొండలు, గుట్టలను పిండి చేస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలోనే జరుగుతున్నా రెవెన్యూ, గనుల శాఖ అధికారులు స్పందించకపోవడం అనుమానాలను రేకెత్తిస్తోంది. రోజూ పదుల టిప్పర్లలో 70– 80 ట్రక్కుల మట్టిని తిరుపతికి తరలిస్తున్నారు. పొక్లెయిన్లు, టిప్పర్లు సీజ్ చేయడంతోపాటు దందా చేస్తున్న వారికి జరిమానా విధిస్తే భయపడతారు. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పుడు మాత్రమే తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక యంత్రాంగానికి వాటాలు అందుతున్నందునే అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంలేదని ఆరోపణలున్నాయి.

**వైకాపా హయాంలోలాగే..**వైకాపా హయాంలో రామచంద్రాపురం మండలంలో కనిపించిన కొండలు, గుట్టలను కొల్లగొట్టి పట్టపగలే గ్రావెల్, మట్టిని దోచేశారు. అధికార యంత్రాంగం సైతం బహిరంగంగానే సహకరించింది. గ్రామస్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అక్రమార్కులకే వంత పాడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కూడా మండలంలో ఇదే తంతు కొనసాగుతోంది. ఇటువంటి వ్యవహారాలకు నేతలు దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నా చలనం లేకుండా పోయింది. ఇటీవల కాలంలో సత్రంమిట్ట, పిళ్లారి కోన, ఎల్‌వీ పురంలో తవ్వకాలు చేయగా తాజాగా సి.రామాపురంలో మొదలుపెట్టారు.

# ధాన్యం బేజారు.. బియ్యం హుషారు



సూళ్లూరుపేట : జిల్లాలో ధాన్యానికి గిట్టుబాటు ధర ఉండటం లేదు. అదే బియ్యం ధరలు మాత్రం ఆకాశానంటుతున్నాయి. గతేడాది బీపీటీ 5204 వరి వంగడం జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా వేశారు. అప్పట్లో పుట్టి ధర రూ.28 వేల వరకు పలికింది. దీనిని దృష్టిలో ఉంచుకుని పలువురు రైతులు వేల పుట్లు ధాన్యాన్ని గత ఏడాది నుంచే నిల్వ చేశారు. ప్రభుత్వ గోదాములు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు గోదాముల్లో దాచారు. అప్పట్లో రైతుబంధు సైతం లేకపోవడంతో అప్పులు తీసుకొచ్చి, నగనట్రా తాకట్టుపెట్టి గోదాములకు బాడుగలు చెల్లించి, నిల్వ చేశారు. గత ఆరు నెలలుగా బీపీటీ ధాన్యం ధరలు పెరగడం లేదు. నాలుగు నెలలుగా పాత ధ్యానం ధరలు క్షీణిస్తూ వస్తూ.. నేటికి రూ.18వేలు వరకు వచ్చింది. అసలు వీటిని అడిగేవారే లేరు. ఈ ఏడాది పండించిన పంట కూడా అలాగే పలుచోట్ల ఉంది. దాంతోపాటు కేఎన్ఎం 1638 రకం ధాన్యానికి గిట్టుబాటు ధర ఉండటం లేదు.

**ఆర్థిక అవసరాలకు తక్కువకు..**

అన్నదాతలకు ఆర్థిక అవసరాలకు ధాన్యాన్ని విక్రయించేందుకు రాగా దీనిని ఆసరాగా తీసుకుని మిల్లర్లు, దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పుట్టి ధాన్యం రూ.20వేలు చొప్పున అమ్మితే బియ్యం కిలో రూ.36 చొప్పున అందుబాటులోకి రావాలి. కూలీలు, రవాణా ఖర్చులు కలిపినా రూ.40 మించకపోవచ్చు. కానీ మార్కెట్‌లో కిలో బియ్యాన్ని రూ.65 చొప్పున విక్రయిస్తున్నారు. ఇందులోనూ మేలురకం ఉండటం లేదు. రేషన్ బియ్యం కలిపేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, పౌర సరఫరాల, మార్కెట్ శాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారు.

కొనుగోల కేంద్రాలు ఏర్పాటు..జిల్లాలోని 12 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. మిగిలిన ప్రాంతాల్లోనూ ప్రారంభిస్తాం. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.సుమతి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్

# గంగ కట్టమట్టి.. కొల్లగొట్టి



సత్యవేడు : అదును చూసి అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు.. ప్రకృతి వనరులు నాశనమవుతున్నా.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. సంపాదనే ధ్యేయంగా ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారు. వీరికి కొందరు అధికారులు అండగా నిలుస్తున్నారు.. దీనికి నిదర్శనమే తెలుగు గంగకట్ట మట్టి తరలింపు. సత్యవేడు మండల కేంద్రం ఉలవసేను పెట్రోల్ బంక్ వెనుక వైపు తెలుగు గంగ కాలువ గట్టు మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. తమిళనాడు సమీప గ్రామాల్లోని ఇటుక బట్టీలకు, ఇంటి అవసరాలకు రాత్రుల్లో భారీగా తరలిస్తున్నారు. భారీ యంత్రాల సాయంతో తవ్వకాలు చేపట్టారు. వారంలో 500 నుంచి 800 ట్రాక్టర్ల వరకు తరలిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**పొంచి ఉన్న ప్రమాదమిది..**

గట్టు మట్టి తరలిస్తే అడవి నుంచి వచ్చే వర్షపునీటితో పాటు వ్యర్థాలు, మట్టి తెలుగుగంగ కాలువలోకి చేరి నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. బాలురు గురుకుల పాఠశాల మైదానానికి సుమారు 40 ట్రిప్పుల అవసరమని తెలుగు గంగ డీఈని ప్రిన్సిపల్ కోరారు. ఇదే అదునుగా స్థానిక నేతలు బీసీ కాలనీ, ఉలవసేను, గాంధీపురం, ఎస్టీకాలనీ, తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన ఎన్ఎంకండ్రిగకు ఎర్రమట్టిని తరలించి రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు.

**ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు**

ఇప్పటి వరకు తెలుగు గంగ కాలువ గట్టు మట్టి తరలించేందుకు అనుమతులు లేవు. రాత్రి సమయాల్లో తరలించే వారిపై దృష్టి సారించి చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.
రాజశేఖర్, ఇన్‌ఛార్జి తహసీల్దార్

# పీఎం కిసాన్ సాయం దూరం

చిత్తూరు : కర్షకులకు పంటల సాగు పెట్టుబడి సాయంగా కేంద్ర ప్రభుత్వం ఏటా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రూ.6 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తోంది. 19వ విడత కింద రూ.106.53 కోట్లు 1.79 లక్షల మంది రైతుల ఖాతాలో జమ చేశారు. గతంతో పోల్చితే రైతుల సంఖ్య ఏటా తగ్గుతూ వస్తోంది. ఆరేళ్లయినా ఇప్పటి వరకు కొత్తగా నమోదు చేసుకున్న లబ్ధిదారులకు పథక సాయం అందలేదు.

**సాంకేతిక సమస్యలంటూ..**

జిల్లాలో వేల మంది అర్హులకు పీఎం కిసాన్ సాయం దక్కలేదు. కొందరు అకారణంగా పథకానికి దూరమవుతున్నారు. కొన్ని విడతలు జమ కావడం, కొన్నిసార్లు కాకపోవడం జరుగుతోంది. కారణమేమిటని అధికారులను అడితే.. సాంకేతిక సమస్యలంటూ సమాధానాలే తప్ప.. పరిష్కరించే వారు లేరని రైతులు వాపోతున్నారు.

**వేల మందికి నిరాశ**

ఈ పథకాన్ని కేంద్రం 2019లో ప్రారంభించింది. అప్పట్లో సాగు భూములున్న రైతులందరూ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈకేవైసీ చేయించుకోకపోవడం, మృతులు, ఆదాయపు పన్ను చెల్లించేవారు, బియ్యం కార్డులు లేనివారు తదితర కారణాలతో వేల సంఖ్యలో రైతులు ఈ పథకానికి దూరమయ్యారు.



2019 ఫిబ్రవరి 1వ తేదీకి ముందు పట్టాదారు పాసుపుస్తకం కలిగిన.. ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్, అడంగల్‌లో పేర్లు ఉన్న రైతులకే ఈ పథకం వర్తింపజేశారు. అప్పట్లో రెవెన్యూ సమస్యలతో పుస్తకాల్లేక.. కొత్తగా పుస్తకాలు పొందినప్పటికీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడంతో చాలా మందికి సాయం అందలేదు.ఒక కుటుంబంలో ఎంత మంది రైతులున్నా ఒక్కరికే లబ్ధి చేకూరుతుంది. ఆదాయపు పన్ను చెల్లించేవారు, ఆ కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులున్నా.. బియ్యం కార్డు లేకపోయినా అనర్హులవుతారు.

# పునరావాస పనుల ప్రారంభానికి సన్నాహాలు

జంగారెడ్డిగూడెం : పోలవరం పునరావాస గ్రామాల్లో అతి పెద్దదైన తాడువాయి వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైంది. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. వేలాది ఇళ్లతో పాటు రహదారులు, డ్రెయిన్లు వంటి మౌలిక వసతులు, సామాజిక భవనాలు నిర్మించలేదు. ఏలూరుతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నిర్వాసితులు ఇక్కడ పునరావాసం పొందనున్నారు.

**కూటమి రాకతో కదలిక**

కూటమి ప్రభుత్వం కాలనీలను సత్వరమే నిర్మించే సన్నాహాల్లో ఉంది. రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.45 కోట్లను గుత్తేదారులకు చెల్లించింది. పాత టెండర్లను రద్దు చేసింది. మిగిలినవి నిర్మాణాల కోసం కొత్త అంచనాలు వేసి త్వరలో టెండర్లు పిలవనున్నారు. ఇందు కోసం అంచనాలు సిద్ధమవుతున్నాయి. సుమారు రూ.300 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉంది.

పనుల తీరు ఇలా.. ఏలూరు జిల్లాలోని 41 గ్రామాల వారికి 3,905,



అల్లూరి జిల్లాలోని 14 గ్రామాల వారికి 620 ఇళ్లు నిర్మిస్తున్నారు. వీటిలో ఇప్పటికి 2,437 పూర్తయ్యాయి. 12 అసలు ప్రారంభం కాలేదు. మిగిలిన 1,456 వివిధ దశల్లో ఉన్నాయి. సీసీ రోడ్లు 57 కిలోమీటర్లకు 5, డ్రెయిన్లు 114కి 16 కిలోమీటర్లు మాత్రమే నిర్మించారు. సామాజిక భవనాలు 40 కట్టాలి. గృహ నిర్మాణ సంస్థతో పాటు ఏపీఈడబ్ల్యూఐడీసీ కూడా కొన్ని కడుతోంది. 7 మాత్రమే మొదలెట్టారు. కాలనీ పూర్తికాకున్నా సుమారు 500 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. వీరంతా చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. 'మార్చిలో టెండర్లు పిలిచి, ఏప్రిల్ నాటికి పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టాం. సిబ్బంది కొరతపైనా దృష్టి పెడతాం' అని గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి పీడీ జి.సత్యనారాయణ తెలిపారు.

# సరస్వతీ నిలయం.. కోరుతోంది లక్ష్మీ కటాక్షం!

ఒంగోలు: ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ)... పేరుకు వర్సిటీ అయినా తీరు మాత్రం డిగ్రీ కళాశాల మాదిరిగానే ఉంటుంది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో కనీస వసతులు లేక కునారిల్లుతున్న ఈ సరస్వతీ నిలయం... కూటమి ప్రభుత్వంలోనైనా లక్ష్మీ కటాక్షం లభిస్తుందని ఎదురుచూస్తోంది. త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర పద్దుపైనే ఆశలు పెట్టుకుంది.

**పేరు పెట్టి గాలికొదిలేశారు...**

సాధారణంగా విశ్వవిద్యాలయమంటే విశాల ప్రాంగణం... పచ్చని పరిసరాలు... నిలువెత్తు భవనాలు... అన్ని సౌకర్యాలతో విద్యార్థులకు బస... ఆటపాటలకు వీలుగా మైదానం... చదువుకునేందుకు గ్రంథాలయం, ప్రయోగశాలలు వంటివి గుర్తుకు వస్తాయి. 2022లో ఆవిర్భవించిన ఏకేయూలో మాత్రం మచ్చుకైనా ఈ తరహా వసతులు కానరావు. నేటికీ పీజీ కళాశాలలోనే కాలం వెళ్లదీస్తోంది. పేర్నమిట్ట కొండపై 109.80 ఎకరాలు కేటాయించినా... ఆ భూములన్నీ రాళ్లు రప్పలు, ముళ్ల పొదలతో దర్శనమిస్తున్నాయి. ఆంధ్ర కేసరి పేరు పెట్టి అట్టహాసంగా ప్రారంభించిన గత వైకాపా పాలకులు... విద్యార్థులను మాత్రం నేలబారు చదువులకు వదిలేశారు.

వర్సిటీలో పూర్తిస్థాయిలో వసతుల కల్పనకు రూ.203.15 కోట్లు... బోధన, బోధనేతర కార్యకలాపాల నిర్వహణకు 233 మంది సిబ్బంది అవసరం. ప్రస్తుతానికి... భవనాలు, ఫర్నిచర్ ఏర్పాటుకు రూ.122.75 కోట్లు, కార్యకలాపాల నిర్వహణకు 136 మంది సిబ్బంది అవసరమని వర్సిటీ అధికారులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ప్రస్తుతం ఏకేయూ 13 కోర్సులు నిర్వహిస్తోంది. వీటిలో 1,266 సీట్లు ఉండగా 330 మంది మాత్రమే చేరారు. కనీస వసతులు, బోధనా సిబ్బంది లేకపోవడంతో... జిల్లా విద్యార్థులు సైతం చేరేందుకు విముఖత చూపడమే ఈ దుస్థితికి కారణం.

**డీఎంఎఫ్ నిధులు...**

వర్సిటీ ఆరంభం తరువాత వీసీ, రిజిస్ట్రార్, ఫైనాన్స్ అధికారి (ఎఫ్‌వో)ని మాత్రమే ప్రభుత్వం నియమించించింది. వీరికి ఏటా బడ్జెట్ కింద రూ.రెండు కోట్లు కేటాయించాల్సి ఉండగా.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వేతనాల కింద రూ.1.09 కోట్లు మాత్రమే విడుదల చేశారు. మిగిలిన పోస్టుల్లో కొందరికి ఏఎన్‌యూ నుంచి వేతనం అందుతోంది. విద్యార్థుల ప్రవేశాలు, పరీక్షల నిర్వహణ ఫీజుల ద్వారా మరికొందరికి సర్దుబాటు చేస్తున్నారు. వర్సిటీ దుస్థితిపై గత ఏడాది పలు కథనాలు ప్రచురించడంతో... కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించి మహిళా వసతి గృహం ఏర్పాటుకు ఖనిజాభివృద్ధి సంస్థ నిధులు రూ.4.39 కోట్లు మంజూరు చేయించారు. ఇవి మినహా ప్రభుత్వం నుంచి పైసా విడుదల కాలేదు. వెనుకబడిన జిల్లాలో ఉన్న ఏకైక యూనివర్సిటీ అయినందున... అభివృద్ధి చేస్తే ఇక్కడి విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది.

# కరవుసీమలో జలసిరి

ఒంగోలు: కరవుకు చిరునామా ప్రకాశం. తూర్పున ఉప్పునీరు... పశ్చిమంలో రాతి నేలలు. వర్షపాతమూ అంతంతమాత్రమే కావడంతో అన్నదాతలకు నష్టాలు తప్పడం లేదు. వేసవిలో నీటి ఎద్దడి గురించి చెప్పనవసరం లేదు. ఈ సమస్య అధిగమించాలంటే వాన నీటిని ఒడిసి పట్టి... భూగర్భాన్ని నింపడం ఒక్కటే మార్గం. ఆ దిశగానే దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం... జిల్లాలో 6,380 సేద్యపు కుంటలు (ఫారం పాండ్) నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించింది.

**గతానికి భిన్నంగా నిర్మాణం...**గతంలో నిర్మించిన కుంటల్లోకి నీటితో పాటు ఇసుక చేరి మేట వేయడంతో త్వరగా పూడిపోయేవి. సమస్యను అధిగమించేందుకు ఈసారి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇసుక, వ్యర్థాలు గుంతలోకి రాకుండా... కుంటకు నీరు చేర్చే మార్గంలో సిల్ట్‌ట్రాప్ నిర్మిస్తున్నారు. తద్వారా నీరు మాత్రమే చేరుతుంది. కుంటల నిర్మాణంతో స్థలం వృథా అవుతోందన్న భావనతో కొందరు రైతులు వీటి ఏర్పాటుకు ముందుకురావడం లేదు. ఈ నేపథ్యంలో అదనపు ఆదాయం వచ్చేలా... గట్లపై కొబ్బరి, జామ వంటి మొక్కలు, తీగ జాతి కూరగాయల మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. కుంటలో చేపలు పెంచే ఆలోచనా చేస్తున్నారు.నాగులుప్పలపాడు మండలంలోని కనపర్తి... సముద్ర తీర గ్రామం. భూగర్భ జలాల్లో ఉప్పు శాతం ఎక్కువ కావడంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి ఉండదు. ఈ నేపథ్యంలో శివయ్య అనే రైతు... గతేడాది సెప్టెంబరులో తనకున్న ఎకరా పొలంలో ఉపాధి హామీ పథకం కింద సేద్యపు కుంట తవ్వించారు. ప్రస్తుతం అందులోని నీటి ఆధారంగా కూరగాయలు పండిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.అత్యంత దుర్భిక్షమైన ప్రాంతాల్లో యర్రగొండపాలెం మండలంలోని నర్సాయపాలెం ఒకటి.

చురకలు



## ‘లోడు’ తగ్గించి ‘లోటు’ పూడుస్తారు

నంద్యాల : “ నంద్యాలకు చెందిన గృహ విద్యుత్తు వినియోగదారుడు రామసుబ్బయ్యకు ప్రతినెలా రూ.600- 700 మధ్య బిల్లు వస్తుంది. వేసవిలో ఏసీ వాడకంతో లోడు పెరిగింది. దీంతో సాధారణ బిల్లుతో పాటు డెవలప్‌మెంట్ ఛార్జీతో అదనపు బిల్లు వస్తోంది. సమస్య పరిష్కరించి వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తోంది. క్రమబద్ధీకరించుకున్న వారికి అదనపు ఛార్జీల బెడద ఉండదని అధికారులు చెబుతున్నారు.”

**వినియోగం పెరిగిపోతోంది**

సాధారణంగా కనెక్షన్ ఇచ్చే సందర్భంలో కిలోవాట్ విద్యుత్తు వినియోగానికి గృహాలకు రూ.2 వేలు, దుకాణాలకు రూ.2,500 వసూలు చేస్తారు. చాలామంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి తమ వినియోగం 1 నుంచి 2 కిలోవాట్ లోపలే చూపిస్తారు. వినియోగంలో అంతకు రెట్టింపు క్యాటగిరీలో చేరిపోతున్నారు. వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన వినియోగమైతే చూపించిన దానికంటే ఏకంగా నాలుగింతలు ఉంటోంది.

**సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200**

ప్రతి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 నిర్ణయించారు. ఇదే సమయంలో డెవలప్‌మెంట్ ఛార్జీ రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. కిలోవాట్లు పెరిగే కొద్దీ ఈ రుసుము మారుతుంది. దరఖాస్తుల స్వీకరణ మార్చి 1న ప్రారంభమై జూన్ 30వ తేదీతో ముగుస్తుంది. కిలోవాట్ల చొప్పున డెవలప్‌మెంట్ ఛార్జీల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

**తీరనున్న లోవోల్టేజీ సమస్య**

గృహాలు, దుకాణాలకు విద్యుత్తు కనెక్షన్లు తీసుకునే సమయంలో దీపాలు, ఇతర గృహోపకరణాల వినియోగాన్ని సగటున అంచనా



వేసి లోడ్‌ను కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ ఛార్జీలు వేస్తారు. అధిక శాతం మంది గృహాలకైతే 1- 2 కిలోవాట్లు, దుకాణాలకు 2- 3 కిలోవాట్లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. పట్టణీకరణ, ఇంట్లో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికంటే అధికంగా విద్యుత్తు వినియోగం ఉంటోంది. వినియోగం అంచనాకు మించడంతో నియంత్రికలపై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడం, లోవోల్టేజీ సమస్యలు పెరిగిపోతున్నాయి.

**జరిమానా బెడద ఉండదు**

ఇప్పటి వరకు అధిక లోడు నియంత్రణలో భాగంగా విద్యుత్తు అధికారులు, సిబ్బంది తరచూ ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేసేవారు. అధిక లోడు వినియోగిస్తున్న వారిని గుర్తించి రుసుముతో పాటు జరిమానా వసూలు చేసే వారు. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలోని డీ1, డీ2, డీ3 ఉప విద్యుత్తు కేంద్రాల పరిధిలో సుమారు 2 లక్షల పైగా కనెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50 శాతానికి మించి కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కంటే అధికంగానే విద్యుత్తు వాడుతున్నారు. గత ఐదేళ్లుగా ప్రతినెలా ఉప కేంద్రం పరిధిలో తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగ్‌లు తనిఖీ చేసి అధిక లోడు వినియోగిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నారు. వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి అదనపు లోడును క్రమబద్ధీకరించుకుంటే ఈ అదనపు రుసుములు, జరిమానాల బెడద ఉండదని అధికారులు సూచిస్తున్నారు.

## పేదింటికెళ్లని అధికారులు

కర్నూలు: పేదలకు అండగా ఉండాలి.. ఆర్థికంగా తోడుగా నిలవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల-భాగస్వామ్యం(పీ4)తో పేదరిక నిర్మూలనకు నడుంబిగించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పది శాతం కుటుంబాల ఆర్థికస్థితిగతులు తెలుసుకోవాలని ఆదేశించింది. అయితే పేదల ఇళ్ల వద్దకు వెళ్లడానికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆసక్తి చూపడం లేదు. మార్చి 2వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాల్సి ఉంది. గత వారం రోజులుగా కర్నూలు జిల్లా 32.18 శాతంతో పదో స్థానంలో నిలవగా, నంద్యాల జిల్లా 40.43 శాతంతో నాలుగో స్థానంలో నిలిచింది. మరో నాలుగురోజుల్లో ఆరు లక్షల కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. పాలనాధికారులు, పుర



కమిషనర్లు, ఎంపీడీవోలు పర్యవేక్షించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

**కదలని సచివాలయ సిబ్బంది**

సర్వే చేయాల్సిన కుటుంబాల వివరాలను ఉన్నతాధికారులు జిల్లాలకు పంపించారు.. ఆయా కుటుంబాలను యాప్‌లో అనుసంధానం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆయా కుటుంబాల వద్దకు వెళ్లి వివరాలు సేకరించాలి. ఈనెల 20 నుంచి సర్వే ప్రారంభించారు.. మార్చి 2వ తేదీ నాటికి పూర్తి చేయాలి. విద్యుత్తు సౌకర్యం, సిలిండర్, సొంత కుళాయి, పక్కా గృహం, బ్యాంకు ఖాతాతో పాటు మరికొన్ని వివరాలు యాప్‌లో అప్లోడ్ చేయాలి.పీ4 సర్వేకు సచివాలయ సిబ్బంది కొందరు సహకరించడం లేదు. ఆరోగ్య కార్యకర్తలు, ఎనర్జీ అసిస్టెంట్లు, కొందరు వీఆర్వోలు, ఇంకొందరు విలేజ్ సర్వేయర్లు ఇందులో పాల్గొనడం లేదు. మంత్రాలయం, కౌతాళం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ ప్రారంభంచలేదు. చాలా మండలాల్లో సర్వే 40 శాతం దాటలేదు.

## కొన్ని మందులు కొనుగోలు చేయాల్సిందే!




అనంతపురం :అనంతపురానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి శ్రీధర్.. గుండె సంబంధ సమస్యపై సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలకు వచ్చి చూపించుకున్నారు. ప్రతి నెలా మందులు వాడాలని వైద్యులు రాసిచ్చారు. అవి అందుబాటులో లేకపోవటంతో రూ.5 వేలు వెచ్చించి ప్రైవేటు ఔషధ దుకాణంలో కొనుగోలు చేశారు.కదిరికి చెందిన తేజప్రకాశ్‌రెడ్డి అనే విద్యార్థి కిడ్నీ సమస్యతో వైద్యులను కలిసి చూపించుకున్నారు. పరీక్షించిన వైద్యులు మందులు రాశారు. అవి లేకపోవడంతో ప్రైవేటు దుకాణంలో రూ.1000 వెచ్చించి కొన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రభుత్వ సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలకు రోగులు వస్తుంటారు. ఇక్కడ మందుల కొరత ఉండటంతో రోగులకు ఆర్థిక భారం తప్పడం లేదు. కార్డియాలజి, న్యూరాలజి, నెఫ్రాలజి, న్యూరోసర్జరీ, యూరాలజి తదితర విభాగాలకు సంబంధించి ఉచితంగా సేవలు అందిస్తుండటంతో పెద్దఎత్తున సేవలు పొందేందుకు వస్తుంటారు. చికిత్సలు అందిస్తున్నప్పటికీ వారికి రాసిచ్చిన పలు ఔషధాల కొరత ఉండటంతో రూ.వేలు ఖర్చుపెట్టి ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కావడంతో చాలా మంది రెండు నుంచి మూడు పూటలా మందులు వాడాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఒక్కో రకం మాత్రలు ప్రతినెలా వాడాల్సి ఉంటుంది. మరోవైపు శస్త్రచికిత్సలు చేసేందుకు వినియోగించే గ్లౌజ్‌లు సైతం రెండు వారాల నుంచి లేకపోవటం గమనార్హం.

**అందుబాటులో లేనివి కొన్ని..**

గుండె సమస్యలకు సంబంధించి డాపావాస్, డైటర్‌ప్లస్, జీటీఎన్ కార్బిట్‌రేట్.

కిడ్నీ వ్యాధులకు అవసరమైన వెల్టాంప్లస్, ఆల్ఫా, కేసిట్ సిరప్, డయాలసిస్‌కు సంబంధించి సోడియం బైకార్బోనేట్-500ఎంజి, ఆల్ఫాకీటా అనాలాగ్.

మెదడు, వెన్నెముక, నరాల జబ్బులకు అసరమయ్యే టోల్‌పిరసన్-50ఎంజి, న్యూరోబియన్‌గోల్డ్, హరిస్టోజన్ సిరప్.

కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం..

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాలఏఏ విభాగాలకు సంబంధించినవి అందుబాటులో లేవో సంబంధిత హెచ్‌వోడీల నుంచి వివరాలు తెప్పించుకుంటాం. ఎక్కువ భాగం మందులను ప్రభుత్వం ఏపీఎంఎస్ఐడీసీ డ్రగ్స్ స్టోర్ ద్వారా సరఫరా చేస్తోంది. ప్రభుత్వం సరఫరా చేయని మందులను ఆర్డర్ ఇచ్చాం. అవసరమైన మందులను అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. గ్లౌజ్‌లను వెంటనే తెప్పిస్తాం.

## హంద్రీనీవా ఆధునికీకరణకు శ్రీకారం




అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావిస్తున్న ‘హంద్రీనీవా’ కాలువ ఆధునికీకరణ పనులకు అధికార యంత్రాంగం ఇటీవల శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి అన్ని ప్యాకేజీల పరిధిలో పనులు మొదలు కావడం విశేషం. క్షేత్రస్థాయిలో ఏకంగా 26 పొక్లెయిన్లతో యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయని హంద్రీనీవా ఎస్ఈ అన్నవరం రాజా స్వరూప్‌కుమార్ పేర్కొన్నారు. వచ్చే జూన్ 10వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. ఇదిలా ఉండగా.. హంద్రీనీవా ప్రాజెక్టు గత వైకాపా పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. మరోవైపు.. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా ఇచ్చిన హామీని ఎనిమిది మాసాలకే ఆచరణలో పెట్టడం ప్రస్తావనార్హం. గతేడాది డిసెంబరు 3న జీవో 404, 405 ద్వారా రూ.1,256.30 కోట్లు మంజూరు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. వెనువెంటనే టెండర్లు ఆహ్వానించారు. జనవరిలో టెండర్లు ఖరారు కావడం.. హంద్రీనీవా రెండో విడత ప్రధాన కాలువ, పుంగనూరు ఉప కాలువ(పీబీసీ) ఆధునికీకరణ(లైనింగ్) పనులను రూ.1202.94 కోట్ల అంచనాలతో మూడు ఏజెన్సీలకు అప్పగించారు. గుత్తేదారులు సైతం ఆగమేఘాలపై పనులు మొదలు పెట్టారు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు వినోద్‌కుమార్, చేతన్‌లు ఇప్పటికే హంద్రీనీవా అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పనులపై ఆరా తీశారు.

**పీబీసీకి రూ.266.24 కోట్లు**

రెండో విడత ప్రధాన కాలువే కాకుండా.. పుంగనూరు ఉప కాలువ (పీబీసీ) లైనింగ్ పనులు మొదలయ్యాయి. జీవో 404 ద్వారా రూ.319.60 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ద్వారా రూ.266.24 కోట్ల ఒప్పందానికే ఎస్ఆర్ కంపెనీకి పనులు అప్పగించారు. పది రోజుల క్రితమే ఇక్కడి పనులు ఆరంభం అయ్యాయి.

**2,520 క్యూసెక్కులే లక్ష్యం**

హంద్రీనీవా రెండో విడత ప్రధాన కాలువ జీడిపల్లి జలాశయం వద్ద 216 కి.మీ. నుంచి 400.500 కి.మీ. దాకా మొత్తం 184.200 కి.మీ. లైనింగ్ పనులు చేస్తారు. ఈ ప్రధాన కాలువ పరిధిలోనే ఐదు ప్యాకేజీలుగా విభజించి పనులు చేస్తున్నారు. మొత్తం రూ.936.70 కోట్ల అంచనాతో ఆర్‌వీఆర్, బీఎస్ఆర్ కంపెనీలు ఈ పనులు చేస్తున్నాయి. జీడిపల్లి జలాశయం నుంచి రెండో విడత కాలువకు 2,520 క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం కొనసాగేలా పనులు చేస్తారు. ప్రస్తుతం వెయ్యి క్యూసెక్కులకు మించి వెళ్లడం లేదు. ఉరవకొండ, రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ప్రాంతాల్లో ఈ ప్రధాన కాలువ వెళ్తుంది.

## గూడ్స్ రైళ్ల జంక్షన్‌గా పడమర గుంతకల్లు



గుంతకల్లు : గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని పడమర గుంతకల్లు రైల్వేస్టేషన్ గూడ్స్ రైళ్ల జంక్షన్‌గా మారబోతోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం కొత్తలైన్ల నిర్మాణానికి రూ.600 కోట్లు కేటాయించింది. ప్రయాణికుల రైళ్ల రాకపోకలకు గూడ్స్‌లు అవరోధం కాకుండా.. గుంతకల్లు జంక్షన్‌లోకి రాకుండా నేరుగా వెళ్లడానికి పడమరగుంతకల్లు రైల్వేస్టేషన్‌కు అనుసంధానం చేస్తూ ఇప్పుడున్న నాలుగు రైలు మార్గాలకు తోడు మరో రెండు లైన్లు నిర్మిస్తున్నారు. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఒకవైపు రైలు వంతెనలకు అవసరమైన సిమెంటు గిర్డర్ల తయారీ.. మరోవైపు లైన్లకు అవసరమైన భూ సేకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. పడమర గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో మొత్తం ఆరు రైలు మార్గాలు కలువనున్నాయి.

**ప్రయాణికుల రైళ్లకు వెసులుబాటు** గుంతకల్లు-బళ్లారి సెక్షన్‌లో పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో పడమర గుంతకల్లు రైల్వేస్టేషన్ ఉంది. గుంతకల్లు నుంచి రెండు, బళ్లారి వైపు నుంచి రెండు లైన్లు ప్రస్తుతం ఈ స్టేషన్ గుండా వెళుతున్నాయి. గుంతకల్లు-గుంటూరు రైలుమార్గంలో గుంతకల్లుకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లప్పగేటు స్టేషన్ నుంచి వివిధ రైలు మార్గాల మీదుగా రోడ్డుఓవర్‌రోడ్డు వంతెనతో కూడిన రైలుమార్గాన్ని అధికారులు పడమరగుంతకల్లు స్టేషన్‌లోకి నిర్మిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించింది. దీనివల్ల గూడ్సులు గుంతకల్లు జంక్షన్‌లోకి వెళ్లకుండా నేరుగా గుంటూరు, బళ్లారి వైపునకు వెళతాయి. ఇక గుంతకల్లు-ఆదోని రైలు మార్గంలో గుంతకల్లుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంచెర్ల స్టేషన్ నుంచి పడమర గుంతకల్లు స్టేషన్‌ను కలుపుతూ రూ.300 కోట్లతో బైపాస్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు లైన్లు ఏర్పాటైతే ప్రయాణికుల రైళ్లు సకాలంలో నడవడానికి వెసులుబాటు కలుగుతుంది. పడమర గుంతకల్లు స్టేషన్‌లో భవనాలతోపాటు యార్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు చెప్పారు. మల్లప్పగేటు స్టేషన్‌లో యార్డు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

## చెత్త ఆటోల లూటీ

ఆదోని : వైకాపా పాలకులు చెత్త సేకరణ పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసి ఆటోలు తెచ్చి, జనం నెత్తిన రుసుము బాదారు. ప్రజలు ఎంత వ్యతిరేకించినా మొండిగా వసూలు చేశారు. దీనివల్ల గుత్తేదారుకు మేలు చేయడమే తప్ప, ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ‘కూటమి’ ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆటోలకు సంబంధించి బకాయిలు చెల్లించాలని గుత్తేదారు ఒత్తిడి చేస్తున్నారు.. పుర పాలక సంఘాలన్నీ వైకాపా చేతిలో ఉండటంతో వారు గుత్తేదారుకు వంత పాడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో ఇంటింటి చెత్త సేకరణ పేరుతో రూ.16.20 కోట్ల మేర ప్రజల నుంచి పన్ను వసూలు చేశారు. కర్నూలులో రూ.10 కోట్లు, నంద్యాలలో రూ.3 కోట్లు, ఆదోనిలో రూ.2 కోట్లు, ఎమ్మిగనూరులో రూ.1.20 కోట్లు వసూలు చేశారు. ఒక్కో వార్డుకు ఆటో కేటాయించారు. చెత్త పన్ను వసూలు కాకపోవడం, గుత్తేదారుకు ఆటో అద్దెలు చెల్లించలేకపోవడంతో పురపాలికలు మెల్లిగా



ఆటోల సంఖ్యను కుదిస్తూ వచ్చాయి.

చివరికి అద్దె బకాయి లోటును పురపాలికలకు సాధారణ నిధుల నుంచి భరించేలా నాటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. నెలవారీగా వసూలయ్యే చెత్త పన్నులో గుత్తేదారు లాభం తీసేయగా.. మిగిలిన మొత్తం బ్యాంకు రుణాలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. గుత్తేదారుకు నష్టం జరగకుండా వైకాపా పాలకులు ప్రణాళిక చేయడం గమనార్హం.

కర్నూలు నగర పాలక సంస్థలో 91 ఆటోలకుగాను 51 మాత్రమే తిరుగుతున్నాయి. మిగిలిన ఆటోలు ఆర్థిక సమస్యలతో ఆగిపోయాయి. నంద్యాలలో 36 ఆటోలను సంబంధిత ఏజెన్సీవారు వెనక్కు తీసుకెళ్లారు. ఆదోనిలో 36, ఎమ్మిగనూరులో 16 ఆటోలను పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో నిలిపివేశారు.

ఆటోల సంఖ్య : 200

నెలకు ఆటో అద్దె : రూ.69వేలు

నెలకు అద్దె భారం : రూ.1.38కోట్లు

ఇప్పటి వరకు వసూలు చేసిన పన్ను : రూ.16.20కోట్లు

## రండి.. వినియోగించుకోండి

చిత్తూరు : గృహాలకు విద్యుత్తు కనెక్షన్ తీసుకునే సమయంలోనే లైట్లు, ఇతర గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ ఛార్జీలు వసూలు చేస్తారు.. అధిక శాతం మంది దరఖాస్తులో రెండు, మూడు కిలోవాట్లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు.. ఈ లెక్క ప్రకారమే ఆ ప్రాంతంలో నియంత్రికలు ఏర్పాటు చేస్తారు. దీంతో నియంత్రికలపై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతో పాటు లోఓల్టేజీ సమస్యలు నెలకొంటున్నాయి.

**1 నుంచి దరఖాస్తుల స్వీకరణ..**

గతంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఎక్కువ లోడు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే రుసుములతో పాటు జరిమానా వసూలు చేసేవారు. వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకొస్తే కేవలం రుసుములు మాత్రమే తీసుకునేవారు. చాలామంది అదనపు లోడును క్రమబద్ధీకరించుకోలేదు. ఈ నేపథ్యంలో డెవలప్‌మెంట్ ఛార్జీల్లో 50 శాతం రాయితీ



ఇవ్వాలని ఏపీఈఆర్‌సీ సూచించింది. దీనికి మార్చి ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కిలోవాట్ల లెక్కన డెవలప్‌మెంట్ ఛార్జీల్లో 50శాతం రాయితీ వర్తిస్తుంది.

**జూన్ 30 వరకు గడువు**

ప్రతి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్‌మెంట్ ఛార్జీగా రూ.1500 నిర్ణయించారు. కిలోవాట్లు పెరిగే కొదీ రుసుములు మారుతుంటాయి. జూన్ 30వ తేదీ వరకు గడువు ఉంది. ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

## ఎన్నాళ్లీ..వేతన యాతన


తిరుపతి : తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో పనిచేస్తున్న సిబ్బంది ఎనిమిది నెలలుగా వేతనాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సముదాయంలో సీనియర్ సహాయకుడు మినహా పరిపాలనాధికారి సహా 11 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే. వీరితోపాటు వాచ్‌మెన్లు, స్వీపర్లు, సూపర్‌వైజర్, ఒక శిక్షకుడు మొత్తం తొమ్మిది మంది పే అండ్ ప్లే విభాగంలో ఉన్నారు. వీరి వేతనాలు సముదాయానికి చేకూరే ఆదాయం నుంచే కలెక్టర్ ద్వారా అందేవి. తర్వాత నగరపాలిక కమిషనర్ ద్వారా చెల్లించేవారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సముదాయాలను ప్రైవేటీకరించడంతో పే అండ్ ప్లే నిధులు నేరుగా శాప్ ఖాతాలో జమచేసి.. కలెక్టర్‌కు బిల్లులు నివేదించి తద్వారా వేతనాలు పొందేవారు.

**కాలయాపన ఇలా..**

పే అండ్ ప్లే విధానంలో 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రస్తుత శాప్ ఎండీ గిరీశా ఆప్కాస్‌లో చేర్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆప్కాస్‌లో చేరుస్తామంటూ ఐదారు నెలలు కాలయాపన చేశారు. తీరా ప్రతిపాదన పూర్తిదశకు చేరుకొని నివేదిక ప్రభుత్వానికి చేరేలోగా ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగ భద్రతతోపాటు వేతనాన్ని సత్వరం అందించాలని సిబ్బంది కోరుతున్నారు.

# ఇక్కడ పేరు.. అక్కడ చదువు

పాడేరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి కొన్నిచోట్ల ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. పిల్లల పేర్లు మాత్రమే తమ పాఠశాలల్లో చూపిస్తున్నారు.. వారి చదువులు మాత్రం ప్రైవేటు పాఠశాలల్లో సాగించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. నర్సీపట్నం మండలంలో కేబీపాలెం, నగరం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సంధ్య, సూర్యప్రకాశ్‌ల పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు పంపించి ప్రభుత్వ పాఠశాలల్లో చూపించడంతో వారిద్దరిపై వేటు వేశారు. చోడవరం మండలంలోనూ కొంతమంది ఉపాధ్యాయులు ఈ తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి చర్యలకు సిద్ధం చేస్తున్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)తో గురువుల లీలలు బయటపడుతున్నాయి. వాటిపై ప్రాథమిక విచారణ చేపట్టి ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఈ తరహా అక్రమాలు చాలానే జరిగినట్లు గుర్తించినా ఆ వివరాలు బయటకు




రాకుండా విద్యాశాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. గతేడాది మొదలుపెట్టిన అపార్ నమోదు ఇప్పటికీ పూర్తికాకపోవడానికి విద్యార్థుల లెక్కలు తేలకపోవడం కూడా ఓ కారణమని సంబంధిత అధికారులే చెబుతున్నారు.

**ప్రవేశాల్లో మాయాజాలం..** విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ఆయా పాఠశాలల్లో పోస్టులు కోతపెడతారని కొంతమంది ఉపాధ్యాయులు ప్రవేశాలను (అడ్మిషన్లు) రికార్డుల్లోనే చూపిస్తున్నారు. వారు బడికి రాకపోయినా హాజరుపట్టీలో మాత్రం వచ్చినట్లే టిక్ పెట్టేటస్తున్నారు. నవోదయ, సైనిక్ పాఠశాలలు, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకే ఎక్కువ అవకాశం కల్పిస్తుంటారు. దీనికోసం ప్రైవేటు స్కూల్ పిల్లలను కొన్నిచోట్ల సర్కారీ బడుల్లో చదువుతున్నట్లు చూపిస్తున్నారు. అల్లూరి జిల్లాలో మొత్తం 1,97,049 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,55,809 మంది వివరాలు అపార్‌లో నమోదు చేశారు. ఇంకా 41,418 మంది పెండింగ్‌లో ఉన్నారు.

**మిగతా వారిపై దృష్టి..** ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి జూనియర్ కళాశాల విద్యార్థుల వరకు 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' ఐడీ పేరిట అపార్ నమోదు చేయిస్తోంది. ఒక విద్యార్థి అడ్మిషన్ ఒకే చోట ఉండాలి.. రెండు మూడుచోట్ల చూపడానికి వీల్లేదు. ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి అపార్ నమోదులో అనధికార విద్యార్థులు వెలుగులోకి వస్తున్నారు. ఈ విషయమై డీఈవో అప్పారావునాయుడు వద్ద ప్రస్తావించగా పరీక్షలు దగ్గర పడడంతో అపార్ నమోదుపై ఒత్తిడి తగ్గించారని, అందుకే ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. అనధికార విద్యార్థుల వివరాలు కొన్నిచోట్ల వెలుగు చూడగా ఇద్దరిపై చర్యలు తీసుకున్నామని మిగతా వారిపైనా దృష్టిసారించినట్లు చెప్పారు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చేందుకు యత్నించగా ఉపాధ్యాయులు అందుబాటులో లేరని ఎంఈవో తలుపులు చెప్పారు.

# పల్లె పయనం.. ఇక పదిలం

నంద్యాల : కొన్నేళ్లుగా నిర్వహణ, మరమ్మతులు కరవై దారుణంగా దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు మోక్షం కలుగనుంది. ఇటీవల ఆర్అండ్‌బీ రహదారులపై గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులపై దృష్టిపెట్టింది. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఈ రహదారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొత్త రహదారులు వేయకపోగా.. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో చాలా గ్రామాల పరిధిలో రోడ్లు రూపు కోల్పోయాయి. త్వరలో నిధులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంబంధిత శాఖ అధికారులను ప్రతిపాదనలు పంపాలని ఇటీవల ఆదేశించింది.

**ఐదేళ్లు పట్టించుకోలేదు** జిల్లా పంచాయతీరాజ్‌లో రెండు విభాగాలు ఉన్నాయి. పీఐయూ నుంచి 49 రోడ్లకు ప్రతిపాదనలు పంపారు. 183.01 కి.మీల పొడవున మరమ్మతులకు రూ.68.56 కోట్లతో ప్రతిపాదించారు. పీఆర్ డివిజన్ నుంచి 47 రోడ్లకు 184.94 కి.మీల పొడవున మరమ్మతులు చేసేందుకు రూ.83.06 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇవన్నీ బాగా దెబ్బతిన్న బీటీ రోడ్లే. వీటిని గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించారు. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లేకపోవడంతో ఛిద్రమయ్యాయి. కొన్ని రహదారు లపై పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. మరికొన్ని రహదారులపై తారు కొట్టుకుపోయి కంకర రాళ్లు దర్శనమిస్తున్నాయి. పంట పొలాల మధ్య వేసిన రహదారులు కోతకు గురవడంతో వీటిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

**ఎట్టకేలకు వీటికి మోక్షం**

పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలంలో ఎనిమిది చోట్ల రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి నంద్యాల- నందికొట్కూరు రోడ్డు నుంచి భోగేశ్వరం రహదారి వరకు 4.17 కి.మీల పొడవున దారి దారుణంగా ఉంది. గని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పైభోగుల రోడ్డు, ఎన్ఎన్ రోడ్డు నుంచి- బిలకలగూడూరు వరకు దారి ఛిద్రమైంది. 6.9 కి.మీ ఉన్న చిందుకూరు- పరమటూరు రోడ్డు కూడా అధ్వానంగా మారింది. మంచాలకట్ట- ఎల్‌కే తండా రహదారి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండలంలో ఈర్నపాడు- మణికంఠాపురం మధ్య 4 కి.మీ, మణికంఠాపురం- ఓంకారం మధ్య 3.3 కి.మీ, బండిఆత్మకూరు- ఈర్నపాడు మధ్య 11 కి.మీల పొడవున్న రోడ్లను బాగు చేయాలని ప్రతిపాదించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం మహదేవపురం నుంచి కె.కొత్తూరు వరకు 2.58 కి.మీలు, బాచపల్లి నుంచి అహోబిలం వరకు 9 కి.మీల ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు రానున్నాయి.

నంద్యాల మండలంలోని పోలూరు- రాయమాల్పురం, అయ్యలూరు- మసీదుపురం, గోస్పాడు మండలం జిల్లెల్ల- పసురపాడు రోడ్డును మరమ్మతులు చేయనున్నారు.

# పట్టురైతులకు లభించని ప్రోత్సాహకం



హిందూపురం : బైవోల్టిన్ పట్టు రైతులు, రీలర్లకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక మొత్తం చేతికి అందడం లేదు. దీనిపై ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు, రీలర్లు ఎన్నిదఫాలు వినతులు ఇచ్చినా, ప్రదక్షిణ చేసినా.. ప్రయోజనం చేకూరడం లేదు. దీనివల్ల అటు రైతులు, ఇటు రీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌సెంటీవ్ మొత్తాన్ని ప్రభుత్వం అందించకపోవడంతో ధరలు గిట్టుబాటు కావడం లేదని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు కర్ణాటకలో ఇక్కడి ధరల కన్నా కొంత అధికంగా ఉండటంతో అక్కడికే సింహభాగం గూళ్లు తరలిస్తున్నారు. దీనివల్ల హిందూపురంలో ఉన్న 180 మంది రీలర్లకు సరిపడా గూళ్లు స్థానిక మార్కెట్లో లభించక మహారాష్ట్రకు వెళ్లి తెచ్చుకుని సిల్క్‌దారం తీస్తున్నారు. ప్రభుత్వం తమకు సిల్క్‌దారంపై ఇచ్చే ఇన్‌సెంటీవ్ సత్వరమే అందించాలని రీలర్లు కోరుతున్నారు.

**కొండలా పెరుగుతున్న బకాయిలు**

2019 నుంచి వైకాపా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు బైవోల్టిన్ రైతులకు అందించాల్సిన ప్రోత్సాహ మొత్తం, అన్ని రకాల రాయితీలు కొండలా పెరుగుతున్నాయి. రైతులకు రూ.70 కోట్లు, రీలర్లకు రూ.7 కోట్లు ప్రోత్సాహక, రాయితీ బకాయిలు అందాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ బకాయిలో కొంత మొత్తం ఓటాన్ అకౌంట్ కింద మంజూరు చేసిందని, ఈ మొత్తం రైతులు, రీలర్ల ఖాతాలోకి జమ చేస్తారని ఆశాఖ అధికారులు అంటున్నా ఇప్పటివరకు ఎలాంటి మొత్తం అందక వారు నిరాశ నిస్పృహకు లోనవుతున్నారు.

**ఇన్‌సెంటీవ్ ఇవ్వకపోతే అక్కడే విక్రయిస్తాం : బసవరాజ్, దాసేగౌడనహళ్లి, అగళి మండలం**

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరలు గిట్టుబాటు కావడం లేదు. అందువల్ల కర్ణాటకలోని రామ్‌నగర్, శిద్దలఘట్టకు గూళ్లు తీసుకెళ్లి విక్రయించుకొంటాం. ఇక్కడి ధర కన్నా అక్కడ కొంత అధికంగా ఉన్నందున రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. అందువల్ల ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.

**రీలర్లు నష్టపోతున్నారు : ముస్తఫా, పట్టురీలర్ల సంఘం కార్యదర్శి, హిందూపురం**

రీలర్లకు సిల్క్‌దారంపై ప్రభుత్వం అందించే ప్రోత్సాహక మొత్తం అందక అధిక ధరకు గూళ్లు కొని రీలర్లు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇన్‌సెంటీవ్ అందిస్తే కొంత అధిక ధరకు గూళ్లు కొనుగోలు చేయవచ్చు. పట్టురైతులు, రీలర్లకు అందాల్సిన బకాయిల విషయం ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లాము.

**రైతుల ఖాతాలోకి డబ్బు జమ చేస్తాం : సురేశ్, పట్టుపరిశ్రమ సహాయ సంచాలకుడు, హిందూపురం**

2024 ఏప్రిల్ నుంచి జనవరి వరకు రూ.1.97 కోట్లను ప్రభుత్వం ఓట్ ఆన్‌అకౌంట్ కింద రైతులకు ప్రోత్సాహక మొత్తం మంజూరు చేసింది. దీనికి మేము 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు బిల్లులు అందించాము. సిల్క్ ఇన్‌సెంటీవ్ కింద రీలర్లకు నాలుగు క్వార్టర్స్ మొత్తం రూ.76 లక్షలు మంజూరైంది. 2024 ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు ఈ మొత్తం సరిపోవడంతో దీనికి సంబంధించిన బిల్లులు ట్రెజరీ ద్వారా స్మీఎఫ్ఎస్‌కు పంపాం. ప్రభుత్వం నుంచి నేరుగా మార్చిలోపు ఈ నిధులు రైతుల ఖాతాలోకి జమ అవుతాయి.

# కబ్జాలపై కన్నెత్తి చూడరా!



అనంతపురం : గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. పేదలకు పంచాల్సిన భూములను సైతం స్థానిక నాయకులు కాజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైకాపా నాయకులు కబ్జా చేసిన భూముల్ని స్వాధీనం చేసుకుంటారని అంతా భావించారు. అయితే 8 నెలలు కావొస్తున్నా.. ఎలాంటి కదలిక కనిపించడం లేదు. చర్యల మాట దేవుడెరుగు కనీస విచారణకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధర్మవరం మండలం రేగాటిపల్లిలో వైకాపా సర్పంచి సురేశ్‌రెడ్డి అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అండతో సుమారు 28 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేశారు. పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించడంతో పాటు అర్హత లేకపోయినా కుటుంబ సభ్యుల పేరుతో సాగుపట్టాలు పొందారు. దీనిపై స్థానిక తెదేపా నాయకులు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

**కబ్జా చేసి.. కంచె వేసి..**

రేగాటిపల్లి పరిధిలోని 227 సర్వే నెంబరులోని భూమిని 2009లో ఇళ్ల పట్టాల కోసం ప్రభుత్వం తీసుకుంది. అదే లేఅవుట్‌లో గుడి, బడి, మసీదు నిర్మాణాల కోసం భూమి కేటాయించారు. ఇదే లేఅవుటులో గతంలో తెదేపా ప్రభుత్వం 13 ఎకరాలను బీసీ రెసిడెన్షియల్ పాఠశాలకు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్పంచి సురేశ్‌రెడ్డి ఆ 13 ఎకరాలను ఆక్రమించి చుట్టూ కంచె వేశాడు. అందులో ప్రస్తుతం చీనీ తోట సాగు చేస్తున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా భార్య సోదరుల పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించారు. సర్పంచి ఆక్రమించిన 13 ఎకరాల భూమి విలువ సుమారు రూ.15 కోట్లు ఉంటుంది. సర్పంచి సురేశ్‌రెడ్డి భూకబ్జా బహిరంగమే అయినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికీ సురేశ్‌రెడ్డి ఆ భూమిలో పంటలు సాగుచేస్తూనే ఉన్నారు.

**సాగుపట్టాల పేరుతో 15 ఎకరాలు**

పేదలు అనధికారికంగా సాగుచేసుకుంటున్న భూములకు సాగుపట్టాలు అందించాలని గత వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని అడ్డుపెట్టుకుని సర్పంచి సురేశ్‌రెడ్డి కుటుంబ సభ్యుల పేరుతో పట్టాలు రూపొందించి 15 ఎకరాలు కాజేశాడు. ఆశావర్కర్‌గా పనిచేస్తున్న సురేశ్‌రెడ్డి సోదరి పేరుతో 2 ఎకరాలు సాగుపట్టా ఇచ్చారు. సురేశ్‌రెడ్డి సోదరుడి కుమారుడు సూర్యప్రతాప్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. అతని కుటుంబానికి ఇదేవరకే భూమి ఉంది. అయినా సర్వే నెంబరు 470లో 5 ఎకరాల భూమికి సాగుపట్టా అందించారు. తల్లి లీలావతి పేరుతో సర్వే నెంబరు 422లో మరో 4 ఎకరాలు, సోదరుడు కొండారెడ్డికి 4.65 ఎకరాలు కట్టబెట్టారు. బహిరంగ మార్కెట్టులో ఇక్కడి భూముల విలువ ప్రస్తుతం రూ.కోట్లలో ఉంది. సర్పంచి సురేశ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పంపిణీ చేసిన సాగుపట్టాలను రద్దుచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అనర్హులుగా తేలితే పట్టాలు రద్దు చేస్తాం : మహేశ్, ఆర్డీవో, ధర్మవరం**

పాఠశాలకు కేటాయించిన భూమి కబ్జాకు గురైనట్లు నా దృష్టికి రాలేదు. వెంటనే క్షేత్రస్థాయిలో విచారించి ఆక్రమణలు ఉంటే తొలగిస్తాం. అలాగే రేగాటిపల్లి పరిధిలో పంపిణీ చేసిన సాగుపట్టాలపై విచారణ జరిపి అందులో అనర్హులు ఉంటే వాటిని రద్దు చేస్తాం.

# ఇబ్బందులు చూడండయ్యా!




అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద ప్రజలకు ఆరోగ్య సమస్య తలెత్తితే మొదట గుర్తొచ్చేది అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాల్టీ వైద్యశాలలు. ఇవి పేరుకు పెద్దాసుపత్రులైనా రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం 16 నెలలుగా నిర్వహించలేదు. పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. గురువారం సాయంత్రం 3 గంటలకు అనంతపురం సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన హెచ్‌డీఎస్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉప ఛైర్మన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సభ్యులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతోపాటు అధికారులు పాల్గొననున్నారు.

**ఎన్నో వ్యయ ప్రయాసలు..** సర్వజన వైద్యశాలలో క్యాజువాల్టీకి రోజువారి సగటున 300 వరకు రోగులు వస్తున్నారు. పడకలు 20 మాత్రమే ఉన్నాయి. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురిని ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. క్యాజువాల్టీలో పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాల్లో పడకల సంఖ్య పెంచాల్సి ఉంది. పార్కింగ్ లేకపోవటంతో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి ఉంచటంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకునేందుకు ఎక్కడా చోటు లేకపోవటంతో ఆవరణలో ఇబ్బంది పడుతూ పడుకుంటున్నారు. రక్తపరీక్షలు వివిధ గదుల్లో నిర్వహిస్తుండటంతో రోగులు నమూనాలు ఇచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని రక్తపరీక్షలు ఒకేచోట నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ రిపోర్టులు ఏ రోజుకు ఆరోజే ఇచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో ఇప్పటివరకు మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో వైద్యులు లేకపోవటంతో ప్రారంభించలేదు. ఎండోక్రైనాలజీ విభాగం ఉన్నప్పటికీ ఐపీ సేవలు అందించడం లేదు. కార్డియాలజీ విభాగంలో స్టంట్లు వేస్తున్నప్పటికీ కొరత ఉంది. బైపాస్ సర్జరీలు చేసేందుకు వైద్యులున్నప్పటికీ అవసరమైన సామగ్రి లేక పెద్ద ఆపరేషన్లు చేయటం లేదు. యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ వైద్యులు రాసే మందులు అందుబాటులో ఉండకపోవటంతో రోగులు ప్రైవేట్ మందుల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో ఎంఆర్ఐ లేకపోవటంతో సర్వజన వైద్యశాలకు రోగులు వ్యయ ప్రయాసల కోర్చి వెళ్లాల్సి వస్తోంది. రక్తనిధి కేంద్రం అందుబాటులో లేదు.

# కంది రైతు కంట నీరు

కర్నూలు : మార్క్‌ఫెడ్ నిబంధనలతో రైతులు 'కంది'పోతున్నారు.. కల్లాల్లో పంట అమ్ముడుపోగా కన్నీరు కారుస్తున్నారు.. పప్పు ధాన్యాలకు ధర బాగుంటుంది సాగు చేయమన్నారు.. తీరా పంట చేతికొచ్చిన తర్వాత కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాఫెడ్ నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా గతేడాది డిసెంబరు నుంచి మద్దతు ధర రూ.7,550కు కందులను కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించారు. ఓ వైపు కొనుగోలు కేంద్రాల్లేక మరో వైపు నిబంధనల కత్తి విధించడంతో రైతులు తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. క్వింటా రూ.7,200- రూ.7,300 వరకు చెల్లించి కొనుగోలు చేసిన సరకును గోదాముల్లో నిల్వ చేస్తున్నారు.

**ఏడిపిస్తున్న 8 నిబంధనలు**

నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి మార్క్‌ఫెడ్ 8 రకాల నిబంధనలు విధించింది. నవంబరు, డిసెంబరు నెలల్లో వరుస తుపాన్లు, ఆ తర్వాత చిరు జల్లులు కురిశాయి.. ఫలితంగా పంట బాగా దెబ్బతింది. దీంతో కందుల్లో నాణ్యత తగ్గింది. నాణ్యమైన పంటనే కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు కొర్రీలు పెట్టడంపై రైతులు ఆగ్రహ వ్యక్తం



చేస్తున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 7 నుంచి 28 వరకు 65,779 క్వింటాళ్ల కందుల క్రయవిక్రయాలు జరిగాయి. క్వింటాకు మధ్యస్థ ధర రూ.6,689 నుంచి రూ.7,249 దక్కింది. ఏ ఒక్క రోజూ మధ్యస్థ ధర రూ.7,550 లభించలేదు.

రోజువారీ ఏదో ఒకటి, రెండు లాట్లకు గరిష్ఠ ధర రూ.7,800, రూ.7,900, రూ.8001 వ్యాపారులు రాస్తున్నారే తప్ప వాస్తవానికి మధ్యస్థ ధర రూ.7,250 రాని పరిస్థితి నెలకొంది.

నాఫెడ్ నుంచి మార్క్‌ఫెడ్ వారు కందుల కొనుగోలు చేస్తున్నామని ప్రకటన జారీ చేసిన నాటి నుంచి కందుల ధరలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

**కొన్నది కొసరంత**

రైతులంతా వ్యాపారులకు విక్రయించిన తర్వాత ఆసల్యంగా మేల్కొన్న అధికారులు ఈ నెల 22 నుంచి కొనుగోలు చేస్తున్నామని ప్రకటించింది. మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్‌లు, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 53 మండలాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసింది. నంద్యాలలో రెండు, కర్నూలు జిల్లాలో మూడు మండలాల్లో కలిపి వారం రోజుల్లో 182 మంది రైతుల నుంచి రూ.1.53 కోట్ల విలువైన 295 టన్నులు కొన్నారు. ఏ ఒక్క రైతుకు ఇప్పటి వరకు నగదు జమ చేయలేదు.


కర్నూలులో పండించిన పంటలో 25 శాతం మేర మొదట 16,750 టన్నుల కొనుగోలు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 9,000 టన్నుల మేర కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

# ఈరన్నకు కుంభాభిషేకం

కౌతాళం : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి ఆలయం కుంభాభిషేకోత్సవానికి సిద్ధమైంది. ఆలయంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయ రాజగోపురాల ప్రారంభం, కలశ స్థాపన, లక్ష్మి, గణపతి, నవగ్రహ, ధ్వజస్తంభం, యాగశాల, మంటపాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన, సప్తనదీజలాలతో కుంభాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తజనం ఎలాంటి ఇబ్బందులు పడకుండా డార్మెటరీలు, షామియానాలు ఏర్పాటు చేశారు. వీఐపీలు, దాతలు, ప్రజాప్రతినిధులు, మంత్రులు తదితర ముఖ్యమైనవారికి అన్ని రకాల సౌకర్యాలతో సుమారు 170 గదులు సిద్ధం చేశారు.

**ఖర్చంతా దాతలదే**

దాతలు సమర్పించిన రూ.3 కోట్లను ఉత్సవాలకు ఖర్చు చేయనున్నారు. లక్ష్మి, గణపతి, నవగ్రహ, ధ్వజస్తంభం, యాగశాల, మంటపాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన, ఐదు రాజగోపురాలకు, ఐదు ముఖద్వారాలకు రంగులు, రుత్వికులు, వేదపండితులు తదితర వాటి కోసం ఖర్చు చేస్తున్నారు. మూడు రోజులు భక్తులకు అన్నదానం చేయనున్నారు. చివరి రోజు 3వ తేదీన పూల వర్షం కురిపించేందుకు బెంగళూరుకు చెందిన మంజునాథ్ అనే భక్తుడు హెలికాప్టర్‌ను ఏర్పాటు చేసినట్లు



ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దీనికి ప్రభుత్వ అనుమతి కూడా తీసుకున్నామన్నారు.

**ఐదుగురు పీఠాధిపతుల రాక**

ఈరన్న స్వామి ఆలయంలో 3వ తేదీన జరిగే ప్రధాన ఘట్టానికి ఐదుగురు పీఠాధిపతులు రానున్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, పుష్పగిరి మఠం పీఠాధిపతి శంకరాచార్య, విద్యానృసింహ భారతిస్వామి, శ్రీశైల పీఠాధిపతులు చెన్నసిద్ధరామ శివాచార్య స్వామి, మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, హాల్వి మఠం పీఠాధిపతి అభినవ మహాంత మహాస్వాములు పాల్గొంటున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

ఫిబ్రవరి 1: ఉదయం 9:45 గంటలకు వేద పండితులతో ఆలయంలో అఖండ దీపారాధన, గోపూజ, గణపతి పూజ, దీక్షధారణ, త్రిశూల పూజ చేస్తారు. సాయంకాలం 4:30 గంటలకు మృత్సంగ్రహణం, మూలమంత్రహోమం, ధ్వజారోహణం ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. 2న ఉదయం 9 గంటలకు వాస్తు పూజ, హోమం, క్షీరాభిషేకం, జలాధివాసం, సాయంత్రం 4 గంటలకు విగ్రహాలు, రాజగోపురాల కలశాలతో గ్రామంలో భారీ ఊరేగింపు చేపట్టనున్నారు. చివరి రోజు 3న పీఠ పూజ, నవరత్నాన్యాసం, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 11:59 గంటలకు జీవన్యాసం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణం వంటి నిర్వహిస్తారు.

చురకలు



## తిరుపతి మురుగంతా చెరువులకు

రేణిగుంట : తిరుపతి నగర పాలక సంస్థ నిర్లక్ష్యం రేణిగుంట మండలానికి శాపంగా పరిణమిస్తోంది. నగరంలోని మురుగు నీరు రేణిగుంట మండలంలోని చెరువుల్లోకి చేరడంతో జలకాలుష్యంతో పాటు ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తిరుపతి నగరపాలక సంస్థ నుంచి వచ్చే మురుగు, వ్యర్థాల నీటిని శుద్ధి చేసే ప్లాంటును గతంలో తూకివాకం పంచాయతీలో నిర్మించారు. 25 ఏళ్ల కిందట అప్పటి జనాభాకు సరిపడేలా ఏర్పాటు చేశారు. అనంతరం తిరుపతి నగరం విస్తరించడంతో ఈ ప్లాంటు సరిపోవడం లేదు. దీంతో చెన్నయ్యగుంత వద్ద 2017లో శుద్ధి చేసే ప్లాంటు నిర్మాణానికి శ్రీకారం చుట్టినా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. వైకాపా ప్రభుత్వం పూర్తిగా పక్కన పడేసింది. దీంతో నీరు శుద్ధి కాకుండానే రేణిగుంట మండలంలోని వెంకటాపురం, అన్నస్వామిపల్లె, కరకంబాడి, తిమ్మయ్యగుంత చెరువులకు చేరుతోంది. ఈ చెరువుల



కింద 500 ఎకరాల వరకు ఆయకట్టు రైతులు మురుగు నీటితో అల్లాడుతున్నారు.

**నాలుగు చెరువుల కింద సమస్య**

ఇప్పటి వరకు చెరువులు మాత్రమే మురుగు గుంతలుగా మారిపోవడంతో చేపల వ్యాపారం తగ్గుముఖం పట్టింది. ఈ చెరువుల్లోని చేపలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఆయకట్టులోని వ్యవసాయ భూములు సైతం నిస్సారంగా మారుతున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి..**

చెరువులు కలుషితమవుతున్న విషయం ఇటీవలే గుర్తించాం. ఇక్కడ మురుగునీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై తమశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.హరి, ఏఈ, ఇరిగేషన్ శాఖ, రేణిగుంట

## రుయా.. వేడినీళ్లు లేవయా..!

తిరుపతి : చలికాలంలో సామాన్యులు సైతం వేడినీళ్లపై ఆధారపడుతారు. స్నానానికి.. తాగడానికి తప్పక వినియోగిస్తారు. అలాంటిది ఆస్పత్రి పడకలపై ఉన్న బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులకు వేడినీళు ఎంతో అవసరం. రుయా, ప్రసూతి ప్రభుత్వ ఆస్పత్రి, చిన్నపిల్లల విభాగాల్లో వేడినీటి సరఫరా లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

వెయ్యికిపైగా పడకల సామర్థ్యం ఉన్న రుయాలో వేడినీళ్లు పూర్తిగా రోగులకు అందడం లేదు. 80 పడకల సామర్థ్యం ఉన్న పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ఏ క్లాస్ గదుల వార్డులో మాత్రమే అప్పుడప్పుడూ వేడినీళ్లు వస్తాయి. ఇటీవల గీజర్లు పనిచేయక అక్కడా వేడినీటి సరఫరా లేదనే విమర్శలున్నాయి. వృద్ధుల వార్డులోనూ వేడినీళ్ల వెసులుబాటు లేదు. చలికాలంలో పడకలపై ఉన్న వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



**చిన్నపిల్లల ఆసుపత్రిలో తాగునీటికీ కటకటే**

చిన్న పిల్లల ఆస్పత్రిలో వేడినీళ్లు కాదు కదా.. తాగునీరు అందని దుస్థితి. కొంతకాలం కిందట మంచినీటి సరఫరా నిమిత్తం కుళాయిలు అమర్చారు. వాటిలోనూ సరఫరా లేకపోయింది. చిన్నారులు, నవజాత శిశువులు ఉండే వార్డుల్లోనూ వేడినీళ్లు సరఫరా చేయడం లేదు. అక్కడున్న క్యాంటీన్‌ను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. ః ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో గీజర్లు ఉన్నా నిర్వహణ సరిగా లేకపోవడంతో వేడినీళ్లు నిరంతరం అందడం లేదు. లేబర్ రూమ్ మినహా మిగిలిన వార్డుల్లో వదలడం లేదనే విమర్శలున్నాయి. తిరుపతి, సమీప ప్రాంతాలకు చెందిన వారు ఆహారం తరహాలో ఇంటి నుంచి వేడినీళ్లు తెచ్చుకొనే పరిస్థితి ఉంది.

**నిర్వహణ లేక పాడైన పరికరాలు**

రుయాకు వచ్చే రోగుల సౌకర్యార్థం కొవిడ్ సమయంలో 500 వరకు గీజర్లు ఏర్పాటు చేశారు. తర్వాత నిర్వహణ విస్మరించడంతో చాలావరకు మూలన పడేశారు. బాలింతలు, చిన్నారులు, వృద్ధుల కోసమైనా గీజర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనిపై ప్రసూతి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి వివరణ కోరగా.. బాలింతలకు వేడినీళ్లు అందజేస్తున్నామని, ఎక్కడైనా రాకుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## తూకాల్లో మాయాజాలం

గుంతకల్లు : రైతులు పండించిన కందులను కొనుగోలు చేసి మేలు చేయాలని కూటమి ప్రభుత్వం భావించగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో తూకాల్లో భారీ మోసాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 12 వరకు తేమ శాతం మించరాదన్న నిబంధన ఉంది. ఇదే అదునుగా భావించి కందుల తేమ శాతంలో వ్యత్యాసాల కారణంగా రైతుల నుంచి 50 కిలోల సంచి తూకం వేసే సమయంలో అదనంగా 100 నుంచి 150 గ్రాముల వరకు అదనంగా తీసుకుంటున్నారు.

**నిబంధనల పేరుతో లాలూచీ**

తూకం వేసేటప్పుడు సంచి తూకం 550 గ్రాములు ఉండగా మార్క్‌ఫెడ్ నిబంధనలు ప్రకారం సంచి తూకం 750 గ్రాములు వస్తుందని 200 గ్రాముల వరకు అదనంగా తేమశాతం చూపి ఒక్కో సంచి బరువు 51.100, లేదా 51.150 బరువు ఉండేలా తీసుకుంటున్నారు. కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 700 క్వింటాళ్ల పట్టినట్లు మార్క్‌ఫెడ్ ప్రతినిధులు తెలిపారు.

కందుల కేంద్ర ప్రారంభించిన రోజు తేమశాతం వ్యత్యాసాలు రాకుండా రైతులు ఇబ్బందులకు గురి కాకుండా ఉండాలనే ఉద్దేశంతో క్వింటాకు 50 గ్రాముల అదనంగా తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. అదికూడా క్వింటాకు తీసుకోమంటే మార్క్‌ఫెడ్ వాళ్లు 50 కిలోలకే 100 నుంచి 150 గ్రాములు అదనంగా తీసుకుంటూ రైతుల్ని మోసం చేస్తున్నారు.దీనిపై మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి వివరణ తీసుకోగా నిబంధనలు ప్రకారం ఒక్కో సంచి 51 కిలోల తూకం మాత్రమే ఉండాలన్నారు. 51 కిలోలకు అదనంగా తీసుకుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# 'హంద్రీనీవా'కు రాజకీయ గ్రహణం



అనంతపురం : కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న సాగునీటి ప్రాజెక్టుల్లో హంద్రీనీవా ఒకటి. సీమ జిల్లాల తాగు, సాగునీటి ప్రయోజనాలు తీరుస్తోంది. ఈ ప్రాజెక్టు కింద ఉన్న మొత్తం 6 లక్షల ఎకరాల్లో సగానికిపైగా ఉమ్మడి అనంత జిల్లాలోనే ఆయకట్టు ఉంది. ఇంతటి కీలకమైన అనంత హంద్రీనీవా ప్రాజెక్టు (హెచ్ఎన్ఎస్ఎస్) పర్యవేక్షక ఇంజినీరు (ఎస్ఈ) పోస్టు భర్తీకి 'రాజకీయ' గ్రహణం పట్టుకుంది. జలవనరులశాఖలో పనిచేస్తున్న ఓ కీలక అధికారి తన స్వార్థ ప్రయోజనాల కోసం ముఖ్య ప్రజాప్రతినిధులను సైతం మభ్యపెడుతున్నారు. ఆ పోస్టు భర్తీ కాకుండా మోకలడ్డుతున్నారు. సుదీర్ఘకాలంగా అటకెక్కిన ఎస్ఈల పదోన్నతి వ్యవహారాన్ని రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వం చాకచక్యంగా పరిష్కరించింది. ఇందులో భాగంగా ఈనెల 11న రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన 41 మంది ఈఈలకు అడహక్ ఎస్ఈలుగా పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా ఇక్కడి హంద్రీనీవా ఎస్ఈ పోస్టు తప్పక భర్తీ అవుతుందని అందరూ భావించారు. ఇద్దరు ఈఈలు సైతం తీవ్ర పోటీ పడ్డారు. కానీ.. సదరు కీలక అధికారి తనకున్న పరిచయాలతో ఆ పోస్టు భర్తీ కాకుండా చక్రం తిప్పారన్న చర్చ జోరుగా సాగుతోంది.

**ఆధునికీకరణ పనులపై ప్రభావం**

గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో హంద్రీనీవా, హెచ్చెల్సీ మరమ్మతు, నిర్వహణ కోసం నయాపైసా నిధులు ఇవ్వలేదు. ప్రస్తుత తెదేపా కూటమి ప్రభుత్వం ఆరు నెలలోపే హంద్రీనీవా తొలి దశ ప్రధాన కాలువ విస్తరణ, రెండో దశ, పుంగనూరు ఉప కాలువ (పీబీసీ) లైనింగ్‌తో ఆధునికీకరించే బృహత్తర పనులకు పూనుకుంది. ఇందుకు ఈ మూడింటికీ ఏకంగా రూ.1952.3 కోట్లు మంజూరు చేయడం రికార్డు. ఇప్పటికే టెండర్లు సైతం ఖరారయ్యాయి. తొలి దశ ప్రధాన కాలువ పనులు కూడా సాగుతున్నాయి. నీటి సీజన్ పూర్తికాగానే అటు హెచ్చెల్సీ, ఇటు హంద్రీనీవా పెండింగ్ పనులు పునఃప్రారంభం అవుతాయి. ఈ క్రమంలో కీలక హంద్రీనీవా ఎస్ఈ, ఈఈ పోస్టుల భర్తీ చేయాల్సి ఉంది. లేదంటే రూ.1952.3 కోట్ల అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి ఉంది.

**ఒకే అధికారికి ఐదు పోస్టులా..!**

జలవనరులశాఖలో హంద్రీనీవా ఎస్ఈ పోస్టు ఒక్కటే కాదు.. కీలక కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ) పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. అత్యంత దయనీయం ఏమంటే.. ఒక అధికారికి ఏకంగా ఐదు పోస్టుల బాధ్యతలు ఇవ్వడం సంచలనం రేపుతోంది. హెచ్చెల్సీ ఐ (ఇన్విస్టిగేషన్) డివిజన్ ఈఈ రాజాకు అదనంగా నాలుగు పోస్టులు ఇన్‌ఛార్జి ఇవ్వడం ప్రస్తావనార్హం. హంద్రీనీవా ఉప సీఈ, హెచ్చెల్సీ ఉప ఎస్ఈ, డీసీ, లోకలైజేషన్ డివిజన్లను కూడా ఆయనకు అప్పగించారు. హెచ్చెల్సీ గుంతకల్లు, అనంత డివిజన్లకు కూడా ఇన్‌ఛార్జీలే పనిచేస్తున్నారు. హంద్రీనీవాలోనూ డివిజన్-6లో మాత్రమే రెగ్యులర్ ఈఈ ఉన్నారు. డివిజన్-7, పెనుకొండ డివిజన్లకు కూడా ఇన్‌ఛార్జిలే దిక్కుగా మారింది. పదోన్నతి కోసం నిరీక్షించే సీనియర్ డీఈలు పదుల సంఖ్యలో ఉన్నా ఎవరికీ ఈఈ ఇన్‌ఛార్జి ఇవ్వలేదు.

# పట్టాతోనే నెగ్గుకురాలేం!



అనంతపురం :ఒకప్పుడు బీటెక్ పూర్తి చేయగానే సాఫ్ట్‌వేర్, పారిశ్రామిక, నిర్మాణ రంగాల్లో సులువుగా ఉద్యోగాలు వచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సాఫ్ట్‌వేర్ కుదేలై ఇప్పుడిప్పుడే కోలుకుంది. ఈ సంవత్సరం కొంత మెరుగుపడింది. సాధారణ బీటెక్ పట్టా సరిపోదు. అదనపు పరిజ్ఞానం అవసరం. పారిశ్రామిక రంగంలో ఇంటర్న్‌షిప్ చేయాలి. లేదా బీటెక్ పూర్తి చేసిన వెంటనే స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేయాల్సి ఉంటుంది. బీటెక్‌లో 90 శాతం మార్కులు సాధించినా ఉద్యోగాలు రావు. అదనపు కోర్సులు, నైపుణ్యం ఉంటేనే కొలువులు దక్కుతున్నాయి. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సుకే కాదు. బీటెక్‌లో ఏ విభాగం అయినా పర్వాలేదు. సర్టిఫికెట్ కోర్సులు తప్పనిసరిగా చేసి ఉండాలి. జావా, పైథాన్, పీహెచ్‌పీ, హెచ్‌టీఎంఎల్5, ఒరాకిల్, మ్యాంగోడిబీ, ఎంవైఎస్ క్యూఎల్ వంటి అంశాల్లో ప్రావీణ్యం సంపాదించి ఉండాలి. ఎస్కేయూ, జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ అభ్యసించి, సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసుకొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు కొత్త విషయాలను సూచిస్తున్నారు.

**సంస్థలకు అవసరమైన నైపుణ్యంతోనే - ఇమాముల్ హక్, ఎస్కేయూ**

ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తి చేశాను. గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్ సంస్థలో హెచ్ఆర్ లీడ్‌గా పనిచేస్తున్నాను. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు రావడం అంత సులువు కాదు. బీటెక్‌తోపాటు నైపుణ్యాలు అవసరం. స్వల్పకాలిక కోర్సు ద్వారా నైపుణ్యం పెంచుకొన్నందుకు ఉద్యోగం దక్కింది. సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేసే స్థాయిలో ఉన్నాను. జావా, పైథాన్, ఒరాకిల్ కోర్సులు చేయాలి. కళాశాలల్లో ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగం సాధిస్తే ఇబ్బంది లేదు.

**అమ్మాయిలకు ఎన్నో అవకాశాలు - స్నేహాంజలి, ఎస్కేయూ**

నేను ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాను. ఇంజినీరింగ్ చేస్తున్న సమయంలోనే కళాశాల సహకారంతో పైథాన్ కోర్సు చేశాను. హాక్డివా ఉమెన్ కాంటెస్ట్‌లో రాతపరీక్ష, మౌఖిక పరీక్షలో నెగ్గాను. పైథాన్ చేయడం వల్ల ఆ సంస్థ నిర్వహించిన పరీక్షల్లో సులువుగా రాణించాను. ప్రస్తుతం హాక్డివా సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. మహిళలకు మాత్రమే ఉద్యోగాలున్న సంస్థలు కూడా ఉన్నాయి. కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ చేయడం నేర్చుకొంటే మహిళలు ఉద్యోగాలు సాధించవచ్చు.

**సబ్జెక్టుపై పట్టు సాధించాలి - ఇంతియాజ్, జేఎన్‌టీయూ**

జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. ఓ పారిశ్రామిక సంస్థలో ఉద్యోగ అవకాశం వచ్చింది. రూ.6 లక్షల వార్షిక వేతనం ప్రకటించారు. మెకానికల్ ఇంజినీరింగ్‌కు గత సంవత్సరం వరకూ తక్కువ అవకాశాలుండేవి. ఎల్అండ్‌టీ, జిందాల్ పరిశ్రమలు ఉద్యోగాలు కల్పించడానికి ముందుకు వస్తున్నాయి. మెకానికల్ చేసినా, కంప్యూటర్ సైన్స్‌తో సంబంధం ఉన్న సర్టిఫికెట్ కోర్సులు చేయాలి.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత

కదిరి : గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత వైద్యసేవలకు అడ్డంకిగా మారుతోంది. చాలాకేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులు చాలాకాలంగా ఖాళీలు ఉన్నా భర్తీ చేయడంలో జాప్యం జరుగుతోంది. సిబ్బందిని భర్తీ చేస్తేనే సేవలు అందే అవకాశం ఉంది.

శ్రీసత్యసాయి జిల్లాలో 47 ప్రాథమిక, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, నర్సుల కొరత లేదు. 47 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 70 మంది వైద్యులకుగాను 68 మంది ఉన్నారు. రెండు ఖాళీలున్నాయి. స్టాఫ్‌నర్సులు 126 మందికిగాను 113 మంది, ల్యాబ్ టెక్నీషియన్స్ 47 కిగాను 41 మంది పనిచేస్తున్నారు. మలేరియా విభాగంలో 27 ల్యాబ్ టెక్నీషియన్స్‌కుగాను 27, ఫార్మసిస్టు పోస్టులు 45కిగాను 5 ఖాళీగా ఉన్నాయి. ఎంఎల్‌హెచ్‌పీలు 3, ఏఎన్ఎంలు 2, ఆశా కార్యకర్తలు 37, ఎల్‌జీఎస్ 4 చొప్పున పోస్టులు జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్నాయి.

**రోజూ 50 నుంచి 60 మంది రోగులు**

ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సరిపడా లేకపోవడంతో వివిధ రోగాలతో ఆసుపత్రులకు వస్తున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోజూ 50 నుంచి 80 మంది వరకు సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో బాధపడే రోగులు, గర్భిణులు వస్తుంటారు. వీరికి సక్రమంగా సేవలు అందడం లేదు.

**సిబ్బందిపై ఒత్తిడి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆ భారం ఇతర సిబ్బందిపై పడుతోంది. పోస్టులు ఖాళీ ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో, వైద్యులు, నర్సులు సెలవులో ఉన్న సమయాల్లో మిగిలిన సిబ్బంది 12 గంటలపాటు పనిచేయాల్సిన పరిస్థితి. దీంతో వైద్య



సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సిబ్బంది ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోంది.

**ప్రైవేట్ ల్యాబ్‌లే దిక్కు : ఆనంద్‌బాబు, తలుపుల**

తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పదిహేనేళ్లుగా ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు అందుబాటులో లేనికారణంగా రోగులు సొంతంగా ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది.

**ఖాళీల భర్తీకి చర్యలు : ఫైరోజా బేగం, జిల్లా వైద్యాధికారిణి**

జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. సిబ్బందిని నియమించి ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యసేవలు పూరిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటాం.

## స్మార్ట్‌గా నడుపుదాం.. ఇక కొత్త కార్డుల జారీ

పుత్తూరు : పుత్తూరుకు చెందిన వ్యక్తి ఒకరు ఏడాదిన్నర కిందట కారు కొన్నారు. అప్పటి నుంచి ఆర్‌సీ రాలేదు. ఆయన పక్క రాష్ట్రానికి వెళ్లినపుడు పోలీసులు ఆర్‌సీ అడగ్గా తన వద్ద ఉన్న డిజిటల్ పత్రాన్ని చూపారు. ఒరిజినల్ కార్డు లేకుంటే చలానా చెల్లించాలని చెప్పడంతో అవాక్కయ్యాడు. విధిలేని పరిస్థితుల్లో అపరాధ రుసుము చెల్లించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్(ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్(డీఎల్)లు తీసుకునే వారికి కూటమి ప్రభుత్వం మంచి వార్త చెప్పింది. వైకాపా హయాంలో నిలిపేసిన స్మార్ట్ కార్డులు మళ్లీ అందజేయాలని నిర్ణయం తీసుకోవడంతో వాహన చోదకుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. లైసెన్సులు పొందిన చోదకులు సదరు కార్డులు పొందేందుకు అర్హులని పేర్కొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేల సంఖ్యలో త్వరలో కార్డులు జారీ చేయనున్నారు.

**రెండేళ్లుగా కార్డులు ఇవ్వక..** వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలంటే ఆర్టీవో కార్యాలయంలో వాహన చోదక పరీక్షల్లో ఉ




త్తీర్ణత సాధించాలి. వైకాపా హయాంలో రెండేళ్లుగా డ్రైవింగ్ వాహనా రిజిస్ట్రేషన్ కార్డుల జారీ నిలిపేసింది. వాటికి బదులుగా ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ చూసుకోవచ్చని చెప్పింది. ఈ నిబంధనలు వాహన చోదకులకు ఇబ్బందిగా మారాయి. ప్రమాదాలు జరిగినపుడు బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొనేవారు.


**రూ.235 చెల్లిస్తే పోస్టు ద్వారా..** డీఎల్, ఆర్‌సీలకు మళ్లీ స్మార్ట్‌కార్డులు అందజేయనున్న నేపథ్యంలో రవాణాశాఖ నిర్వహించే ఈ-ప్రగతి పరివాహన్ పోర్టల్‌లో నమోదు అవకాశం కల్పించారు. కార్డు ఫీజు రూ.200, పోస్టు ద్వారా పంపడానికి రూ.32, ఇతరత్రా కలిపి రూ.235 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. గతంలో డబ్బులు చెల్లించినా కార్డులు రాలేదని, ఇప్పుడు టెండర్ల ప్రక్రియ నిర్వహించకుండా ఫీజు వసూలు చేయడంపై వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వైకాపా హయాంలో వాహనదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము గుత్తేదారుకు ఇవ్వకపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కచ్చితంగా కార్డులు వచ్చేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

**రుసుము చెల్లిస్తే కార్డులు వస్తాయి..**

ప్రభుత్వం వాహన చోదకులకు డీఎల్ కార్డుల జారీకి ఉత్తర్వులు ఇచ్చింది. రుసుం చెల్లించిన వాహన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు కార్డులు పొందే అవకాశం కల్పించింది. కార్డులు ముద్రణ పూర్తయింది. రుసుం చెల్లించిన వెంటనే కార్డులు తపాలాలో పంపుతున్నారు.చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు

## కుప్పంలో అక్రమాలకు ఉపాధి

కుప్పం : వైకాపా హయాంలో 2019 నుంచి 2024 వరకు కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉపాధి హామీ ద్వారా రూ.236 కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్లకు సంబంధించి.. రామకుప్పం మండలంలో అత్యధికంగా రూ.72.65 కోట్లు, కుప్పంలో రూ.63.56 కోట్లు, శాంతిపురంలో రూ.60 కోట్లు, గుడుపల్లెలో రూ.49.80 కోట్లు వ్యయం చేశారు.పులివెందుల తరహాలో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని వైకాపా హయాంలో సాక్షాత్తు నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ప్రగతి పనులు అటుంచి



అక్రమంగా ఆరగించడంలో మాత్రం దూసుకెళ్లారని తేటతెల్లమవుతోంది. ఈ నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో నిధుల వ్యయంపై జరుగుతున్న విజిలెన్స్ విచారణలో ఈ విషయమే స్పష్టమవుతోంది. స్థానిక తెదేపా నేతలు కూటమి ప్రభుత్వానికి లేఖ రాయగా విచారిస్తున్న అధికారులకు ఈ విషయమే వెల్లడవుతోంది.

**కొవిడ్ సమయంలో అత్యధికంగా..**

ప్రజలను గడగడలాడించిన కరోనా మహమ్మారి (కొవిడ్) కాలంలోనే అత్యధికంగా ఉపాధి నిధులు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కరోనా తీవ్రతతో జనం చాలా వరకు ఇళ్లకే పరిమితమైన 2020-21 ఆర్థిక సంవత్సరంలో.. నాలుగు మండలాలకు రూ.68.78 కోట్లు ఖర్చు చేశారు. రామకుప్పం మండలంలో రూ.20.15 కోట్లు, కుప్పంలో రూ.16.79, రామకుప్పంలో రూ.19.12, గుడుపల్లెలో రూ. 12.72 కోట్లను ఉపాధి పనులకు వెచ్చించారు. కొవిడ్ భయాందోళనతో కూలీలు చాలా వరకు ఉపాధి పనులకు వెళ్లలేదు. ప్రభుత్వ కార్యాలయాలు సైతం మూతపడిన విషయం తెలిసిందే.

**అధికారం అండతో అక్రమాలకు తెరతీసి..**

కరోనా కాలాన్ని సద్వినియోగం చేసుకున్న అక్రమార్కులు ఉపాధిలో అక్రమాలకు తెరతీసినట్లు స్పష్టమవుతోంది. నాలుగేళ్లకు గాను రూ.167 కోట్లు ఖర్చు చేయగా.. కరోనా ఏడాదిలో రూ.68.78 కోట్లు వ్యయం చేసినట్లు గణాంకాలు ఉండటంతో అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో అధికారం అండతోనే సామాజిక తనిఖీలను తూతూమంత్రంగా ముగించినట్లు స్పష్టమవుతోంది.

**విజిలెన్స్ అధికారుల ఆరా**

తిరుపతికి చెందిన విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించి ఉపాధి నిధుల వ్యయం వివరాలు సేకరించారు. నెలన్నర కిందట మండల ప్రజాపరిషత్తు, ఉపాధి కార్యాలయాల్లో వీరు రహస్యంగా వివరాలు తీసుకెళ్లగా.. తాజాగా మరోదఫా సేకరించారు. త్వరలోనే సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

## వైష్ణవి చైతన్య.. క్యూట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్!!

టాలీవుడ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య గురించి అందరికీ తెలిసిందే. టాలెంట్ ఉన్న తెలుగు అమ్మాయిలకు సినీ ఇండస్ట్రీలో కచ్చితంగా అవకాశాలు వస్తాయని చెప్పడంలో బెస్ట్ ఎగ్జాంపుల్ గా నిలిచింది. షార్ట్ ఫిల్మ్ ద్వారా కెరీర్ స్టార్ట్ చేసిన అమ్మడు.. లవ్ ఇన్ 143 అవర్స్, సాఫ్ట్ వేర్ డెవలపర్, మిస్సమ్మ వంటి పలు సిరీసులతో అలరించింది. అలా వివిధ వెబ్ సిరీసులతో యూత్ లో మంచి పాపులారిటీ సంపాదించుకుంది. అదే సమయంలో సినిమాల్లో చిన్న క్యారెక్టర్స్ చేయడం స్టార్ట్ చేసిన అమ్మడు.. టచ్ చేసి చూడుతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గీత గోవిందం, అల వైకుంఠపురంలో, టాక్ జగదీశ్, వరుడు కావలెను వంటి సినిమాల్లో యాక్ట్ చేసింది బ్యూటీ. ఆ తర్వాత ఒక్కసారిగా ఆమె సుడి తిరిగిందని చెప్పాలి. బేబీ మూవీ హీరోయిన్ గా ఛాన్స్ వైష్ణవి సొంతమైంది. ఆనంద్ దేవరకొండ



హీరోగా సాయి రాజేష్ దర్శకత్వం వహించిన ఆ సినిమాకు హార్ట్ అండ్ సోల్ ఆమెనే చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. అంతలా తన యాక్టింగ్ తో అన్ని వర్గాల ప్రేక్షకులను ఓ రేంజ్ లో ఆకట్టుకుంది. రూ.100 కోట్లు సాధించిన ఆ సినిమాకు గాను ఫిల్మ్ ఫేర్ అవార్డు సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆమెకు ఒక్కసారిగా క్రేజీ బ్యూటీ గా మారిపోయింది. పలు సినిమా అవకాశాలు దక్కించుకుని నటిస్తోంది. అదే సమయంలో వైష్ణవి చైతన్యకు సంబంధించిన కొన్ని బ్యూటిఫుల్ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. నిజానికి.. వైష్ణవి బర్త్ డే రోజు పెట్టిన పోస్ట్ ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతోంది. అందులో ఒక్కో పిక్ వేరే లెవెల్ లో ఉంది. ప్రతి ఫోటోలో ఆమె ఇచ్చిన ఎక్స్ప్రెషన్స్ వేరే లెవెల్ అని చెప్పాలి. క్యూట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్ గా నిలిచింది. తన గ్లామరస్ స్కిన్ టోన్ తో ఫిదా చేస్తుంది. ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ ఔట్ ఫిట్స్ లో క్లీన్ బౌల్డ్ చేస్తుందనే చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ప్రస్తుతం వైష్ణవి పిక్స్ ఉన్న పోస్ట్ పై నెటిజన్లు తెగ రెస్పాండ్ అవుతున్నారు. బేబీ బ్యూటీ సో క్యూట్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అందమే అసూయ పడుతుందేమోనని ఆకాశానికెత్తేస్తున్నారు. అమ్మడు పిక్స్ అదిరిపోయాయని అంటున్నారు. అట్రాక్ట్ అయిపోతున్నామని చెబుతున్నారు. సో నైస్ మేడమ్ అంటూ సందడి చేస్తున్నారు నెటిజన్లు.. వైష్ణవి అభిమానులు..

## రుక్మిణిని ఆపడం కష్టమే ఇక..!

కన్నడ భామలకు తెలుగులో సూపర్ ఫాలోయింగ్ ఉంటుంది. ప్రస్తుతం నేషనల్ మొత్తం షేక్ చేస్తున్న రష్మిక మందన్న కూడా కన్నడ పరిశ్రమ నుంచి వచ్చి టాలీవుడ్ లో పాపులర్ అయ్యాకే పాన్ ఇండియా లెవెల్ లో క్రేజ్ తెచ్చుకుంది. రష్మిక దారిలోనే మరికొంతమంది హీరోయిన్స్ టాలీవుడ్ బాట పడుతున్నారు. అందులో తన క్యూట్ లుక్స్ తో ఆల్రెడీ తెలుగు ఆడియన్స్ మనసులు కాజేసిన రుక్మిణి వసంత్ కూడా ఉంది. కన్నడలో సప్త సాగర దాచె ఎల్లో సినిమా చేసిన రుక్మిణి ఆ సినిమా తెలుగు వెర్షన్ సప్త సాగరాలు దాటితో మెస్మరైజ్ చేసింది. ఆ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్



కాకపోయినా రుక్మిణికి మాత్రం మంచి పాపులారిటీ వచ్చింది. ఐతే అమ్మడి టాలీవుడ్ ఎంట్రీ గ్రాండ్ గా ప్లాన్ చేస్తుండగా సైలెంట్ గా నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసింది. ఐతే అది ఎలా వచ్చిందో అలా వెళ్లింది. ఇక లేటెస్ట్ గా అమ్మడు ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో ఛాన్స్ అందుకుందని టాక్. ఎన్టీఆర్ నీల్ సినిమాకు రుక్మిణి దాదాపు కన్ ఫర్మ్ అన్నట్టే లెక్క. ఐతే అమ్మడు ఆ సినిమా చేస్తే మాత్రం తప్పకుండా నెక్స్ట్ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనేలా ఉంటుందని చెప్పొచ్చు. రుక్మిణి కూడా టాలీవుడ్ టాప్ చెయిర్ మీదే కన్నేసినట్టు తెలుస్తుంది. తారక్ తో ఛాన్స్ అది కూడా ప్రశాంత్ నీల్ సినిమా కాబట్టి సినిమా ఎలా లేదన్నా అదరగొట్టేస్తుందని చెప్పొచ్చు. ఐతే ఈ సినిమా ఓకే అవ్వడమే ఆలస్యం రుక్మిణి కోసం తెలుగు దర్శక నిర్మాతలు క్యూ కడుతున్నట్టు తెలుస్తుంది. ఎన్టీఆర్ సినిమా పూర్తయ్యే దాకా వేరే సినిమా చేసే ఛాన్స్ లేదు. అందుకే రుక్మిణి మరో సినిమా సైన్ చేయలేదని తెలుస్తుంది. ఐతే తారక్ సినిమా పూర్తై రిలీజ్ అయితే మాత్రం రుక్మిణిని ఆపడం ఎవరి వల్లా కాదనిపించేలా క్రేజ్ తెచ్చుకుంటుందని చెప్పొచ్చు. ఆల్రెడీ యూత్ అంతా అమ్మడి మాయలో పడిపోగా ఎన్టీఆర్ సినిమాతో టాప్ రేంజ్ కి వెళ్లబోతుంది. సో టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చినట్టే అని సౌండ్ చేయాల్సిందే అని చెప్పొచ్చు.




## 'మే'లో మూడు భారీ సినిమాలు.. పండగే పండగ..



2025లో అప్పుడే రెండు నెలలు కంప్లీట్ అయిపోయాయి. అయితే ఇప్పటి వరకు అనేక సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యాయి. కొన్ని హిట్స్ గా మారాయి. మరికొన్ని అంచనాలకు మించి రాణించాయి. ఇంకొన్ని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టాయి. అయితే ఎప్పటిలానే పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. అయితే మార్చిలో వివిధ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. కిరణ్ అబ్బవరం దిల్ రూబా సహా అనేక చిత్రాలు రిలీజ్ కానున్నాయి. బాక్సాఫీస్ వద్ద తమ లక్ ను టెస్ట్ చేసుకోనున్నాయి. అదే సమయంలో ఇప్పుడు మే నెలలో విడుదల కాబోయే సినిమాల కోసం జోరుగా చర్చ సాగుతోంది.

నేచురల్ స్టార్ నాని.. హిట్ 3 మూవీతో మే నెలను స్టార్ట్ చేయనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో నాని అర్జున్ సర్కార్ గా పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. రీసెంట్ గా వచ్చిన టీజర్ కు ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. భారీ బజ్ క్రియేట్ చేసింది. హిట్ ఫ్రాంచైజీలో మూడో సినిమాగా వస్తుండడం, ఇప్పటికే స్ట్రాంగ్ ఫ్యాన్ బేస్ ఉండటంతో.. హిట్ 3 విజయం సాధిస్తుందని అంటున్నారు. హిట్ 3 రిలీజ్ కాబోయే మే1న కోలీవుడ్ స్టార్ హీరో సూర్య రెట్రోతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాపై మంచి హోప్స్ పెట్టుకున్నారు. రీసెంట్ గా కంగువా ఫ్లాప్ అవ్వడంతో సూర్య.. ఈ మూవీతో హిట్ కొడతారని అంతా అంచనా వేస్తున్నారు. వింటేజ్ యాక్షన్ నేపథ్య చిత్రంగా మూవీ ఉండనుందని టాక్. మే నెలాఖరులో 30వ తేదీన విజయ్ దేవరకొండ కింగ్ డమ్ విడుదల కానుంది. సినిమాలో విజయ్.. కొత్త అవతార్ లో కనిపించనున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చింది.

టీజర్ లో విజయ్ పోలీస్ గెటప్ లో ఓ రేంజ్ లో కనిపించడం, బ్యాక్ డ్రాప్ సీరియస్ అండ్ ఇంట్రెస్టింగ్ గా ఉండడంతో ఆడియన్స్ లో సినిమాపై ఆసక్తి పెరిగింది. విజయ్ నుంచి స్పెషల్ కంటెంట్ వస్తుందని అంతా అంచనా వేస్తున్నారు. ఏదేమైనా మేలో మూడు భారీ హైప్ ఉన్న సినిమాలు రిలీజ్ కానున్నాయి. దీంతో టాలీవుడ్ మూవీ లవర్స్ కు పండగే పండగ! మరి ఆ చిత్రాలు ఎలాంటి హిట్ అవుతాయో వేచి చూడాలి.


## ఇండియన్-3.. అసలేం జరుగుతోంది?



విలక్షణ నటుడు కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్ లో తెరకెక్కిన ఫస్ట్ మూవీ ఇండియన్.. ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఏఎం రత్నం రూపొందిన సినిమా.. 1996లో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఆ తర్వాత అనేక ఏళ్ల తర్వాత సీక్వెల్ ఇండియన్-2.. ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శంకర్ దర్శకత్వం వహించిన ఆ సినిమాను లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా రూపొందించాయి. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఆ మూవీ.. పూర్తిగా నిరాశపరిచింది. దీంతో సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో ట్రోల్స్ వచ్చాయి. శంకర్ మార్క్ అస్సలు కనిపించలేదని అనేక మంది రివ్యూస్ ఇచ్చారు. అదే సమయంలో ఇండియన్-3 కోసం అనౌన్స్మెంట్ వచ్చింది. ఇండియన్-2 సినిమా లాస్ట్ లో మూడో పార్ట్ ట్రైలర్ ను రివీల్ చేశారు. ఆ తర్వాత ఇండియన్ 3 నేరుగా నెట్ ఫ్లిక్స్ ఓటీటీలో విడుదల కానుందని జోరుగా ప్రచారం సాగింది. కానీ ఆ తర్వాత అదేం లేదని శంకర్ తెలిపారు. థియేటర్లలో రిలీజ్ చేస్తామని చెప్పారు. రీసెంట్ గా ఇండియన్ 3 కోసం మాట్లాడారు. ఇంకా కొన్ని సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉందని శంకర్ చెప్పారు. అవన్నీ పూర్తి కావడానికి మరో ఆరు నెలల సమయం పడుతుందని తెలిపారు. సినిమాకు సంబంధించి అన్ని కార్యక్రమాలను త్వరగా కంప్లీట్ చేసి కొన్ని నెలల్లో తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు చెప్పారు. అయితే, ఇండియన్ 2 నుంచి భారీ నష్టం వాటిల్లిన కారణంగా లైకా ప్రొడక్షన్స్.. ఇండియన్ 3 నుంచి తప్పుకుందని బలమైన ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు రెడ్ జెయింట్ మూవీస్ ఇండియన్ 3 ప్రాజెక్ట్ ను పూర్తిగా టేకోవర్ చేయాలని యోచిస్తోంది. శంకర్, కమల్ హాసన్ తో ఇండియన్ 3 ప్యాచ్ వర్క్ ను పూర్తి చేయడానికి రీసెంట్ గా చర్చలు జరిగాయట. తక్కువ టైమ్ లోనే షూటింగ్ పూర్తి చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. కానీ లైకా సంస్థ సినిమా నుంచి తప్పుకున్నప్పటికీ ఇండియన్ 3 సినిమా కోసం భారీ బడ్జెట్ ఖర్చు చేయడంతో పాటు, షూటింగ్ లో 10% మాత్రమే పెండింగ్ లో ఉండటం వల్ల వారికి సినిమాలో క్రెడిట్ ఇవ్వనున్నారు. మరి ఇండియన్ 3 మూవీ మిగతా పార్ట్ ఎప్పుడు కంప్లీట్ అవుతుందో.. ఎప్పుడు రిలీజ్ అవుతుందో వేచి చూడాలి.

## మిర్రర్ సెల్ఫీతో సెగలు పుట్టిస్తున్న శివంగి

బుల్లితెర ముద్దుగుమ్మలు అంటే ఒకప్పుడు చిన్న చూపు ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. సినిమాల్లో హీరోయిన్స్‌కి ఏ స్థాయి గుర్తింపు అయితే ఉంటుందో ఆ స్థాయిలో లేదా అంతకు మించి గుర్తింపును బుల్లి తెర ముద్దుగుమ్మలు దక్కించుకుంటున్నారు. భాష ఏదైనా బుల్లి తెరకు ఇప్పుడు మంచి గుర్తింపు లభిస్తుంది. సీరియల్స్‌కి ఈమధ్య కాలంలో మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో సీరియల్‌లో అయినా నటించేందుకు సిద్ధం అన్నట్లుగా హీరోయిన్స్ రెడీ అవుతున్నారు. వెండి తెర హీరోయిన్స్‌కి తగ్గకుండా బుల్లి తెర హీరోయిన్స్ ఇన్‌స్టాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటారు. టీవీ సీరియల్స్ ద్వారా గుర్తింపు దక్కించుకున్న హీరోయిన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుని హీరోయిన్స్‌గా ఆఫర్లు దక్కించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫోటోలు షేర్ చేస్తే ఇండస్ట్రీలో ఎంట్రీ దక్కుతుంది అనుకునే వారు చాలా మంది ఉ



న్నారు. అందుకే ఎంతో మంది అందాల ఆరబోత ఫోటోలతో మత్తెక్కిస్తూనే ఉంటారు. తాజాగా బుల్లితెర నటి శివంగి వర్మ తన అందమైన ఇన్‌స్టా ఫోటోలతో ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడు షేర్ చేసిన మిర్రర్ సెల్ఫీ ఫోటోలతో ఆకట్టుకుంది. హిందీలో ఎన్నో సీరియల్స్‌లో శివంగి వర్మ నటించి మెప్పించింది. హమారీ సిస్టర్ దీదీ, బివి ఔర్ మైన్, భూతు ఇతర ప్రాజెక్ట్‌ల్లోనూ ఈమె కనిపించింది. బుల్లి తెర ద్వారా వచ్చిన గుర్తింపుతో ఇప్పటికే సినిమాల్లోనూ ఎంట్రీ ఇచ్చింది. బిచ్చగాడు 2 సినిమాలో ఈమె చేసిన ప్రత్యేక పాటకు మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా ఈ అమ్మడు తన అందంతో ఎప్పుడూ సోషల్ మీడియా ద్వారా ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజా ఫోటో షూట్‌తో అసలు చూపు తిప్పుకోనివ్వడం లేదు. నడుము అందం చూపిస్తూ క్లీ వేజ్ షో చేసిన ఈ అమ్మడి ఫోటోలకు తెగ లైక్స్ వస్తున్నాయి. మత్తు కల్లతో మిర్రర్ ముందు నిల్చుని తన అందమైన నడుమును క్లిక్ అనిపించిన ఈ అమ్మడు నాభి అందంతో మతి పోగొడుతోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందాల ఆరబోత చేసిన ముద్దుగుమ్మ శివంగికి బాలీవుడ్‌లో మరిన్ని మంచి ఆఫర్లు దక్కాల్సిన అవసరం ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ అమ్మడి ఫోటోల జోరు, అందం, ఫిజిక్ చూస్తూ ఉంటే కచ్చితంగా భవిష్యత్తులో మంచి ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుల్లి తెర నుంచి పర్మినెంట్‌గా వెండి తెరపై ఈ అమ్మడు సందడి చేస్తుందేమో చూడాలి.

## అనన్య పొట్టి ఫ్రాకు సొగసు చూడతరమా?

నటుడు చంకీ పాండే నటవారసురాలిగా అనన్య పాండే కెరీర్ ప్రారంభించినా కానీ తన హార్డ్ వర్క్ ప్రతిభను నమ్ముకుని పరిశ్రమలో ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. %-%లైగర్%-% చిత్రంతో ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, బ్యాక్ టు బ్యాక్ మంచి విజయాలను అందుకుంది. సీఆర్‌టిఎల్, కాల్ మీ బే వెబ్ సిరీస్ లలో నటిగా నిరూపించింది. అనన్య పరిణతి చెందిన నటనతో ఆకట్టుకుంది. మరోవైపు అనన్య నిరంతర ఫోటోషూట్లు యూత్‌లో హాట్ టాపిగ్గా మారుతున్నాయి. తాజాగా వోగ్ కవర్ షూట్ నుంచి కొన్ని ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారుతున్నాయి. షార్ట్ బ్లాక్ గౌనులో థై అందాలను ఎలివేట్ చేస్తూ అనన్య ఇచ్చిన ఫోజు చూపరులను కట్టి పడేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. చిన్నప్పుడు అనన్య పాండే - సుహానా



ఖాన్ అమెరికాస్ నెక్స్ట్ టాప్ మోడల్ వంటి రియాలిటీ టీవీ సిరీస్‌లను కలిసి చూశారు. నేటికీ ఆ ఇద్దరూ పార్టీల్లో కలుస్తారు. నటీమణులు అయ్యాక మరింత క్లోజ్ గా మారారు. నేను నేనేనా? చాలా మారిపోయానని ప్రజలు అనుకుంటున్నారు అని తాజా ఫోటోషూట్ పై అనన్య స్వయంగా వ్యాఖ్యానించింది.

ఫోటోషూట్ల పరంగా అనన్య ప్రయోగాలకు యువతరం ఫిదా అయిపోతోంది. ఓవరాల్ గా అనన్య లుక్ కి మంచి మార్కులే పడ్డాయి.. ఈ కొత్త రూపంపై ఒక రేంజులో కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. మతి పోగొడుతున్న అనన్య పొడుగు కాళ్ల సౌందర్యంపై యూత్ రకరకాల కామెంట్లు చేస్తున్నారు. అనన్య పొట్టి ఫ్రాకు సొగసు చూడతరమా? అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536